# బుభుత్స

(భాషావ్యాససంపుటి)

పమ్మి పవన్ కుమార్

# bubhutsa

**(An Anthology of Essays on Telugu Language)**

**By Dr. Pammi Pavan Kumar**

**Genre: Telugu Language/Linguistics**

**© Author**
Reproduction of this anthology in any manner or measure without obtaining written permission from the author for commercial purposes will be deemed to be an offence under law. Critics, reviewers and researchers are free to quote herefrom by acknowledging the author.

**Author's Address:**
Dr. Pammi Pavan Kumar,
Assistant Professor,
Department of Telugu, Univesity of Hyderabad,
Hyderabad – 500 046, Telangana State, India.
Phone-Mobile: +91 99493 58500
e-mail: pavankpammi@gmail.com

**Year of Publication: July, 2015. (Online)**

Online Version of the Collection can be viewed at: www.languageinindia.com

**ISSN 1930-2940**

**Published from the USA.**
**Language in India** <www.languageinindia.com> is an international online monthly research journal, and is indexed in four major international databases; EBSCOHost, ProQuest (Linguistics and Language behavior Abstracts), MLA International Bibliography and Gale Research. The journal is also part of the Directory of Open Access Journals, Sweden. The journal is included in the Cabell's Directory, USA.

Board of editors of **Language in India** consists of distinguished linguists with many years of contributions to Indian Linguistics. Articles/Writings published in Language in India are peer reviewed by one or more members of the board of editors or an outside scholar who is a specialist in the related field.

Presented

To



My Teacher

Professor PARIMI RAMANARASIMHAM

who taught me Linguistics, and

ignited to continue the study…

# సంపుటిలో.. ఏ పుటలో... ?

Intellectual Refreshment – fore word by Prof. Parimi Ramanarasimham - 5

ఒకటొకటై.. సంపుటై... 6

1. తెలుగు భాషాభివృద్ధి–సంగణకాధారిత పాఠ్యప్రణాళిక ఆవశ్యకత – 8
2. వ్యాకరణ నిర్మాణంలో లాఘవం: సంగణక ఉపకరణాలు, అనువర్తనలు – 16
3. ప్రపంచీకరణయుగంలో తెలుగు బోధన: పద్ధతులు, వ్యూహాలు, అనువర్తన – 23
4. ప్రపంచీకరణయుగంలో తెలుగు బోధన: సిద్ధాంతం, ఆచరణ – 31
5. భాష: ప్రపంచీకరణ, స్థానికీకరణ, ప్రపంచ స్థానికీకరణల సంబంధం – 38
6. భాషా బోధనలో సంగణక అనువర్తనలు – 44
7. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు బోధన: సమస్యలు – 52
8. భాషా బోధన – రాతలో వచ్చే చిక్కులు, పరిష్కారాలు –62
9. ఎలక్ట్రానిక్ నిఘంటువుల నిర్మాణంలో మెలకువలు: తెలుగు – 73
10. సంగణకాత్మక తెలుగు మాండలిక నిఘంటు నిర్మాణం – 80
11. తెలుగు: సంగణకాత్మక భాషాభివృద్ధి యోజన – 86
12. ఎలక్ట్రానిక్ ద్విభాషా ద్వైదార్శనిక నిఘంటు నిర్మాణం: తెలుగు–కన్నడ – 95

Rajiv Gandhi University of Knowledge Technologies
Catering to the Educational Needs of the Gifted Rural Youth of AP

**Prof. PARIMI RAMANARASIMHAM**
**Visiting Professor &**
**Administrative Officer, Nuzvid Campus.**

Dated: 16th February, 2015.

## Intellectual Refreshment

I am very happy to see that Dr. Pavan Kumar brings out this anthology in electronic mode, making it accessible to everybody within a click of the button. Dr. Pavan Kumar is a serious researcher. He believes in rigor and originality. The papers included in this anthology throw light on a new field of research required for the present day needs to the conventional researcher in Telugu.

The papers included in this anthology, as the author himself reveals, can be grouped into three areas of applied linguistics. viz. Strategies for language development, Computer applications for language studies, and Language teaching.

I am sure this work will enrich the reader with updated information in the areas of research focused in the papers. I wish Dr. Pavan Kumar to continue his research in applied linguistics, and bring out more useful works for the benefit of the students and scholars working in the field.

**Rajiv Gandhi University of Knowledge Technologies,**
**Mylavaram Road, Nuzvid, Krishna District, Andhara Pradesh, 521 202, India.**
**< parimi@rgukt.in > < ramanarasimham46@yahoo.com >**

# ఒకటొకటై.. సంపుటై...

2011-2013 మధ్యకాలంలో జరిగిన సదస్సులకోసం రాసిన పత్రాలు ఇవి. భాషాభివృద్ధి వ్యూహాల చర్చ, సంగణక అనువర్తనల జోడింపు, భాషా బోధన అన్న ఉప శీర్షికల కిందకు ఈ పత్రాలను చేర్చవచ్చు. కొన్ని పత్రాలలో ఈ అంశాల త్రిపుటినికూడా చదువరులు సులభంగా గుర్తుంచగలుగుతారు. ఆయా సదస్సులలో చేసిన చర్చలకు అనుగుణంగా కొన్నీ, ప్రతిపాదనలను వివరించే ఉద్దేశంతో మరికొన్నీ, నిడివి దృష్ట్యా ఇంకొన్నీ పత్రాలు, సంపుటీకరించే సందర్భంలో సంస్కరింపబడ్డాయి. చదువరుల దృష్టికి తప్పనిసరిగా తీసుకెళ్ళదగిన విషయాన్ని అందించే సందర్భంలో ఈ పత్రాలలో సంక్షిప్తంగా పునరుక్తి ఉంది తప్ప, విషయ ప్రతిపాదనలో కాదని గమనించమని కోరుతున్నాను.

శాస్త్ర విషయాలకు సంబంధించి ఏ ఒక్క పత్రం ఆధారంగానో చర్చనీయాంశాన్ని పూర్తిగా గ్రహింపుకు తెచ్చుకోడం అందరికీ సాధ్యపడకపోవచ్చు. శాస్త్ర విషయాలకు, సాంకేతిక పరిజ్ఞానంకూడా తోడైనపుడు, కొత్త చదువరులకు ఇదొక సమస్యగా పరిణమించడం కొత్త కాదు. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకొని, పత్రాలలోని శైలిని నవీకరణ దశలో- సరళ, సూటి, విషయ నివేదన ప్రాధాన్య పద్ధతులలోకి మార్చడమైంది. తెలుగుపై అభిరుచి ఉన్న చదువరులకు, తెలుగు భాషను, సాహిత్యాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు, పరిశోధకులకు ఈ సంపుటి ఎక్కువ ఉపయోగకారి.

సంప్రదాయ పుస్తక ముద్రణ పద్ధతిలో కాకుండా, ఈ సంపుటిని ప్రపంచవ్యాప్త జాలంలో- విశ్వ వేదికమీద ఆవిష్కరిస్తున్నాను. ఈ తరహా ప్రచురణలవల్ల స్థల, కాల అవధులను అధిగమించవచ్చు. పరిశోధకుల వలకట్టులో సులభంగా భాగస్వాములం కావచ్చు.

ఈ సంపుటిలోని 6, 7, 8వ్యాసాలు మా విద్యార్థి మిత్రులతో కలసి రాసినవి. వీరంతా అప్పటి ఎం. ఏ. విద్యార్థులు. సదస్సులకోసం పత్రాల రచన, సమర్పణ మొదలైన విషయాలను వీరికి పరిచయం చేసే ఉద్దేశంతో మా శాఖ జరిపిన సదస్సులో ఈ విద్యార్థులను భాగం చేశాను. వీరిలో కొందరు ఇప్పుడు ఉపాధ్యాయులు, అధ్యాపకులై వెలుగుతున్నారు. మరికొందరు పరిశోధనలలో రాణిస్తున్నారు. వీరందరి వృద్ధిని కాంక్షిస్తున్నాను. ..

సంపుటిని పరిశీలించి, సమ్మతిని తెలిపి, ప్రచురిస్తున్న Language in India (<www.languageinindia.com> ISSN 1930-2940) ఎడిటోరియల్ సభ్యులందరికీ ఈ సందర్భంలో మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చివరిలో- ఒకటి, రెండు పత్రాల

యునీకోడీకరణలో, సంగణీకరణ సంబంధ దోషాల సవరణలో సహకరించిన పరిశోధక విద్యార్థి మిత్రులు శ్రీ మంత్రి మల్లేశ్, శ్రీ మల్లిపూడి రవిచంద్ర, శ్రీ శివన్న చంద్రయ్యలకు కృతజ్ఞతలు, శుభాకాంక్షలు.

ఈ సంపుటిని మా గురువుగారు ఆచార్య పరిమి రామనరసింహంగారికి బహూకృతిగా సమర్పిస్తున్నాను. నా ఎం. ఏ. రోజులలో(1996-1998) భాషాశాస్త్రంలో ఓనమాలు దిద్దించి, కంప్యూటరులో అక్షరాభ్యాసం చేయించిన గురువుగారికి శిష్యునిగా, (నా విద్యార్థి మిత్రులతో కలసి) సమర్పిస్తున్న అక్షరహారం ఇది. భాషాశాస్త్రంలో విశేషమైన కృషిచేసిన ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య చేకూరి రామారావు... వంటి మహామహులతో సన్నిహితంగా విషయచర్చ చేయడానికి ఎం.ఏ. తరగతులలో నేర్చుకొన్న భాషాశాస్త్రం నాకు ఎంతో అక్కరకు వచ్చింది. ఇందుకు గురువుగారికి గుండెనిండుగా కృతజ్ఞతలు సమర్పిస్తున్నాను. బహూకృతిగా ఈ సంపుటిని స్వీకరించమని కోరినమీదట, *Intellectual Refreshment* అంటూ సంపుటి హృదయాన్ని ఆవిష్కరించి, ఆశీఃపూర్వక సమ్మతిని తెలిపినందుకు వారికి మరొక్కసారి నమస్కరిస్తున్నాను.

ఈ సంపుటి శీర్షిక బుభుత్స. నేర్చుకోవాలన్న/నేర్పాలన్న కోరిక (*bubhutsa*= n. a desire to learn or to be taught) అని ఆ మాటకు అర్థం. అధ్యయన, అధ్యాపన రంగాలలో ఉన్నవారికి ఇటువంటి కోరిక ఉండడం ఆశ్చర్యమేమీకాదని పాఠకులు గ్రహించగలరని విశ్వసిస్తున్నాను.

01-06-2015 -పమ్మి పవన్ కుమార్

## 1. తెలుగు భాషాభివృద్ధి: సంగణక ఆధారిత పాఠ్యప్రణాళికావశ్యకత

ఈ పత్రంలో సంగణకం అనే మాటను Computer అన్న ఆంగ్లపదానికి తుల్యంగా వాడుతున్నాను. సంప్రదాయ పాఠ్యపుస్తక ఆధార బోధననుంచి, ఆధునిక సంగణక ఆధార బోధన పద్ధతులవైపుకు దశలవారీగా మన విద్యావ్యవస్థను మార్చుకోవలసిన అవసరాన్ని ఈ పత్రం వివరిస్తుంది. ఈ లక్ష్య సాధనకు తగిన (తెలుగు) భాషావనరులను రూపొందించుకోడంలో నేటి సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతున్న తీరును రేఖామాత్రంగా ఈ పత్రంలో వివరించడం జరుగుతున్నది.

### 1. సంప్రదాయ విద్యావ్యవస్థ: అవసరాలు

భారతీయవిద్యావ్యవస్థకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. అధ్యయన, అధ్యాపనాల విషయంలో మనదైనఘనచరిత్ర ఎంతో ఉంది. గురుకుల పద్ధతిలో సాగిన ప్రాచీన విద్యావ్యవస్థలో పాఠ్యప్రణాళిక గురువుల శాస్త్రపరిజ్ఞానంపై ఆధారపడి ఉండేది. నిర్ణీత విషయాలలో గురువులవద్దనుంచి విద్యార్థులు శిక్షణ పొందేవారు. గురువులు నిర్దేశించిన అన్ని అంశాలను, లక్ష్యాలను విద్యార్థులు నిర్బంధంగా పూర్తిచేయాల్సి ఉండేది. విద్యాప్రదర్శనలో తమ శిష్యులు చూపే ప్రతిభ ఆధారంగా వారి అభ్యసనస్థాయిని గురువులు అంచనా వేసేవారు. విద్యార్థుల ప్రతిభాపాటవాలకు గురువాక్యం గీటురాయిగా ఉండేది. అన్ని లక్ష్యాలను పూర్తిచేసినట్టు గురువు ప్రకటించిన తరువాతే విద్యార్థికి గురుకులవాసం పూర్తయ్యేది.

నాటి సమాజ పద్ధతులు, కట్టుబాట్లు... మొదలైన కారణాలవల్ల ఇటువంటి విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. వీరి జ్ఞానం ప్రభువర్గపుటవసరాలను తీర్చడానికి, రాజ్యపాలనలో వారికి సహకరించడానికి ఉపయోగపడేది. అప్పటి సమాజాలు ఎలా ఉండేవో చరిత్ర ఆధారంగా గ్రహించగలం గానీ, నాటి సమాజపుటవసరాలను ప్రభువర్గంలో భాగమైన ఇటువంటి విద్యార్థులు ఎంతవరకు తీర్చగలిగేవారో ఇదమిత్థంగా చెప్పలేం. సమాజ అవసరాలను తీర్చటంలో పాలకవర్గంతోపాటు, పాలితవర్గం కూడా ఎక్కువగా శ్రమించేది. ప్రాయికంగా, పాలితవర్గపుటవసరాలన్నీ పరిమితంగా ఉండేవి. పాలకవర్గ సుఖసంతోషాలపై ఆధారపడి పాలితులజీవితాలుకొనసాగేవి.

సంక్లిష్ట నిర్మాణం కలిగిన అటువంటి సమాజాలకు చాలా శతాబ్దుల చరిత్ర ఉంది. వ్యక్తుల జీవితాలను అమితంగా ప్రభావితం చేసే ఇటువంటి సమాజ నిర్మాణాలనుంచి, విద్యావ్యవస్థ నుంచి మనం ఎంతో దూరం ప్రయాణించాం. అధ్యయన, అధ్యాపనాల పరిధి విస్తరించింది. ప్రభువర్గసేవకే విద్య అన్న భ్రమనుంచి సమాజపుటవసరాలను తీర్చగలిగే మానవ వనరుల తయారీలో విద్యావ్యవస్థను ఒక భాగంగా చూడగలిగే ఆధునిక యుగంలో ప్రస్తుతం మనందరం జీవిస్తున్నాం.

## 2. ఆధునిక విద్యావ్యవస్థ: అవగాహన

ఆధునిక యుగంలో విద్యావ్యవస్థ రూపురేఖలను అనేకమైన కోణాలనుంచి పరిశీలించవలసిన అవసరం ఉంది. సంప్రదాయ గురుకుల వ్యవస్థలో బోధించే అంశాల స్థానే ఆధునిక విజ్ఞానశాస్త్ర సంబంధ విషయాలు పాదుకొన్నాయి. విద్య కేవలం మూర్తిమత్వ నిర్ణయ సాధనంగానో, ప్రభుసేవకు అవసరమయ్యేజ్ఞాన్నాన్నిచ్చేదిగానో కాకుండా, తన చుట్టూ ఉన్న వారికి, లోకానికీ కూడా ఉపయోగపడేదిగా ఉండాలన్న ఆకాంక్ష ఆధునిక యుగంలో హెచ్చింది. ఈ లక్ష్యసాధనలో ఎక్కడ ఉన్నామన్నది ప్రత్యేకంగా చర్చనీయాంశం.

మనమందరం అనుకొంటున్న ఆధునిక యుగంలోనూ – ఆధునిక విజ్ఞానశాస్త్ర సంబంధ విషయాలను ఏ భాషలలో బోధించాలి? అన్న చర్చ చాలా కాలం జరిగింది. ఆంగ్లేయుల పాలనలో వారికెదురయిన ప్రధాన మైన సమస్య బోధన ఏ భాషలో జరగాలి? అన్నది. (ఇక్కడా విద్యావ్యవస్థ ప్రభువర్గపుటవసరాలకు అనుగుణంగా రూపొందించిందే అయి ఉండడం గమనించవలసిన అంశం) భారతదేశం బహుభాషా వ్యవహారప్రాంతం కావడం ఆంగ్లేయులను మరింత కలవరపాటుకు గురిచేసింది. ఆధునిక విద్యావ్యాప్తి కోసం1813లో రూపొందించిన చార్టరు చట్టంద్వారా మంజూరయిన నిధులు ఒక దశాబ్దంపాటు (1823 వరకు) ఖర్చు కాలేదు. ఈ దశాబ్దం కాలంలో ఆంగ్లేయులు చర్చించిన అంశాలు రెండు 1. భారతదేశంలో విద్యాబోధన ఏ మాధ్యమంలో జరగాలి? 2. బోధించవలసిన అంశాలు (సబ్జెక్టులు) ఏవి?.

ఆశ్చర్యకరంగా; దాదాపు నూట డబ్బై సంవత్సరాలకు పైగా ఈ చర్చ మన విద్యావ్యవస్థలో కొనసాగుతోంది. పైన ఉదాహరించిన రెండు ప్రశ్నలు విద్యావ్యవస్థకు అత్యంత కీలకమైనవి. 'గుమాస్తాగిరి' ఉద్యోగాలకు పరిమితమైన ఆంగ్లాన్ని నాడు బోధనలో ఒక సబ్జెక్టుగా బోధించేవారు. ఇతర భారతీయ శాస్త్రాలను భారతీయ భాషలలోనే బోధించేవారు. ప్రస్తుత పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. కేవలం మొదటి భాషగా మాతృభాషలను బోధిస్తూ, తక్కిన సబ్జెక్టులన్నిటినీ ఆంగ్లంలో బోధించడం నేడు గమనిస్తున్నాం. ఆంగ్లేయుల కాలంలో విద్యావ్యవస్థ ప్రభువర్గపుటవసరాలకు అనుగుణంగా రూపొందించిందన్న అంశాన్ని పైన గమనించాం. మరి స్వాతంత్ర్యం సాధించుకొన్నాక మనమే మనకోసం రూపొందించుకున్న విద్యావ్యవస్థ ఎవరి కోసం పనిచేస్తోందన్నది గమనించవలసిన అవసరం ఉంది.

వద్దు వద్దంటూనే, నిషేధించాలంటూనే ఆంగ్లాన్ని మనపైమనమే ఎందుకు రుద్దుకుంటున్నట్టు? జ్ఞానాన్ని సంపాదించటంఅన్న లక్ష్యం నుంచి మన విద్యావ్యవస్థ కేవలం ఉపాధి అవకాశాలను చూపించగలిగే వ్యవస్థగా మారిపోవడం ఒక ప్రధానమయిన కారణంగా చెప్పుకోవాలి. ఆధునిక యుగంలో

వెలుగు చూస్తున్న శాస్త్రాలను ఆయా దేశి భాషలలో బోధించడానికి కావలసిన భాషావనరులను పెంపొందించుకోకపోడంకూడా ఒక ప్రధాన కారణం. చెప్పదలచుకొన్న విషయాలను అందించగలిగే భాషావరులు అందుబాటులో ఉన్నా వినియోగించడంలో ఉదాశీనత ప్రదర్శించడం మరో ప్రధాన కారణం. ప్రయత్నించి, అటువంటి భాషావనరులను రూపొందించుకోలేని అవస్థలు పడుతున్న సమాజంగా నాడూ–నేడూ మిగిలిపోతుండడం వెనుక ఏ కారణాలు బలంగా పనిచేస్తున్నాయన్నది గమనించాలి.

అనేకానేక హంసపాదులతో, పరిమితులతో కొనసాగుతున్న నేటి విద్యావ్యవస్థలో రాదగిన మార్పులు అనేకం ఉన్నాయి. దేశ భవిష్యత్ అవసరాలను తీర్చగలిగే మానవ వనరుల తయారీకి నేటి విద్యావ్యవస్థ మూల కారణం అవుతుందిఅన్న మౌలిక స్పృహ కొరవడటం నేటి విద్యావ్యవస్థలోని ప్రధానలోపం. సమాజంలోని అన్ని వ్యవస్థలూ సక్రమంగా పనిచేయడానికి తగిన భాషావనరులను రూపొందించుకోడం, ఆయా విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన అంశాలను దేశిభాషలోకి వేగంగా అనువదించుకోగలగడం, అందుకు తగిన భాషాయంత్రాంగాన్ని రూపొందించుకోడం... అన్న విషయాలపై దృష్టి నిలిపితేగాని, ఈ సమస్యనుంచి బయటపడలేం! ప్రపంచం కుగ్రామంగా మారిన ఈ తరుణంలో ఇటువంటి సమస్యలనుంచి బయటపడగలిగే తరుణోపాయాలను వేగంగా కనుగొనడంలోనూ, అనువర్తింపజేసుకోడంలోనూ మన వ్యవస్థల వెనుకబాటు కలవర పెడుతోన్న అంశం.

చాలా సందర్భాలలో భాషావనరుల లేమి ఈ సమస్యలకు కారణమవుతున్నదా? అన్న సందేహం కలుగుతుంది. భాష కేవలం భావ వ్యక్తీకరణ సాధనంగా మాత్రమే ఉపయోగపడుతుంది అనే సామాన్య దృష్టి కోణంనుంచి విమర్శనాత్మకంగా అధ్యయనం చేయదగిన అంశంగా చూడకపోవడంవల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో అర్థవంతంగా వినియోగించుకోవడంద్వారా పైన చర్చించిన చాలా సమస్యలకు పరిష్కారాలను చూపించవచ్చు. నల్లబల్ల, చార్టులు, ఫ్లాష్ కార్డులు, మట్టి/మైనపు బొమ్మలు... మొదలైన బోధనోపకరణాలు సంప్రదాయ బోధనలో కీలక భూమిక పోషించేవి. ఆలోచనకు, తార్కికతకు, స్వీయానుభవానికి ఎక్కువ వెసులుబాటు కలిగించే ఈ వ్యవస్థను అన్ని తరగతులలోనూ అమలు చేయడంలో మాత్రం అనేక మినహాయింపులు ఉన్నాయి. అందువల్ల, ఆలోచనలో ఘనంగా మిగిలి ఆచరణలో విఫలమైన వ్యవస్థగా దీన్ని మనం గుర్తించాలి.

## 3. విశ్వవ్యాప్తజాలం: ఆధునిక విద్య

1980వ దశకంలో ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి వచ్చిన విశ్వవ్యాప్తజాలం (World Wide Web), అంతకు ముందే వాడుకలో ఉన్న సంగణకాల వాడకం సమాజంలోని అనేకానేక వ్యవస్థలలో

గుణాత్మకమైన మార్పులను ఎన్నింటినో తీసుకువచ్చాయి. విద్యావ్యవస్థలోకూడా ఇవి ప్రయోగాత్మకమైన మార్పులకు ఆలవాలంగా నిలిచాయి. కానీ, బోధనలో ఈ వ్యవస్థలను అర్థవంతంగా వాడుకొంటున్న దాఖలాలు మాత్రం తక్కువగా కనిపిస్తున్నాయి. 90వ దశకం చివరిదాకా సంగణకాలు, వాటి ఆధారిత సేవలు ఖరీదైనవిగా ఉండేవి. గడచిన దశాబ్దిలో ఇవి మధ్యతరగతి ప్రజలకుకూడ అందుబాటులోకి వచ్చాయి. నల్లబల్ల, ఫ్లాష్ కార్డులు, మట్టి/ మైనపు బొమ్మలు... మొదలైన సంప్రదాయ బోధనోపకరణాల సమాహార రూపంగా సంగణక వ్యవస్థను గుర్తించి, బోధనలో అనువర్తింపజేసుకోవలసిన అవసరం ఉంది.

భాషోపాధ్యాయులు ఆయాతరగతులకు అనుగుణంగా వీటి అనువర్తనలను ఉపయోగించుకోవడంవల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. సమాజంలోని వ్యక్తులు – వారే రంగంలో పనిచేస్తున్నా సంగణక పరిజ్ఞానం/ అక్షరాస్యత అవసరమవుతున్నట్టే– భాషోపధ్యాయులకుకూడా సంగణక అనువర్తల పరిజ్ఞానం అవసరం. కేవలం పాఠ్యపుస్తకాలపై ఆధారపడి జరిపే బోధనద్వారా సాధించే ఫలితాలకన్నా, దృశ్య, శ్రవ్య బోధనోపకరణంగా సంగణకాల సహాయంతో జరిపే బోధనవల్ల సాధించగలిగే ప్రయోజనాలు అధికమని ఫలితాలు తెలియజేస్తున్నాయి.

ఆయా తరగతుల తెలుగు వాచకాలను గమనించి చూడండి! చెప్పదలచుకొన్న విషయాలపై అవగాహన రాహిత్యం, తగినంత అభ్యసనం, శిక్షణ లేనివారితో పాఠ్యాంశాల రచన, చర్చించే విషయాలలో సమన్వయలోపం, లక్ష్యాలకు భిన్నమైన విషయ ప్రతిపాదన... మొదలైనవన్నీ కనిపిస్తాయి. కాని, విషయాల ఎంపికలో అన్నిటిలోనూ సామాన్య లక్షణాలు కొన్ని కనబడతాయి. ధర్మం, నీతి, న్యాయం, సమాజం, సుపరిపాలన, మహనీయుల చరిత్రలు, వ్యక్తిత్వ వికాసం... మొదలైన అంశాలతో వాచకాలలోని పాఠాలు రూపొందించబడుతున్నాయి. క్రీడాకారుల జీవితాలు, శాస్త్రవేత్తలు- వారి పరిశోధనలు, నాయకులు- వారి జీవితచరిత్రలు... మొదలయిన అంశాలకుకూడా తెలుగువాచకాలలో చోటుదక్కుతోంది(!). వీటన్నిటికీ ప్రాచీన కావ్యాలు, ప్రబంధాలు, ఆధునిక కాలంలో వెలువడిన రచనలు ఆకరాలు (resources)గా ఉపయోగపడుతున్నాయి.

## 4. భాషాబోధన: సంగణక అనువర్తనలు, అంతర్జాలం

చాలాకాలంవరకు మారని పద్ధతిలో పాఠ్యప్రణాళికలను రూపొందించడం, క్షేత్రస్థాయి మార్పులకు, విషయాలకు అవకాశాన్ని ఇవ్వకపోవడం నేటి పాఠ్యపుస్తకాలలో కొట్టవచ్చినట్టు కనిపించే ప్రధానలోపం. బోధించేది ఏ స్థాయి విద్యార్థులకైనా, పాఠ్యప్రణాళిక కొంతమేరకు క్షేత్రస్థాయి మార్పులకు అనుగుణంగా ఉండాలి. బోధనఅంతా వాచకాలలో చర్చించిన విషయాలకు మాత్రమే పరిమితం కావడం నేటి వ్యవస్థకు సరిపడే లక్షణం కాదు. విషయ చర్చ కేవలం పాఠ్యపుస్తకంలో నిర్దేశించిన అంశాలకు

పరిమితం అవడం ఇక్కడ ప్రధానమైన బలహీనత. వర్తమాన స్పృహతో చూసినా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చూసినా బోధన ఇలానే కొనసాగించడం ఎంతమాత్రం సమంజసం కాదు.

ప్రస్తుత విద్యావ్యవస్థలోని/ బోధనలోని బలహీనతలను అధిగమించడానికి, ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలలో మార్పులు చేసుకునే వెసులుబాటు ఉండే సంగణక ఆధారిత బోధనోపకరణాలను, పాఠ్యప్రణాళికలను రూపొందించుకోవలసిన అవసరం ఉంది. 'enquire within, upon everything' అన్న స్పూర్తితో ఎప్పటికప్పుడు పునర్మూల్యాంకనకూ, నవీకరణకూ అవకాశాన్ని ఇచ్చే సంగణక ఆధారిత బోధన పద్ధతులను మన విద్యావ్యవస్థలో తక్షణం ప్రవేశపెట్టాలి. వీటి ఆధారంగా దశలవారీగా ఆయా తరగతులకు వాచకాలు, పాఠ్యప్రణాళికలను రూపొందించడం చాలా సులభం. ఖర్చు తక్కువ. సంగణక ఆధారిత వాచకాలను అన్ని ప్రాంతాలకు ఏకకాలంలో పంపగలిగే వెసులుబాటు ఎక్కువ. పాఠ్యపుస్తక ఆధారిత పాఠ్యప్రణాళిక, బోధనలకన్నా, ఈ వ్యవస్థలో పాఠ్యప్రణాళిక రూపకల్పన, బోధనలు చలనశీలత (dynamic) కలిగినవిగా ఉంటూ, బోధన, అభ్యసన కార్యకలాపాలను మరింత అర్థవంతం చేస్తాయి.

అంతర్జాలంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న సాహిత్య, సాహిత్యేతర సంబంధ సమాచారాన్ని ఇందుకు సార్థకంగా వినియోగించుకోవచ్చు. రచనాసౌందర్యం, భేదం, భాషాప్రయోగంలో మార్పులు. శైలీభేదాలు, మొదలయిన విషయాలను సాధ్యమయినన్ని ఎక్కువ ఆకరాలనుంచి చూపగలగడం ఈ వ్యవస్థకు ఉన్న బలాలు.

మంచి వాచకాలకు ఉండవలసిన లక్షణాలు కలిగిన సమాచారాన్ని అంతర్జాలంనుంచి నేరుగా విద్యార్థులకు పరిచయం చేయడంద్వారా ఎక్కువ ప్రయోజనాలను సాధించవచ్చు. ఇందువల్ల బోధన, అభ్యసన కార్యకలాపాలను ఆహ్లాదకరంగా నిర్వహించవచ్చు. అభ్యసన కౌశలాలను సమాంతరంగా సాధించే వీలు కలుగుతుంది. విద్యార్థులలో సృజనశీలత పెరుగుతుంది. సంప్రదాయ బోధనలో ఉపాధ్యాయుడు ఎదుర్కొనే సమస్యలు చాలావరకూ తగ్గుతాయి.

సంగణక ఆధార పాఠ్యప్రణాళికను రెండు రకాలుగా రూపొందించుకోవచ్చు. మొదటిది– తరగతుల వారీగా సి.డి.లు, డి. వి. డి. ల రూపంలో పాఠ్యప్రణాళికలను, వాచకాలను రూపొందించవచ్చు. వీటిలోని పాఠాల, విషయాల విశ్లేషణ ఉపాధ్యాయుల ప్రత్యక్ష బోధనలో భాగం చేయవచ్చు. రెండవ పద్ధతి – ఉన్నత తరగతి విద్యార్థులకోసం ఉద్దేశించినది. వీరికి అంతర్జాల ఆధార పాఠ్యప్రణాళికను రూపొందించవచ్చు. ఈ వ్యవస్థలో ఇప్పటికే అనేకానేక ప్రక్రియలలో సమాచారం సమృద్ధిగా దొరుకుతోంది. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, కావ్యాలు... మొదలయినవాటితోపాటు, విజ్ఞాన సర్వస్వాలు. విజ్ఞానశాస్త్రాలకు సంబంధించిన అంశాలు, దిన, వార,

మాస పత్రికలు... మొదలైన సమాచారం అంతా ఇప్పుడు అంతర్జాలంలో దొరుకుతోంది. వేల, లక్షల పుటలకొద్దీ ఉన్న ఈ సమాచారం నుంచి తగిన సమాచారాన్ని ఎంచుకొని అధిపాఠ్యాంశాలను (hyper texts) రూపొందించుకోవడం పెద్ద కష్టం కాదు.

కేవలం సాహిత్య సంబంధ విషయాలను, భాషాబోధనకు సంబంధించిన అంశాలకు మాత్రమే కాకుండా ఇతర శాస్త్రాలనుకూడా మాతృభాషలో బోధించడానికి తగిన భాషావనరులను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలి. ఈ నవీకరణ కార్యకలాపాలు భాషావ్యవహార ప్రాంతంలోని అనేక తావులనుంచి జరగాలి. ఇటువంటి ప్రయత్నం ప్రస్తుతం ఏవో కొన్ని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలలో మాత్రమే జరుగుతోంది. అంటే – భాషను నవీకరించుకొనే ప్రయత్నాలు చేసే వ్యవస్థలు అతి చిన్నవిగానూ, ప్రయోజనాలను ఆశించే వ్యవస్థ పెద్దదిగానూ ఉంటోంది.

## 5. తెలుగు భాషాభివృద్ధి: అవగాహనలో రాదగిన మార్పులు

తెలుగు భాషావ్యవర్తలమైన మనకు భాష విషయంలో కొన్ని అభిప్రాయాలున్నాయి. ఇవన్నీ భాషపట్ల మన అభిరుచిని వ్యక్తం చేసేవిగానో, అభిమానాన్ని చాటుకొనేవిగానో ఉంటున్నాయి. భాషాభివృద్ధి చర్చలో నిజానికి– అభిరుచులు, అభిమానం... మొదలైన అంశాల ప్రమేయం తక్కువగా ఉంటుంది. భాషను ఒక సాంఘికవ్యవస్థగా గుర్తించి దాని అభివృద్ధికి శాస్త్రీయమైన పద్ధతిలో కృషి చేయడమే ఇక్కడ ప్రధానమైన విషయం. సాంస్కృతిక ప్రసరణద్వారా అలవడుతున్న భాష ఒక తరంనుంచి మరొక తరానికి బదిలీ అయ్యే క్రమం,లో ఎంత అభివృద్ధిసాధిస్తోందన్నది శాస్త్రీయ పరిశీలనద్వారా గమనించగలిగే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోలేకపోడం నిజంగా శోచనీయం!

తెలుగు వ్యవహార ప్రాంతాన్ని నాలుగు భాషామండలాలుగా భాషావేత్తలు విభజించారు. భాష విషయంలో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ అన్న విభాగం వ్యవహర్తలు చేస్తుకొన్నది. వీటికే భాష అన్న మాటను చేర్చి భాషావ్యవహార భేదాలను గుర్తించే ప్రయత్నంకూడా వ్యవహర్తలదే. భాషావేత్తలు విభజించిన నాలుగు మండలాలలోనూ, వ్యవహర్తలు ఏర్పరచుకొన్న పై మూడు ప్రాంతాలలోనూ తెలంగాణభాష, రాయలసీమ భాష... వంటి మాటలు ఏర్పడడానికి కారణాలు శాస్త్ర పరిధిలోవి కావు. వీటికితోడు ఇంటిభాష, ఊరుభాష... వంటి మాటలు కూడా నేడు వినిపిస్తున్నాయి. నిజానికి, తెలుగు వ్యవహార ప్రాంతంలో ఇన్ని రకాల భాషలు లేవు. ఇవన్నీ తెలుగుభాషకు ఉన్న వ్యవహార భేదాలు. వీటిని మాండలికాలు అనాలని భాషావేత్తలు ప్రతిపాదించారు. ఇటువంటి మాటలను ఒక స్థిరమైన అర్థంలో, అలానే వాడుకోవడంలో ఒక సౌలభ్యం ఉంది. వీటికి తుల్యరూపాలను సృష్టించి వాడడంద్వారా భాషాయంత్రాంగాన్ని అర్థం చేసుకునే ప్రక్రియలో చిక్కులు ఎక్కువ అవుతాయి.

వివిధ తరగతులకోసం ఉద్దేశించిన పాఠ్యపుస్తకాలలోని భాష తెలుగు వ్యవహార ప్రాంతంలోని వ్యవహారభేదాలన్నిటినీ ప్రతిఫలించడంలేదన్న విమర్శ ఉంది. తమ (భాషకు!) మాండలికానికి పుస్తకాలలో స్థానం ఇవ్వడంలేదనీ, వేరే ప్రాంతంలో వ్యవహారంలో ఉన్న (భాషను!!) మాండలికాన్ని తామెందుకు అధ్యయనం చేయాలనే వాదన వినిపిస్తోంది. పాఠ్యపుస్తకాలలోని విషయాలన్నీ ప్రమాణ భాషలోనే రాయాలనే నియమం ఇందుకు అనుమతించకపోవడం కారణం కావచ్చు. నిజానికి, ఈ నియమాన్ని అంత కఠినంగా అమలు చేయవలసిన అగత్యం లేదు. మాండలికాల వాడుకను పెంచి రచనలలో భాగం చేయడంద్వారానే ప్రమాణభాషలో అవి భాగం అవుతాయన్న సంగతి విస్మరించకూడదు.

ఒక భాషావ్యవహార ప్రాంతం భౌగోళికంగా పెద్దదిగాఉన్నపుడు ఆయా ప్రాంతాల మాండలికాలు కూడా ప్రమాణభాషలో కనిపించాలి. ఆయా ప్రాంతాలలోని కవులు, రచనలనుంచి వీటిని ప్రమాణభాషలోకి తీసుకువచ్చే ఒక నిరంతర భాషాయంత్రాంగం మన వ్యవస్థకు అత్యావశ్యకంగా ఉండాలి. తెలుగుభాషకు సంబంధించిన ఇటువంటి యంత్రాంగం దురదృష్టవశాత్తూ మనకు ఇంతవరకు లేదు. ప్రమాణభాష ఇందుకు భిన్నంగా ఉందని అనిపించినపుడు పాఠ్యపుస్తకాల నిర్మాణాన్ని వికేంద్రీకరించడం శ్రేయస్కరం. తరగతుల స్థాయి పెరిగేకొద్దీ ప్రమాణభాషను (వార్తాపత్రికలలో, మాధ్యమరంగాలలో వాడుకలో ఉన్న భాష) పరిచయం చేస్తూ, కింది తరగతులలో ఆయా ప్రాంతాలలో వాడుకలో ఉన్న మాండలికాలను ప్రతిబింబించే వాచకాల నిర్మాణాన్ని చేపట్టాలి. సంగణక ఆధార పాఠ్యపుస్తక రూపకల్పన, పాఠ్యప్రణాళికలలో ఈ అంశాలన్నిటికీ వివరణలతోపాటు, ఎటువంటి మినహాయింపులూ లేని పరిష్కారాలను కనుగొనగలిగే వీలు ఉంది.

ఆయా ప్రాంతాలలోని మాండలికాలను, మాండలిక రచనలతో కూడిన సమాచార నిధులను (data bases) రూపొందించుకునే ప్రయత్నం ఎక్కడికక్కడ ప్రారంభించాలి. ఇలా రూపొందించిన సమాచార నిధులలోని వాడుకలో ప్రచలితంగా ఉన్న పదజాలంతో ఆయా ప్రాంతాలలో పాఠ్యపుస్తకాలను రూపొందించాలి. మొత్తంగా భాషాభివృద్ధికి సంస్కరణలు విద్యావ్యవస్థతో ప్రారంభం కావాలి. భాషను కేవలం భావవ్యక్తీకరణ సాధనంగా మాత్రమే కాకుండా దానిని ఒక సాంఘిక వ్యవస్థగా అధ్యయనం చేయగలిగే వాతావరణాన్ని సంగణక అనువర్తనలద్వారా సాధించే అవకాశంపై ఇకనైనా దృష్టి సారించాలి.

## 6. ఉపయుక్త గ్రంథ సూచి

తెలుగు


1. కృష్ణమూర్తి, భద్రిరాజు. (సం.) 2010. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

2. శేషయ్య, ఆర్. వి. 1984. తెలుగు–బోధన పద్ధతులు. హైదరాబాదు: తెలుగు అకాడమి.

3. సుబ్రహ్మణ్యం, పి. ఎస్. 1997. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

English

4. Hockett, C. F. 1963. *A Course in Modern Linguistics*. Macmillan Publishers.

5. Johnson, Keith and Keith Morrow, eds. 1981. *Communication in the Classroom*. New York: Longman Publishing.

6. Larsen-Freeman, Diane. 1988. *Techniques and Principles in Language Teaching.* Oxford: Oxford University Press.

(ప్రపంచ తెలుగు సదస్సు–2లో సమర్పించిన పత్రం. 13–15 ఆగస్టు, 2011. విజయవాడ. ఆంధ్రప్రదేశ్.)

# ౨. వ్యాకరణ నిర్మాణంలో లాఘవం:

# సంగణక ఉపకరణాలు, అనువర్తనలు

వ్యాకరణాల నిర్మాణంలో సంగణక ఉపకరణాల, అనువర్తనల ఉపయోగాలను వివరిస్తూ, తక్షణావసరసంగా వీటిని వినియోగంలోకి తెచ్చుకోవలసిన ఆవశ్యకతను ఈ పత్రం తెలియజేస్తుంది. తెలుగు భాషకు ఇప్పటివరకూవెలువడిన వివిధ వ్యాకరణాల సైద్ధాంతిక లక్షణాలను రేఖామాత్రంగా వివరించడంతోపాటు, అనువర్తనల కోణంనుంచి వ్యాకరణాల రచనలో సాధించగలిగే లాఘవాన్ని రేఖాచిత్రంద్వారా ఈ పత్రంలో చూపడం జరుగుతున్నది. సంగణకాల సహాయంతో వ్యాకరణాల అనుశీలన, వ్యాకరణ నిర్మాణం, తద్ద్వారా వృద్ధి చేసుకోదగిన భాషావనరులను ఈ పత్రంలో ప్రతిపాదించడం జరుగుతున్నది.

## 1. పరిచయం

అనంతమైన భాషను సమాకరించడంలోనూ, విలువలను మదింపు చేయడంలోనూ వ్యాకర్తలకు అనేకమైన పరిమితులు ఉన్నాయి. ఈ రెండు దశలలోనూ అత్యంత క్లేశకారకమైన అవధులెన్నింటినో వ్యాకర్తలు అధిగమించవలసి ఉంటుంది. తమకు ముందుకాలాలలో జీవించిన కవుల కావ్య ప్రయోగాలను వర్ణించడం లేదా కావ్య రచనకు అనుగుణమైన పదనిర్మాణ ప్రక్రియను వివరించడం అందుబాటులో ఉన్న ముద్రిత తెలుగు వ్యాకరణాలన్నిటిలోనూ కనిపించే సాధారణ లక్షణం. వ్యాకరణాలు అనేకం ఉండడం– వ్యాకరించవలసిన సమాచారం అనంతంగా ఉండడంఅన్న ఈ రెండు లక్షణాలూ తెలుగు భాషావ్యవస్థలో ఏకకాలంలో సమాంతరంగా ప్రవర్తిల్లుతున్న విశేషాలు. ఈ రెండు ప్రధాన విశేష వ్యవస్థల మధ్య తర్కసహమైన సేతువు నిర్మించుకోడం అన్నది నేటి అవసరం. సంగణక అనువర్తనల కోణంనుంచి ఇటువంటి సేతు నిర్మాణానికి అనుసరించదగిన వ్యూహాలను ఈ పత్ర పరిమితులకు లోబడి వివరించడం జరుగుతున్నది.

## 2. వ్యాకరణ నిర్మాణంలో లాఘవం

వ్యాకరణ నిర్మాణంలో లాఘవం అన్నది అత్యంత వ్యాఖ్యానాపేక్ష విషయం. సంస్కృత భాషకు పాణిని రచించిన అష్టాధ్యాయిని వ్యాకరణ రచనలో పరమోత్కృష్టస్థాయికి చెందిన రచనగా ప్రపంచవ్యాప్తంగా భాషావేత్తలు గుర్తించంలో ఇమిడివున్న అంతస్సూత్రం ఈ లాఘవమే!

బహుళార్థ సాధకమైన ఈ లాఘవం అష్టాధ్యాయిలో మహేశ్వర సూత్రాల నిర్మాణంనుంచీ కనిపిస్తుంది. “1 అ, ఇ, ఉణ్, 2 ఋ, ὺ, 3 ఏ, ఓఙ్, 4 ఐ, ఔచ్ అన్న సూత్రాలలోని ఆద్యంత వర్ణాలను

గ్రహించి "అచ్" అనే ప్రత్యాహార సంజ్ఞను ఏర్పర్చడంతో అది ప్రారంభమవుతుంది. "అణుదిత్ సవర్ణస్యచాప్రత్యయః" (1-1-69) అనే సూత్రం, పై సూత్రాలలోని అ, ఇ, ఉ, ఋ, ... లను దీర్ఘాచ్చులుగా కూడా గ్రహించాలని తెలియజేస్తుంది. "అకస్సవర్ణే దీర్ఘః" (6-1-101) అన్న సూత్రం "అ, ఇ, ఉ, ఋ, " అనే ఐదు అచ్చులకూ సవర్ణాలు పరమైతే దీర్ఘం ఏకాదేశమవుతుందని తెలియజెప్పే సవర్ణదీర్ఘసంధి సూత్రం. వీటిద్వారా (1) అక్షర సమామ్నాయాన్ని ఏర్పర్చుకోగలగడం, (2) దానిలోంచి హ్రస్వ, దీర్ఘ భేదాలను గుర్తించగలగడం, (3) పద నిర్మాణంలో సంధి జరిగే పరిసరాలలో అవే అచ్చులు పరమైనప్పుడు దీర్ఘాచ్చులు ఏకాదేశం అవుతాయని చెప్పడం, (4) పైన పేర్కొన్న ఐదు అచ్చులలో ఒక్కొక్క అచ్చుకూ ఒక్కొక్క సూత్రంలో చెప్పదగ్గ సంధి నిర్మాణ విశేషాలను ఒక్క సూత్రంలో సంక్షేపించడం... వంటి ఫలితాంశాలను గమనించవచ్చు. అష్టాధ్యాయి సుమారు నాలుగువేల సూత్రాల సంపుటి. వైదిక, లౌకిక సంస్కృత భాషను సంపూర్ణంగా వ్యాకరించే ఈ గ్రంథంలో కేవలం సూత్రాల వరుసతప్ప, వాటిద్వారా సాధించవీలున్న రూపాల ప్రసక్తి లేకపోవడం మరోవిశేషం. సమస్త భాషాయంత్రాంగంనుంచి వ్యవహర్తలు ఇటువంటి రూపాలను సాధించి ప్రయోగించాలని పాణిని ఆశయం.

## 3. సంప్రదాయ తెలుగు వ్యాకరణాలు: నిర్మాణ సంప్రదాయాలు

2లో చర్చించినట్టుగా పాణినీయ స్థాయి లాఘవాన్ని సాధించిన తెకుగు వ్యాకరణాలు ఉన్నాయా? అన్నది సందేహాస్పదం. తెలుగు వ్యాకరణ సంప్రదాయం కాణ్వ వ్యాకరణం (2000BC)తో ఆరంభమయ్యిందని ఒక ఐతిహ్యం ఉంది. దీని తర్వాతి వ్యాకరణంగా చెప్పే బార్హస్పత్యాంధ్రంతో కలుపుకొని ఈ రెండు వ్యాకరణాలలోనూ (సంస్కృత భాషలో సూత్రరూపంలో ఉండేవని పండితుల భావన) ఈ రీతి లాఘవాన్ని సాధించే ప్రయత్నం జరిగి ఉండవచ్చు. వీటి తరువాత కొన్ని శతాబ్దులవరకు తెలుగుభాషకు వ్యాకరణాలు వెలువడలేదు.

తెలుగు భాషకు, సంస్కృత భాషలో శ్లోక రూపంలో *ఆంధ్ర శబ్ద చింతామణి*(11CE), *త్రిలింగ శబ్దానుశాసనం* (13CE) వెలువడ్డాయి. తరువాత సంస్కృత భాషలో సూత్రరూపంలో *ఆంధ్ర వ్యాకరణం* (1684-1712CE), *ఆంధ్ర కౌముది* (18CE) వంటి వ్యాకరణాలు వెలువడ్డాయి. సంస్కృత వచనంలో తెలుగు భాషకు వెలువడిన వ్యాకరణాలలో *అహోబలపండితీయం* (18CE) ప్రముఖంగా పేర్కొనదగింది.

మూలఘటిక కేతన, *ఆంధ్రభాషా భూషణం* (13CE), అప్పకవి, *అప్పకవీయం* (17CE) మొదలైన వ్యాకరణాలను తెలుగు భాషలో పద్యరూపంలో రచించారు. వచన రూపంలో వెలువడిన వ్యాకరణాలలో ఎలకూచి కృష్ణార్యుల *బాల సరస్వతీయం* (17CE), సూత్రరూపంలో వెలువడ్డ వ్యాకరణాలలో పరవస్తు చిన్నయసూరి రచించిన *బాల వ్యాకరణం* (19CE) పేరెన్నికగన్నవి. గద్య,

పద్యాత్మక పద్ధతిలో తెలుగు భాషకు కిమ్మూరి నరసింహరాజు *కవిజనాంజనం* (19CE) అనే వ్యాకరణాన్ని రచించారు. ఇంకా ఏకదేశి, విద్యార్థి, ప్రాసంగిక, ప్రశ్నోత్తర... వంటి వివిధ పద్ధతులలో తెలుగు భాషకు వ్యాకరణాలు వెలువడ్డాయి. వివిధ కాలాలలో, వివిధ భాషలలో, వివిధ నిర్మాణ పద్ధతులను అనుసరించి వెలువడిన తెలుగు వ్యాకరణాల సంఖ్య 250కి పైనే! వీటిలో దాదాపు 170కి పైగా వ్యాకరణాలు ముద్రితమయినట్టు లలిత (1996) గుర్తించారు. అముద్రితాలు, అలభ్యాలు, నామమాత్రావశిష్టంగా మిగిలినవి, తాళపత్రాల రూపంలో ఉన్నవి, కర్త, ముద్రణ వివరాలు లేనివి మరికొన్ని ఉన్నాయి. ఆధునిక యుగంలో అనేక అవసరాలకోసం పాశ్చాత్యులు లాటిన్, ఆంగ్లం, రష్యన్...భాషలలో తెలుగు భాషకు వ్యాకరణాలు రచించారు.

తెలుగు భాషకు వ్యాకరణాన్ని రాయడానికి పూనుకొన్న సందర్భాలలో తెలుగు వ్యాకర్తలు సంస్కృత, ప్రాకృత వ్యాకరణ నిర్మాణాలను ఆదర్శంగా గ్రహించారు. వివిధ భాషల వ్యాకరణ నిర్మాణ పద్ధతులు తెలుగు భాషకు వ్యాకరణమ్ రాయటంలో ఎంత అక్కరకు వస్తాయన్న విషయంలో వీరు కొంత ప్రమత్తతకు గురయ్యారు. కాలక్రమంలో భాష పొందే మార్పులను వ్యాకరించడంలోనూ, వివిధ కాలాలలో తెలుగు భాషలో మిళితమైన ఇతర భాషా పదాలను, వాటి నిర్మాణాలను వివరించడంలోనూ ఈ ప్రమత్తత స్పష్టంగా కనిపిస్తుంది. ఫలితంగా– తెలుగు వ్యాకరణాలు, ఉన్న భాషా యంత్రాంగాన్ని వ్యాకరించేవిగా కాక, భాష ఇలా ఉండాలన్న రీతిలో (అనుశాసన వ్యాకరణాలు) వెలువడ్డాయి. వీటిలోని సూత్రీకరణలను, పదనిర్మాణ పద్ధతులను... నేడు మొత్తంగా స్వీకరించలేం! అలాగని, తిరస్కరించనూ లేం! ఆధునిక కాలంలో– భాషాశాస్త్ర ప్రమేయంతో ఏకకాలిక, చారిత్రక, తులనాత్మక, వర్ణనాత్మక వ్యాకరణాలు వెలువడ్డాయి. వీటి సంఖ్య అత్యల్పం.

2000 సంవత్సరాల చరిత్ర ఉన్న భాషను మదింపు చేసి విలువలను నిర్ణయించడానికి తగినంతమంది వ్యాకర్తలు నేడు మనకు లేరు. ఉదాహరణకు– కట్టావరదరాజు (1630 CE) శ్రీ రామాయణము అనే పేరుతో 23,419 ద్విపదలుగల రామాయణాన్ని రచించాడు. దీనిలో– ఇత్వ సంధిలో –మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయం "వి" లోపించిన "చేసితీపట్టునకు" అన్న రూపం ఒకే ఒక్క చోట (2:1290) ఉంది. తెలుగు వ్యాకరణాలలో అమిత ప్రాచుర్యం పొందిన బాల, ప్రౌఢ వ్యాకరణాలలో ఈ అసాధు(!)రూపం మనకు కనపడదు. ఎంపికచేసికొన్న కొన్ని గ్రంథాలను మాత్రమే వ్యాకరించడంవల్ల వచ్చిన/వచ్చే సమస్య ది.

## 4. వ్యాకరణాల సంగణీకరణం

భాషా యంత్రాంగాన్ని చారిత్రకంగా అనేక పద్ధతులలో వ్యాకరించిన వ్యాకరణాలు ఒకవైపూ, స్ఖాలిత్యాలూ, ఇంకా స్పష్టపరచుకోవలసిన అంశాలు మరోవైపూ ఉన్న ప్రస్తుత స్థితిలో, భాషకు ఉన్న శక్తిని సంపూర్ణంగా పొందడానికి ప్రస్తుతం ఉన్న వ్యవస్థలు మాత్రమే సరిపోవన్నది సుస్పష్టం. అందుకే అందుబాటులో ఉన్న తెలుగు వ్యాకరణాలన్నిటినీ మొదట సంగణీకరించాలి. సంగణీకరించిన సమాచారం ద్వారా ఫలితాంశాలను ఏ విధంగా సాధించవచ్చో విభాగం 5లోని రేఖాచిత్రం వివరిస్తుంది.

## 4.1 సంగణీకరణ సమస్యలు: ఫాంట్లు

తెలుగు భాషలోని చారిత్రక వర్ణసమామ్నాయంతోపాటు, ఎటువంటి వర్ణ సంయోజనకైనా అనుమతించే సాఫ్టవేరును రూపొందించుకోవాలి. కొన్ని అచ్చులను, హల్వర్ణాలను, కొన్ని రకాల ద్విత్వ, సంయుక్తాక్షరాలను ప్రస్తుతం అందుబాటులో ఉన్న తెలుగు సాఫ్టవేర్లద్వారా పొందగలిగే వీలులేదు. ఉదాహరణకు- తెలుగు అచ్చులలో ఋ, ౠ, , లను చూపగలిగే సాఫ్టవేర్లు అరుదు. అలాగే; ద్విత్వ, సంయుక్తాక్షరాల విషయంలో- వర్ణ సంయోజన నియమావళికి అనుగుణమైన చిహ్నాలతోపాటు, అనుమతించని లేఖన చిహ్నాలను కూడా సాధించగలిగే వీలున్న సాఫ్టవేర్లను నిర్మించుకోగలగాలి. తెలుగు లేఖన సంప్రదాయంలో వస్తున్న మార్పులను చారిత్రక దృష్టితో అనుశీలించడానికి ఇటువంటి వ్యవస్థలు చాలా అవసరం.

## 5. వ్యాకరణ నిర్మాణంలో లాఘవం: సంగణక వ్యవస్థల ఏర్పాటు

అనంతమైన భాషా సామగ్రిని సమాకరించడంలోనూ, విలువలను మదింపుచేయడంలోనూ ఉన్న క్లేశాలను అధిగమించే వ్యవస్థలుగా సంగణక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉంది. అనేకమైన కావ్యాలను, రచనలను సంప్రదించడం, భాషాయంత్రాంగాన్ని ఆకళింపు చేసుకోడం, పూర్వ వ్యాకర్తల వక్తవ్యాంశాలను గుర్తించడం, నిర్దిష్టత-నిర్దుష్టతలను సాధించడం, స్థల-కాల అవధులను అధిగమించగలగడం, వస్తునిష్ఠను వ్యక్తినిష్ఠ అధిగమించకుండా చూసుకోవడం... మొదలైన విషయాలలో వ్యాకర్తలకు లేదా భాషావేత్తలకు పరిమితులు ఎక్కువ. అందువల్ల ఇటువంటి పరిమితులను అధిగమించగలిగే సంగణక వ్యవస్థల ఏర్పాటు అత్యవసరం.

## 5.1 తెలుగు భాషకు సంగణక ఆధారిత వ్యాకరణాల తయారీ: ప్రస్తుత స్థితి

హైదరాబాదు విశ్వవిద్యాలయంలోని అనువర్తిత భాషాశాస్త్ర, అనువాద అధ్యయనాల కేంద్రం ఈ విధమైన పరిశోధనలను సుమారు రెండు దశాబ్దులుగా నిర్వహిస్తున్నది. భారతీయ–యూరోపియన్ భాషలమధ్య యంత్రానువాద సాధన అనే లక్ష్యంతో పనిచేస్తున్న ఈ కేంద్రంలోని సహజభాషా సమాకరణ వ్యవస్థలో ఆధునిక తెలుగుభాష పదోత్పత్తి, పద పరిణామచిత్రాలను 97.5% నిర్దిష్టతతో వ్యాకరించగల పదాంశ విశ్లేషి ఉపయోగంలో ఉంది. ఈ పదాంశ విశ్లేషి సామర్థ్యాన్ని ప్రాచీన వ్యాకరణాలు, కావ్యాలలోని భాషకుకూడా వర్తింపజేయడం ద్వారా ప్రస్తుత పత్రంలో చర్చిస్తున్న ఫలితాలను సాధించే వీలుఉంది.

## 5.2 తెలుగు భాషకు అధి వ్యాకరణాలు, అధి నిఘంటువుల తయారీ

అధి వ్యాకరణాలు, అధి నిఘంటువుల తయారీ... మొదలైనవి తెలుగు భాషావ్యవస్థకు అత్యంత ఆవశ్యకాలు, నేటి తప్పనిసరి అవసరాలు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న వ్యవహర్తల భాషావసరాలను తీర్చడంతోపాటు, భాషాపరిశోధనలలో బహుళోపయోగ ఫలితాలను సాధించడానికి 5, 5.1లో చర్చించిన వ్యవస్థలకు అదనంగా కింది రేఖాచిత్రంలోని వ్యవస్థల జోడింపు అవసరం.



## 6. పత్రంలో ఉపయోగించిన సాంకేతిక పదాలకు ఆంగ్ల తుల్యరూపాలు

లాఘవం=dexterity; సంక్షిప్తి=abstract; సంగణకం=computer; సంగణక ఉపకరణాలు= computationaltools; అనువర్తనలు=applications; అనుశాసనవ్యాకరణం=prescriptive grammar; వస్తునిష్ఠ=objectivity; వ్యక్తినిష్ఠ=subjectivity; సహజ భాషా సమాకరణం=natural language processing; పదపరిణామచిత్రం=word paradigm; పదాంశ విశ్లేషి= morphological analyzer; అధివ్యాకరణం= hyper grammar; అధి నిఘంటువు=hyper dictionary.

## 7. ఉపయుక్త జాల/గ్రంథ సూచి


1. NLP activity at Stanford University: http://nlp.stanford.edu/links/statnlp.html

2 The specialist NLP Tools: http://lexsrv3.nlm.nih.gov/Specialist/Home/index.html

3. Software tools for NLP: http://www-a2k.is.tokushima-u.ac.jp/member/kita/NLP/nlp tools.html

4. IIIT Research Centres homepage: http://web2py.iiit.ac.in/research centres/default/view area/3

5. The Linguistic Data Corpus, grammars developed at the Central Institute of Indian Languages: {http://www.ciilcorpora.net/, ciil-spokencorpus.net, ciil-grammars.org/}

**References (English)**

6. Cole, R.,J. Marini, H.Uszkoreit, G.B.Varile, A. Zaenen, A. Zampolli, and V. Zue (eds)1997. Survey of the State of the *Art in Human Language Technology*. Cambridge: Cambridge Universtity Press.

7. Grssne, B. and G. Rubin. 1971. *Automatic Grammatical Taggingof English*. Providence: Brown University.

8. Gurari, E. 1989. *An Introduction to the Theory of Computation.* New York: Computer Science Press.

9. Manaster Ramer, A. (Ed) 1987. *Mathematics of Language. Amsterdam*: John Benjamins.

10. Rajeev Sangal, Bendre, S.M. (eds) 2002. *Recent Advances in Natural Language Processing*. Proceedings of the International Conference ICON-2002. New Delhi: Vikas Publishing House Pvt. Ltd.

11. RuslanMitkov. (ed) 2003. *The Oxford handbook of Computational Linguistics*. New York: Oxford University Press Inc.

తెలుగు

12. కృష్ణమూర్తి, భద్రిరాజు. (సంపా) 2010. *తెలుగు భాషా చరిత్ర.* హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

13. చక్రధరరావు, లంకసాని. (సంపా) *తెలుగు వ్యుత్పత్తికోశం. 8 సంపుటాలు.* విశాఖపట్నం: ఆంధ్రా యూనివర్శిటీ. ముద్రణ కాలం 1978–1995

14. పవన్ కుమార్, పమ్మి. 2003. *కట్టా వరదరాజు ద్విపద రామాయణం: భాషా పరిశీలన.* హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.

15. లలిత,జి. 1996. *తెలుగు వ్యాకరణముల చరిత్ర.* మద్రాసు: వెలగపూడి ఫౌండేషన్.

16. సుబ్రహ్మణ్యం, పి.యస్. 1997. *ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు.* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

(అంతర్జాతీయ తెలుగు అంతర్జాల సదస్సు–1లో సమర్పించిన పత్రం. 28–30 సెప్టెంబరు, 2011. మిల్పిటస్. కాలిఫోర్నియా.)

>>>><<<<

# ౩. ప్రపంచీకరణయుగంలో తెలుగు బోధన: పద్ధతులు, వ్యూహాలు, అనువర్తన

ప్రపంచీకరణయుగంలో తెలుగు (భాషా, సాహిత్యాల) బోధనలో రాదగిన మార్పులను ఈ పత్రం చర్చిస్తుంది. భాషల దృష్టికోణంనుంచి ప్రపంచీకరణను అర్థం చేసికోవలసిన అవసరాన్ని వివరిస్తూ, అందుకు తగిన వ్యవస్థల ఏర్పాటుకు సమాయత్తం కావలసిన విధానాన్ని ఈ పత్రంలో పరిచయం చేయడం జరుగుతున్నది. మన విద్యావ్యవస్థ ప్రదర్శిస్తున్న ఏకధ్రువ లక్షణాలను పునస్సమీక్షించుకోవలసిన అవసరంపై ప్రధానంగా దృష్టి నిలిపి ఈ పత్రంలో చర్చించడం జరిగింది. ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక . . . రంగాలకు వృద్ధి సూచులు ఉన్నట్టు, మన భాషా వ్యవస్థలకుకూడా అభివృద్ధి సూచులను ఏర్పాటు చేసికోవలసిన అవసరాన్ని ఉదాహరణ పూర్వకంగా ఈ పత్రం తెలియజేస్తుంది. తెలుగు ప్రాంత వ్యవహారంలో జమిలిగా కలిసిపోయిన ఇతర భాషలు, వాటిననుసరించి ఏర్పడుతున్న మిశ్ర భాషా సంస్కృతులను ఈ పత్రంలో క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా వివరించడం జరిగింది. అందివస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని క్రమ పద్ధతిలో వినియోగించుకొంటూ, వివిధ స్థాయుల బోధనలో సహకరించే మాతృభాషావనరులతో ఒక సమీకృత భాషా వ్యవస్థను ఏర్పర్చుకోవలసిన అవసరాన్ని ఈ పత్రంలో ప్రతిపాదించడం జరుగుతున్నది.

## పరిచయం

ఈ పత్ర శీర్షికలో ఉపయోగించిన ప్రపంచీకరణయుగం అన్నమాట అత్యంత వ్యాఖ్యానాపేక్షమైనది. ఏ కోణంనుంచి చూసినా అది, దాని అనువర్తన నైజంవల్ల బహురూపాలలో కనిపిస్తుంది. ఈ పత్రంలో చర్చించబోయే అంశాలకు సంబంధించినంతవరకు, అనువర్తన దృష్టికోణంనుంచి ప్రపంచీకరణయుగ రూపాన్ని ఆవిష్కరించడం ఈ పత్ర రచన ఉద్దేశాలలో ఒకటి. మనిషి ఆలోచనావిధానాన్ని, దైనందిన జీవితాన్ని అమితంగా ప్రభావితం చేస్తున్న అనేకాంశాలకు మూలపాదుగా ఉన్న ప్రపంచీకరణను జాగ్రత్తగా అర్థంచేసికోవలసి ఉంది. ప్రపంచవ్యాప్తంగా వేళ్ళూనుకొన్న ఈ భావన వర్తించని రంగం నేడు లేదు. ప్రపంచవ్యాప్త ఆర్థిక వ్యవస్థలకు మూలకందమైన వర్తక–వాణిజ్యవ్యవస్థలలో ఒకవిధమైన సంతులనం (?) సాధించడానికి ప్రారంభమైన ఈ భావన అన్ని రంగాలకు విస్తరించి దైనందిన జీవిత విధానంగా మారిపోడమన్నది ఆశ్చర్యాన్ని కలిగించే నిజం! ఈ అంశాన్ని భాషల దృష్టికోణంనుంచి చూడడం మనసమాజాలకు బహుకొత్త. తప్పనిసరిగా దృష్టినిలిపి అధ్యయనంచేయదగిన ఈ రంగానికి సంబంధించి గుర్తించదగిన కొన్ని అంశాలను చర్చించడం నేటి అవసరం.

## 1. ప్రపంచీకరణ–భాషల సంబంధం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలను, పారిశ్రామిక రంగాలను, వస్తూత్పత్తి కేంద్రాలను, రాజకీయ రంగాలను అమితంగా ప్రభావితం చేసిన ప్రపంచీకరణ, సాంఘిక వ్యవస్థలలోనూ, భాషా వ్యవస్థలలోనూ తెచ్చిన, తెస్తున్న మార్పులను ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. అందివస్తున్న భౌతిక వనరుల దృష్టితోనూ, సంపద సృష్టికోణంలోనూ ఇంతకాలం ప్రపంచీకరణను ఆదరించిన సమాజాలు/దేశాలు సాంఘిక, భాషా వ్యవస్థలకు సంబంధించి ఇప్పుడిప్పుడే తమ దృష్టిని మార్చుకొంటున్నాయి. ప్రపంచీకరణ నేపధ్యంలో తయారువుతున్న – ఏకధ్రువ ప్రపంచం వెల్లువలోపడి తమ తమ సంస్కృతులను, భాషలను, చరిత్రలను కోల్పోవడానికి ఆయా దేశాలలోని ప్రజలు ఇప్పుడు సుముఖంగా లేరు. ఈ రంగాలలో భిన్నధ్రువత తప్పనిసరి అని ఆయా సమాజాలు ఉద్ఘోస్తున్నాయి.

నిజానికి– ఆర్థిక, రాజకీయాది రంగాలలో అనేక సమాజాలు, దేశాలు పాటించే పథ ఆధార పద్ధతులను (path dependency models) గుడ్డిగా అనుకరించడంవల్ల వర్ధమాన దేశాలు ఈ సమస్యలో చిక్కుకున్నాయి. ఫలితంగా– వర్ధమాన దేశాలలో నివశిస్తున్న దేశాలలోని ప్రజల జీవిత విధానాలలో, సాంఘిక కట్టుబాట్లలో, ఆచార సంప్రదాయాలలో, భాషా వ్యవస్థలలో మిశ్ర శైలులు ఏర్పడి అలజడులకు కారణమవుతున్నది. ఒక్కముక్కలో– ఇప్పటివరకూ లాభ–నష్టాల దృష్టితో ప్రపంచీకరణను చూస్తున్న సమాజాలు, ఇప్పుడిప్పుడే మంచి–చెడులకోణంనుంచీ దాని గమనాన్ని పరిశీలిస్తున్నాయి.

అత్యంత ఆవశ్యకమైన ఈ చర్చతో ప్రపంచ భాషలన్నిటికీ ప్రమేయం ఉంది. దీనిని మనం సంభావించగలుగుతున్నామా? లేదా? అన్నది ఇక్కడ ప్రధానం. భావ ప్రసారానికీ, భావగ్రహణానికీ సాధనంగా ఉపయోగపడే భాషలను విస్తృతార్థంలో గ్రహించగలిగే ఆలోచనలకు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఆదరణ లభించింది ఈ యుగంలోనే! దేశమంతటా ఒకే భాష వాడుకలో ఉన్న దేశాలు ప్రపంచవ్యాప్తంగా (ఇప్పటికీ) అనేకం ఉన్నాయి. ఇప్పుడిప్పుడే ఈ దేశాలు బహుభాషా వ్యవహార ప్రాంతాలుగా ఉన్న దేశాల అనుభవాలను, అలా ఉండడంలోని ఆంతర్యాన్ని గ్రహిస్తున్నాయి. కాని, శతాబ్దులుగా బహుభాషా వ్యవహార ప్రాంతంగా ఉన్న మనదేశంలో ఈ ప్రభావాలకు తగిన ప్రతిస్పందన చూపగలిగేరీతిలో మన దేశ భాషలను అభివృద్ధి చేసుకోలేకపోయామన్నది ఇక్కడ గమనించవలసిన విషయం. సమీకృత విద్యావ్యవస్థలు లేకపోవడంవల్ల మన సమాజాలు ఈ నష్టాన్ని (అనుభవంలోకి తెచ్చుకోకుండా) శతాబ్దులుగా భరిస్తున్నాయి. సమీకృత వ్యవస్థగా మనకు పరిచయం అవుతున్న మన విద్యావ్యవస్థకు అనేక మినహాయింపులున్నాయి. పరిమితులున్నాయి. ఈ అంశాలను విద్యార్థులు గమనించలేరు. గమనించినా, ఏకీకృత బోధన, మూల్యాంకన విధానాలవల్ల ఉపాధ్యాయులుతగిన మార్పులను చేయలేరు. తల్లిదండ్రులు, సామాన్య ప్రజలకు ఇది కొరుకుడుపడే విషయంకాదు.

## 2. ప్రపంచీకరణ: విద్యావ్యవస్థ

మన విద్యావ్యవస్థలో ప్రస్తుతం అమలులో ఉన్న పాఠ్యాంశాలు/బోధనాంశాలను గమనించండి. (1) భాషా బోధనకు సంబంధించిన పాఠ్యాంశాలు, (2) సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన పాఠ్యాంశాలు, (3) శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన పాఠ్యాంశాలుగా వీటిని విభజించవచ్చన్నది సులభంగా అర్థమవుతుంది. ప్రాథమిక/మాధ్యమిక విద్యాస్థాయులనుంచీ వీటన్నిటినీ పరిచయంచేస్తూ ఉన్నత తరగతులవరకూ కొనసాగించడం మన విద్యావ్యవస్థలోని బలం. ఆపై తరగతులలో/స్థాయిలలో అభిరుచుల ఆధారంగా వీటి ప్రాధాన్యాన్ని క్రమంగా కుదించుకొనే వెసులుబాటు విద్యార్థికి వదిలివేయడం మన విద్యావ్యవస్థలోని బలహీనత. ఉన్నత తరగతులలో పాఠ్యాంశాల బోధన మన మొదటి భాష (మాతృభాష)లలో చేయలేకపోవడానికి కారణం ఇదే. అందుకు తగిన భాషావనరులను మనం ఇంతకాలంగా తయారు చేసుకోలేకపోయాం.

అన్యభాషలో సాంఘిక, శాస్త్ర, సాంకేతిక అంశాలను ఉన్నత తరగతులలో చదివిన ఒక విద్యార్థి, తన మొదటి భాషలో (మాతృభాష)లో తాను నేర్చుకొన్న విషయాలను నివేదించగలిగితే ఆ సమాజం బాగా అభివృద్ధి చెందినట్టు లెక్క. సాంఘిక, శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలయినా, వాటంతటవిగా– భాష ప్రమేయం లేకుండా– ప్రవర్తిల్లలేవన్నది మనమెరిగిన సత్యమే! ఆయా అంశాలను అభ్యశించడానికి, నిష్ణత సాధించడానికి వాహికగా ఉపయోగపడుతున్న భాషలను మనం ఎంతవరకూ వృద్ధి చేసుకోగలిగామన్నది ప్రధానం. ఆయా శాస్త్రాలను నేర్చుకోడంలో భాష ప్రమేయం ఎంతవరకో, భాషకు సంబంధించిన తెలివిడి అంతచాలు అన్న ధోరణి, నేర్చుకొన్నామనుకొన్న విషయాలను తిరిగి నివేదించే సందర్భాలలో అడ్డంకిగా మారుతుంది.

పై చర్చలో విద్యార్థి స్థానాన్ని, ఉన్నత తరగతులకు బోధించే ఒక ఉపాధ్యాయునితో పూరించి చూడండి. ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలుగుచూస్తాయి. మొత్తంగా– మన (విద్యా) వ్యవస్థలో ఉన్న లోపం ఇది. ఇందుకు – ఏ ఒక్క రంగానికి సంబంధించిన వ్యక్తినో బాధ్యుడిని చేయలేం. అనేక వ్యవస్థల రూపంలో బహుధా విస్తరించుకొని ఉన్న సమాజపు భాషావసరాలను తీర్చగలిగి, వారి వారి భాషా సామర్థ్యాన్ని పరిపుష్టం చేయగలిగే ఏర్పాటు మన సమాజంలో తక్షణం ఏర్పాటు చేసికోవాలి.

గుర్తించవలసిన మరొక విషయం ఏమంటే– మన విద్యావ్యవస్థ అనేకానేక శాఖలుగా వికేంద్రీకరింపబడి ఉంది. పాలనా సౌలభ్యంకోసం చేసుకొన్న ఈ వికేంద్రీకరణ విద్యావ్యాసంగానికి విస్తరించుకోవలసిన అవసరం లేదు. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యావ్యవస్థలు సాధించవలసిన

లక్ష్యాలు వేరు వేరుగా ఉన్నా, ఈ వేరును ఒక చోట చర్చించడంలో ఆయా శాఖలు/వ్యవస్థలు విధించుకొనే స్వీయ పరిమితులు మన వ్యవస్థ బలహీనతలను బలంగా ప్రతిబింబించడానికి పనికొస్తాయి తప్ప బలాలను అర్థవంతంగా ప్రదర్శించలేవు. వివిధ స్థాయులలో నేర్చుకొన్న జ్ఞానానికి సహేతుకమైన సంబంధాన్ని కూర్చుకోడంలో విద్యార్థికి పరిమితులు విధిస్తున్నట్టుగా ఉన్న విద్యావ్యవస్థ తక్షణం సమీకృత లక్షణాన్ని పెంపొందించుకోవలసి ఉంది. మనం తయారుచేస్తున్న మానవ వనరుల ఆధారంగా సమాజాలు మనగలుగుతున్నాయి, నిర్మింపబడుతున్నాయి, భ్యవిష్యత్తుకు బాటలు వేయగలుగుతున్నాయన్నది ఉపపత్తులతో నిరూపణకు మన విద్యావ్యవస్థలు సమాయత్తంకావాలి. ఇందుకు అనుగుణమైన భావ ప్రసార, భావ గ్రహణ వ్యవస్థలను మన భాషలలో ఏర్పాటు చేసికోడం తప్పనిసరి అవసరం.

## 3. ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు బోధన ఎలా ఉండాలి?

పై విభాగంలో చర్చించిన భావ ప్రసార, భావ గ్రహణ వ్యవస్థలలోని వైకల్యం అన్నది మొత్తం సమాజాన్ని ప్రభావితం చేసే అంశం. ఈ రెంటి సంతులనం ఏ సమాజాలలో సాధ్యమవుతుందో ఆ సమాజాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి. సమాజ/దేశాభివృద్ధిని గమనించడానికి అనేక వృద్ధి సూచులు ఉన్నట్టే, భాషాభివృద్ధి సూచులనుకూడా మన వ్యవస్థలలో భాగం చేసుకోవలసిన అవసరం ఉంది. బహుభాషా వ్యవహార ప్రాంతమైన మన సమాజంలో ఈ అవసరం మరింత ఎక్కువగ ఉంది. క్షేత్రస్థాయి పర్యటనద్వారా సేకరించిన ఈ కింది సమాచారం (కేస్–1, కేస్–2) దీనిని మరింత బాగా అవగాహన చేసికోడానికి సహకరిస్తుంది. (పత్ర పరిమితుల దృష్ట్యా కేవలం ప్రాథమిక పాఠశాలలనుంచి సేకరించిన సమాచారాన్ని మాత్రమే కేస్–1, కేస్–2లలో ప్రస్తావించడం జరుగుతున్నది.)

### 3.1 కేస్–1

రంగారెడ్డి జిల్లా శివారు ప్రాంతంలో శేరిలింగంపల్లి మండలం ఉంది. ఈ మండలంలోని గోపన్‌పల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలనుంచి సేకరించిన సమాచారం కేస్–1కి ఆధారం.

3.1 (1) పైన పేర్కొన్న పాఠశాలలో చదువుతున్న మొత్తం విద్యార్థుల సంఖ్య – 170

3.1 (2) బోధన తరగతులు – 1 నుంచి 5వ. తరగతివరకు.

3.1 (3) ఉపాధ్యాయుల సంఖ్య – 2+6=8

(ప్రభుత్వ ఉపాధ్యాయులు–2, ప్రైవేటు విద్యా వాలంటీర్లు–6)

3.1 (4) ఉపాధ్యాయుల మొదటి భాష (మాతృభాష) – తెలుగు

3.1 (5) ఉపాధ్యాయులు తమలో తాము భాషించుకొనే భాష – తెలుగు

3.1 (6) ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడే భాష – తెలుగు

3.1 (7) విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడే భాష – తెలుగు

3.1 (8) విద్యార్థులు తమలోతాము మాట్లాడుకొనే భాష(లు) – తెలుగు, ఉర్దూ, గార్‌బోలి (లంబాడి), తమిళం.

3.1 (9) విద్యార్థుల మొదటి భాష(లు) – తెలుగు, ఉర్దు, గార్‌బోలి (లంబాడి), తమిళం.

3.1 (10) పాఠశాల ఉన్న ప్రాంతంలో వాడుకలో ఉన్న భాష(లు) - తెలుగు, ఉర్దు.

## 3.2 కేస్–2

రంగారెడ్డి జిల్లా శివారు ప్రాంతంలో శేరిలింగంపల్లి మండలం ఉంది. ఈ మండలంలోని ఖాజాగూడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలనుంచి సేకరించిన సమాచారం కేస్–2కి ఆధారం.

3.2 (1) పైన పేర్కొన్న పాఠశాలలో చదువుతున్న మొత్తం విద్యార్థుల సంఖ్య – 124

3.2 (2) బోధన తరగతులు – 1 నుంచి 5వ. తరగతివరకు.

3.2 (3) ఉపాధ్యాయుల సంఖ్య – 3+2=5

(ప్రభుత్వ ఉపాధ్యాయులు–3, ప్రైవేటు విద్యా వాలంటీర్లు–2)

3.2 (4) ఉపాధ్యాయుల మొదటి భాష (మాతృభాష) – తెలుగు

3.2 (5) ఉపాధ్యాయులు తమలో తాము భాషించుకొనే భాష – తెలుగు

3.2 (6) ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడే భాష – తెలుగు

3.2 (7) విద్యార్థులు ఉపాధ్యాయులతో మాట్లాడే భాష – తెలుగు, ఉర్దు, బిహారి, ఒరియ.

3.2 (8) విద్యార్థులు తమలోతాము మాట్లాడుకొనే భాష(లు) – తెలుగు, ఉర్దు, బిహారి, ఒరియ.

3.2 (9) విద్యార్థుల మొదటి భాష(లు) (మాతృభాష[లు]) – తెలుగు, ఉర్దు, బిహారి, ఒరియ.

3.2 (10) పాఠశాల ఉన్న ప్రాంతంలో వాడుకలో ఉన్న భాష(లు) - తెలుగు, ఉర్దు, బిహారి, ఒరియ.

పైన కేస్–1, కేస్–2లలో ప్రస్తావించిన పాఠశాలల మధ్య దూరం 4నుంచి5 కిలోమీటర్లు. గోపన్‌పల్లి, ఖాజాగూడ గ్రామాలు రెండూ శేరిలింగంపల్లి మండలంలోనివే. పై సమాచారంలో కేస్–1 లోని 3.1 (1) నుంచి 3.1 (10) వరకు ఉన్న అంశాలను కేస్–2 లోని 3.2 (1) నుంచి 3.2 (10) వరకు ఉన్న అంశాలతో పోల్చి చూడండి.

మొదటిభాషల విషయంలో మన ఆలోచనా విధానంలో రావలసిన మార్పులను ఈ ఉదంతాలు పట్టిచూపుతున్నాయి. తెలుగు మొదటిభాష (మాతృభాష)గా గల ప్రధాన వ్యవహార ప్రాంతంలోనే

మనమంతా ఉన్నామని అనుకొంటున్నా, ఇతర భాషలు తమ తమ మొదటిభాష (మాతృభాష)గా గలవారు మనలో కలిసి జీవిస్తున్నారన్న సంగతిని, ఆ విద్యార్థులు తెలుగు మాధ్యమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్న సంగతి విస్మరింపకూడనిది. అంటే- భాషోపాధ్యాయులు, (ఇతర పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులుకూడా) ఏక కాలంలో మొదటి, ద్వితీయ భాషా బోధనపద్ధతులను అనుసరించాలన్నమాట.

ఈ చర్చను సరిహద్దు ప్రాంతాలలో ఉన్న పాఠశాలల బోధనా పద్ధతులకు పొడిగించి చూస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. ఇటువంటి పాఠశాలలో చదువుకొంటున్న విద్యార్థుల, ఉపాధ్యాయుల మౌఖిక వ్యవహారంలో ఉన్న పదజాలం వీరు చదివే పాఠ్యపుస్తకాలలో కనిపించదు. వీరి మౌఖిక వ్యవహారంలో ఉన్న పదజాలం తరచుగా రాతలోకి ప్రవేశిస్తుంటుంది. ఈ సందర్భాలలో విద్యార్థుల భాషాభ్యసనాన్నీ, ఉపాధ్యాయుల బోధన పద్ధతులను మూల్యాంకనం చేయడానికి మనం కొన్ని పద్ధతులను, వ్యూహాలను రూపొందించుకోవలసి ఉంది. నూతన మూల్యాంకన విధానంద్వారా వెలుగుచూసిన బోధనలక్ష్యాలకు, స్పష్టీకరణలకు, మూల్యాంకన విధానాలకు ఈ కోణంనుంచి తగిన మార్పులు చేసికోవాలి. సంక్షిప్తంగా చెప్పాలంటే- ప్రపంచీకరణయుగంలో బోధిస్తున్న సర్వ పాఠ్యాంశాలను మొదటి భాషలో బోధించడానికి అవసరమయ్యే భాషావనరులను అందించగలిగే సమగ్ర బోధన చక్రాన్ని (teaching cycle) తయారు చేసికోవలసి ఉంది.

## 4. క్షేత్రస్థాయి భాషావసరాలు

విభాగం-4, దానిలోని అంతర్విభాగాలు (4.1, 4.2) క్షేత్రస్థాయి భాషావసరాలను పెంపొందించుకోవలసిన ఆవశ్యకతను పట్టి చూపేవి. మన విద్యావ్యవస్థలో – (నిజానికి, తొలినుంచీ) దీనిపై జరిగిన చర్చ తక్కువ. ఫలితంగా క్షేత్రస్థాయిలో వాడుకలో ఉన్న భాష (దేశి పదజాలం, మాండలికాలు) బోధనకు పనికిరానిది అన్న భావం ప్రబలింది. భౌగోళికంగా తెలుగు వ్యవహారప్రాంతం వేల కిలోమీటర్లలో విస్తరించి ఉంది. జిల్లాలు, మండలాలు... వంటి అంతర్విభాగాలలో వాడుకలో ఉన్న మౌఖికభాషా వ్యవహారాన్ని అన్య ప్రాంతవాసులు నియంత్రించజాలరు. ఏ భాషా సమాజంలోనైనా మౌఖిక వ్యవహారం ప్రాథమికం. దాని అవసరాలు, అది సాధించే ప్రయోజనాలు వేరు. దానిని లిఖిత భాషతో అలాగే సరిపోల్చిచూడకూడదు. మౌఖిక వ్యవహారాన్ని రాతలోకి "కుదించుకొనేపుడు" లిఖిత భాషలో అనేక మార్పులు జరుగుతాయి. వాటన్నిటిని పట్టిచూపడం ఇక్కడ ఉద్దేశం కాదు. భాషలో- లేఖనంలో ఏకరూపత సాధించడానికి అన్ని ప్రాంతాలలోనూ, అన్ని స్థాయిలకు పాఠ్యాంశాల రచనకు ఒకే విధానం ఎంతవరకు సమంజసమన్నదానిపై మరింత సమగ్రమైన చర్చ జరగవలసి ఉందన్నది గమనించడం ప్రధానం.

రాతలో ఏకరూపత పేరుతో అన్ని ప్రాంతాలలోనూ బోధనకు ఒకే వాచకం అమలులో ఉండడంలోని ఔచిత్యాన్ని మనం పునస్సమీక్షించుకోవాలి. ఈ విధమైన పద్ధతులు, నియంత్రణలు మాతృభాషల శక్తిసామర్థ్యాలను వెలుగులోకి తీసుకొని రాలేవు సరికదా స్వభాషా వ్యవహారంపై స్వీయ నియంత్రణలను ఏర్పరచుకొన్నట్టవుతుంది. ఈ స్థితిని అధిగమించడానికి క్షేత్రస్థాయిలో పదజాలాన్ని సేకరించి బోధనలో ఉపయోగించడానికి వీలుగా భాషావనరులను రూపొందించగలిగే వ్యవస్థలను మనం ఎక్కడికక్కడ ఏర్పరచుకోవలసిఉంది. భాషా బోధనలో, అభ్యసనంలో ముందువరుసలో ఉన్న మనవంటివారితో ఈ పనిని ప్రారంభించవచ్చు.

## 5. సమీకృత భాషా వ్యవస్థ: సంగణక ఆధారిత పాఠ్యప్రణాళికల రూపకల్పన

ప్రపంచీకరణ యుగంలో భాషలపై, వాటి బోధనపై విశేష చర్చ జరుగుతున్న ఈ తరుణంలో మనం ఒక సమీకృత భాషావ్యవస్థ ఏర్పాటుపై దృష్టి సారించాలి. భాషా నైపుణ్యాలు, బోధన పద్ధతులు, వివిధ స్థాయులకు మొదటి భాషలో (మాతృభాషలో) పాఠ్యగ్రంథాల రచన, పాఠ్య ప్రణాళికల రచన, బోధనోపకరణాల తయారీ... మొదలైన విషయాలను నిశితంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు నవీకరణకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికల తయారీకి ఒక ఆకర కేంద్రంగా (resource centre) పనిచేసే వ్యవస్థ మనకు ఇప్పుడు కావాలి. బోధనలో మనం ఇంతవరకు విస్మరించిన సంగణక ఆధారిత బోధనోపకరణాలపై దృష్టి సారించాలి. ప్రపంచీకరణతో భాషలకు ఉన్న సంబంధాన్ని క్రమపద్ధతిలో అధ్యయనంచేస్తూ, మన విద్యా వ్యవస్థలలో తీసుకురాగలిగిన మార్పులను సూచించగలిగే నిపుణులు పైన పేర్కొన్న సమీకృత భాషావ్యవస్థలో ఉండాలి. ఈ వ్యవస్థతో నిరంతరం సంబంధాన్ని కలిగిఉండే జిల్లా, మండల స్థాయి భాషావనరుల కేంద్రాలను ఏర్పాటు చేసికోవాలి.

తెలుగు బోధకులు, విద్యార్థులు మాత్రమే కాకుండా, సాంఘిక, శాస్త్ర/సాంకేతిక అంశాలు చదివే విద్యార్థులు, బోధకులు ఈ సమాచార ఆకర కేంద్రాలకు తమ మొదటి భాషలో (మాతృభాషలో) ఆయా విషయాలను విపులీకరించడానికి సహకరించే పదజాలాన్ని నిరంతరం అందిస్తూ ఉండాలి. ఇలా సేకరించిన సమాచారం నుంచి స్థాయులకు అనుగుణమైన పదజాలాన్ని వేరుచేసి దానితో పాఠ్యపుస్తకాల రచన జరగాలి. ఈ విషయంలో మన ఉదాశీనత వల్లనే ప్రస్తుతం ఉన్నత స్థాయుల విద్యావ్యాసంగాన్ని మనది కాని భాషలో జరపవలసి వస్తున్నది. దీనినుంచి బయటపడగలిగే ఏర్పాటుతో స్థల, కాల అవధులను అధిగమించగలిగే వెసులుబాటు ఉన్న ఒక సమీకృత భాషా వ్యవస్థ నేటి తక్షణ అవసరం.

## 6. Bibliography


**తెలుగు**

1. కృష్ణకుమార్. 2006. పిల్లలభాష–ఉపాధ్యాయుడు. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్.
2. పవన్ కుమార్, పమ్మి. 2009. భాషా భూషణం (భాషా వ్యాస సంపుటి). హైదరాబాదు: తెలుగుశాఖ. హై.వి.వి.
3. శేషయ్య, ఆర్. వి. 1984. తెలుగు–బోధన పద్ధతులు. హైదరాబాదు: తెలుగు అకాడమి.

**English:**

4. Brown, H. Douglas. 1993. *Principles of Language Learning and Teaching,* Third Edition. Englewood Cliffs, N.J.: Prentice-Hall.
5. Corder, S. Pitt. 1981. *Error Analysis and Interlanguage.* Oxford: Oxford University Press.
6. Gulette, Margaret M. 1982, 1984. *The Art and Craft of Teaching.* Cambridge, MA: Harvard University Press.
7. Johnson, Keith and Keith Morrow, eds. 1981. *Communication in the Classroom*. New York: Longman Publishing.
8. Larsen-Freeman, Diane. 1988. *Techniques and Principles in Language Teaching.* Oxford: Oxford University Press.
9. Oller, John W., Jr. 1983. *Methods That Work*. New York: Newbury House.

**Position Paper**

*Position Paper on Curriculum and Textbooks*. (Penultimate draft) July, 2011. Hyderabad: SCERT, A.P.

**Field Data**

Anand, M., Pavan Kumar, Pammi. 2011. Field Data on *First Language Teaching and Learning*.

(ప్రపంచీకరణ యుగంలో తెలుగు బోధన పద్ధతులు అన్నఅంశంపై జరిగిన జాతీయ సదస్సులో సమర్పించిన పత్రం. 05–06 జనవరి, 2012. SRSV College of Education. విజయవాడ. ఆంధ్రప్రదేశ్.)

# 4. ప్రపంచీకరణయుగంలో తెలుగు బోధన: సిద్ధాంతం, ఆచరణ

తెలుగు భాషా సాహిత్యాల బోధనలో ప్రస్తుతం అవలంబిస్తున్న పద్ధతులను రేఖామాత్రంగా స్పృశిస్తూ, ప్రపంచీకరణయుగంలో వీటిలో రాదగిన మార్పులను ఈ పత్రం చర్చిస్తుంది. తెలుగు బోధనా సిద్ధాంతాలు–ఆచరణల మధ్య తర్కబద్ధమైన సేతువు నిర్మించుకోడానికీ, ఆయా స్థాయులలో భాషా బోధనకు అవసరమైన ఒక సమీకృత భాషా వ్యవస్థ ఏర్పాటుకు తోడ్పడే అంశాలను ఆయా విభాగాలలో ఈ పత్రంలో ప్రతిపాదించడం జరుగుతున్నది. భాషా సాహిత్యాల బోధనలో అందివస్తున్న సాంకేతిక వనరుల వినియోగాన్ని పెంచుకోవలసిన ఆవశ్యకతను ఈ పత్రం విపులీకరిస్తుంది.

## పరిచయం

ప్రపంచీకరణయుగంలో తెలుగు బోధన ఎలా ఉండాలన్న దానిపై మనం ప్రస్తుతం ప్రధానంగా దృష్టి సారించవలసిన అవసరం ఉంది. తెలుగు భాషా సాహిత్యాల బోధనకు తరాలుగా ఏర్పడిఉన్న సంప్రదాయాలను పునస్సమీక్షించుకోవడం నేటి అవసరం. నిజానికి, బోధన సిద్ధాంతాలు, పద్ధతులు అనేకం ఉన్నా, ఈ యుగలక్షణాలకు అనుగుణమైన తెలుగు బోధన పద్ధతులు, సిద్ధాంతాలపై చర్చ జరిగిన సందర్భాలు తక్కువ.

ప్రపంచీకరణ అన్నమాటను మార్కెట్ కేంద్రీకృత వ్యవస్థగా చూసినపుడు మనకు కలిగే ప్రయోజనాలు, కలిగే ఆనందం కన్నా భాషలు, సంస్కృతి, కళలు, చరిత్ర, జీవిత విధానాలు... మొదలైన అంశాల దృష్టికోణంనుంచి ప్రపంచీకరణను అర్థం చేసికోడానికి ప్రయత్నించినపుడు మనకు కలిగే విషాదం ఎన్నో రెట్లు ఎక్కువ. ఆయా రంగాలలో ఈ వ్యవస్థ మన ఆలోచనలకు అందని అగాధాలను ఇప్పటికే ఎన్నింటినో సృష్టించింది. ఇటువంటి అంశాలపై– అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆవశ్యకమైన చర్చలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఈ చర్చలనుంచి, మనం మనసమాజాలకోసం భాషల దృష్టికోణం నుంచి ఏంచేయగలమన్నది ప్రస్తుతం చర్చనీయాంశం.

### 1. భాష: బోధనాంశాలు

ప్రాథమిక స్థాయినుంచి ఉన్నత స్థాయివరకు మన విద్యా వ్యవస్థలో బోధనలో ఉన్న విషయాల(subjects)నే ఉదాహరణగా తీసుకొని గమనించండి. ఈ బోధన విషయాలను మూడు తరగతులుగా విభజించవచ్చన్నది అర్థమవుతుంది.

1. భాషా జ్ఞానాన్ని అందించే విషయాలు / బోధనాంశాలు
2. సాంఘిక శాస్త్రాల జ్ఞానాన్ని అందించే విషయాలు / బోధనాంశాలు

3. విజ్ఞాన శాస్త్రాల జ్ఞానాన్ని అందించే విషయాలు / బోధనాంశాలు

స్థూల దృష్టితో చూసినపుడు వేర్వేరుగా కనిపించే ఈ మూడు విషయాలు లేదా బోధనాంశాలు ఆంతరిక నిర్మాణంలో ఒకదానితో మరొకటి గాఢమైన సంబంధాన్ని కలిగిఉంటాయన్న మౌలిక సూత్రాన్ని సంభావించకపోవడంవల్ల మనం చాలా నష్టపోయాం, నష్టపోతున్నాం. పైన పేర్కొన్న మూడు బోధనాంశాలలో– మొదటి బోధనాంశానికి సంబంధించిన పునాది పటిష్టంగా ఉన్నపుడే– తక్కిన విషయాలకు/శాస్త్రాలకు సంబంధించిన జ్ఞానం బాగా ఉపయోగించగలిగే తరాలు తయారవుతాయన్న ఎరుక మన వ్యవస్థలో ఇంకా పాదుకొనకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించే నిజం!

మనకు ఘనమైన భాషాబోధన సిద్ధాంతాలు ఎన్నో ఉన్నాయి. ఇవి ఆచరణలో అంతంతమాత్రంగా మిగలడానికి సహేతుకమైన కారణాలు కనబడవు. అన్యభాషలలో నేర్చుకొన్న జ్ఞానాన్ని తమ తమ ప్రథమ భాషలలోకి తెచ్చుకోడానికి వీలులేని సమాజాలలో, సంవాద వ్యవస్థలు (communication systems) బలహీనంగా ఉంటాయి. ఇటువంటి సంవాదం వల్ల ఆయా సమాజాలకు జరిగే మేలు కన్నా కీడే అధికం. ఇటువంటి సందర్భాలలో ఈ సమాజానిదికాని భాషలో ఈ సమాజంలోని వ్యక్తులతో వ్యవహరించడంవల్ల సంకుచిత సంవాద పరిసరాలు ఏర్పడతాయి. ఈ లక్షణాన్ని మన సమాజాలలో బాగా గుర్తించవచ్చు. ఇలా– భావ ప్రసరణ–భావగ్రహణ వ్యవస్థల మధ్య ఒక అగాధాన్ని కొనసాగించే ప్రయత్నం చేయడమా? లేదా– వ్యక్తిగత స్థాయిలోనూ, వ్యవస్థాపరంగానూ ప్రయత్నించి ఈ స్థితినుంచి గట్టెక్కగలిగే మార్గాంతరాలను అన్వేషించి అమలుచేయడమా? అన్నది ఇప్పుడు దృష్టి నిలపదగిన ప్రధాన విషయం.

## 2. బోధనాంశాలు: కొనసాగుతున్న గతం

పై విభాగాలలో మనం చర్చించిన అంశాలకు సంబంధించి సుమారు రెండు శతాబ్దులక్రితమే ఇటువంటి చర్చ మొదలైందని, ఆచరణకు తగిన వాతావరణాన్ని మనం కల్పించుకోలేకపోయామనీ తెలిస్తే మనం మరింత ఆశ్చర్యానికి గురవుతాం! ఆంగ్లేయులు భారతదేశాన్ని పాలిస్తున్న కాలంలో చేసిన 1813 చార్టర్ చట్టంలో ఈ విషయమే ప్రధానమైన చర్చనీయాంశం. ఆధునిక విద్యావ్యాప్తికోసం ఈ చట్టం ద్వారా కేటాయించిన నిధులు 1823దాకా (ఒక దశాబ్దం) వినియోగింపబడలేదు. అందుకు కారణాలు రెండు. ఒకటి– బోధన ఏ మాధ్యమంలో జరగాలి?, రెండు– బోధించవలసిన విషయాలు (Subjects)ఏవి?. దాదాపు రెండు శతాబ్దులుగా ఈ రెండు అపరిష్కృత సమస్యలను చిన్న చిన్న మార్పులూ చేర్పులతో నెట్టుకువస్తున్నాం– తప్ప, ఇప్పటికీ ఒక సమీకృత పరిష్కార వ్యవస్థను ఏర్పర్చుకోలేకపోయాం. ఈ లక్ష్యంతో పనిచేయాల్సిన జాతీయ, రాష్ట్రస్థాయి సంస్థలకు పరిధులూ, పరిమితులూ ఎక్కువ.

## 3. భాషలకోణంనుంచి ప్రపంచీకరణను అర్థం చేసికోడం ఎలా?

ప్రపంచ దేశాలను మార్కెట్ కేంద్రీకృత వ్యవస్థగా చూడడంవేరు. ఈ వ్యవస్థ కేంద్రంగా ఆయా దేశాలలో/సమాజాలలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయడం వేరు. ప్రపంచీకరణ పుణ్యమాని– వస్తు రూపంలో అందుతున్న సౌఖ్యాలు ముందు తరాలతో పోల్చినపుడు ఈ తరానికి ఎక్కువగా లభిస్తున్నాయన్నది నిర్వివాదాంశం. మునుపటి తరాలలో– ఏ తరాన్ని అంతకుముందున్న తరంతో పోల్చినా ఈ సౌఖ్యాన్ని అమితంగా పొందుతున్నది వర్తమాన సమాజాలే అని చెప్పకతప్పదు. సాంకేతిక జ్ఞానాభివృద్ధి ఈ సౌలభ్యాన్నీ, అయా సమాజాలనూ అమితంగా ప్రభావితం చేస్తోంది. ఫలితంగా– దేశాలమధ్య ఇప్పుడు దూరం తగ్గింది. దైనందిన జీవితంలో వేగం హెచ్చింది. ఒక వ్యక్తి ప్రతిభా పాటవాలనిరూపణకు ప్రపంచమే హద్దు అన్నమాటకు అనుకూలమైన వాతావరణం ముందున్న యుగాలతో పోల్చినపుడు నేడు ఎక్కువ.

ప్రపంచీకరణ యుగంగా మనందరం భావిస్తున్న ఈ యుగ గమనాన్ని మనం బహుకోణీయ దృష్టితో చూడవలసి ఉంది. అంతా భావిస్తున్నట్టు ఈ యుగం ఏకధ్రువ మార్గంలో సాగుతున్నదా? లేక భిన్నధ్రువ మార్గాలలో పయనిస్తున్నదా? అన్నది ఇక్కడ ప్రధానంగా గుర్తించాలి. ఆర్థికాభివృద్ధి, వస్తూత్పత్తి–విక్రయం, పారిశ్రామిక ఏకీకరణ మొదలైన విషయాలలో ఏకధ్రువ లక్షణాలు కనిపించినా, వీటన్నిటినీ అనుభవంలోకి తెస్తున్న లేదా పట్టి నడిపిస్తున్న జ్ఞానం ఎలా వెలుగుచూస్తున్నది? ఏ ఏ భాషలమూలంగా ప్రపంచం వీటిని సంభావించగలుతున్నది? అన్నది ఇక్కడ కీలకాంశం. ప్రపంచ విషయాలన్నీ ఏకధృవ లక్షణాలను ప్రదర్శిస్తున్నపుడు, వాటిని అనుభవంలోకి తెస్తున్న భాషలుకూడా ఇటువంటి లక్షణాలనే ప్రదర్శిస్తాయన్నది అనుభవంలోకి వచ్చాక – ప్రపంచ దేశాలు ఈ విషయంలో ఇప్పుడిప్పుడే భిన్నధ్రువ లక్షణాన్ని అవగాహన చేసికొంటున్నాయి.

సరిగ్గా– ఈ భిన్నధ్రువ లక్షణమే ఆయా భాషలను, వాటిని ఆశ్రయించుకొనిఉన్న సంస్కృతిని, చరిత్రను, తదితరాంశాల గొప్పతనాన్ని ప్రత్యేకంగా పట్టి చూపుతుంది. అంటే– ఏకధ్రువ ప్రపంచంలో భిన్నధ్రువతను కూడా ఒక కలగలుపు లక్షణంగా మన అనుభవంలోకి తెచ్చుకోవలసిన అవసరం ఉంది. ఈ అనుభవాన్ని ఆచరణలోకి తెచ్చుకొన్న సమాజాలలోని ప్రజలు మాత్రమే వారి భాషలను, సంస్కృతిని ప్రత్యేకంగా నిలుపుకోగలుతుతారు. ఇలా అనుభవంలోకి తెచ్చుకోని సమాజాలు, అనుభవంలోకి తెచ్చుకొని ఆచరణలో వెనుకబడ్డ సమాజాలు ఏకధ్రువ ప్రవాహంలో పడి, ఏకధ్రువ ప్రపంచ లక్షణాలనే ప్రతిబింబిస్తూ, దానికి నకళ్ళుగా కొనసాగుతాయి. భారత దేశచరిత్రతో కాస్త పరిచయం ఉన్నవారు ఈ విషయాన్ని మరింత బాగా సంభావించగలుగుతారు.

## 4. భిన్నధృవలక్షణాన్ని మన భాషలకు అనువర్తించుకోడం ఎలా?

"భావ వ్యక్తీకరణకు, భావగ్రహణానికీ సాధనం భాష" అనే ప్రసిద్ధమైన నిర్వచనం ఒకటి వాడుకలో ఉంది. శాస్త్రీయమైన ఈ నిర్వచనంతోనే భాషా శాస్త్రంతో పరిచయం కలిగించే ప్రయత్నం చేస్తుంటాం. ఈ నిర్వచనాన్ని కేవలం ఒక ఉటంకింపుగా కాకుండా – విస్తృతార్థంలో గ్రహించడంవల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఈ నేపథ్యంతో భాషలగురించి చేసిన చర్చలు బహు తక్కువ. మాతృభాష అనగానే మనం ప్రదర్శించుకొనే అభిమానానికీ– దాని మనగడకోసం మనం చేసే శాస్త్రీయమైన చర్చలకు మశక–హస్త్యంతరం ఉంది.

ఒక సమాజంలో నివశించే అత్యధికులు మాట్లాడేభాష వారి ప్రథమ భాష అవుతుంది. దీనినే మనం మాతృభాష అంటున్నాం. మన సమాజాన్ని మించి చూడాలని, ఇతరేతర సమాజాల విశేషాలను తెలుసుకోవాలని మనందరిలో ఉన్న తపన ఈ నాటిది కాదు. దీనికి కొన్ని శతాబ్దుల చరిత్ర ఉంది. మన విద్యా వ్యాసంగంలో బహు భాషలతో పరిచయం ఏర్పర్చడం ఇందుకే. ముందుగా ప్రథమ భాష, ఆపై దేశ భాష, తరువాత అంతర్జాతీయ భాష అన్న త్రిభాషాసూత్రాన్ని విధిగా విద్యా వ్యాసంగంలో చేర్చడంలోని ఆంతర్యం ఇదే. (వీటి అమలు ఎలా జరుగుతోందన్నది– వేరే చర్చనీయాంశం)

బహు భాషలలో, అనేక దేశాలలో ఉన్న జ్ఞానాన్ని మన అనుభవంలోకి తెచ్చుకోడానికి మనం పాటించే పద్ధతులలో త్రిభాషా సూత్రం వంటి వాటిని అమలు చేసుకోడం ఒక వెసులుబాటు కాగా– మనదేశంలో ఇది ఒక పరిమితిగా అమలు చేయవలసిన అగత్యం లేదు. ఉత్తర అమెరికా ఖండంలోనూ, యూరోప్ ఖండంలోని కొన్ని దేశాలూ దాదాపుగా ఏకభాషా వ్యవహార దేశాలు. వారి దైనందిన భాషావసరాలన్నీ అంగ్లంతో ముడిపడి ఉంటాయి. భారతదేశం వంటి బహుభాషా వ్యవహార దేశాలలో ఒకటికి మించి భాషలు నేర్వాల్సిందే. జ్ఞానం ఏ ముఖంగా విస్తరిస్తోందో, దానినుంచి ఆ భాషకూడా విస్తరిస్తుంది. అయితే; ఈ భాషా ప్రవాహంలో ప్రథమ భాషలు కొట్టుకుపోకుండా చూసుకోడం అన్నది ఆయా భాషా వ్యవహర్తల కర్తవ్యం. భాషలలో ప్రవర్తిల్లే ఈ భిన్నధ్రువతను జాగ్రత్తగా గమనిస్తూ, భాషను ఆశ్రయించుకొనిఉన్న రంగాలలో భాష ప్రవర్తిల్లే తీరును, దాని లక్షణాలను, ప్రయోజనాలను గుర్తించగలిగే ఒక శాస్త్రీయమైన సమీకృత వ్యవస్థను మనం తక్షణం ఏర్పాటు చేసికోవలసిఉంది.

## 5. తెలుగు బోధన: సిద్ధాంత–ఆచరణలమధ్య సంబంధం

ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో తెలుగు బోధనను సమగ్రతా దృష్టి కోణంనుంచి చూడాల్సి ఉంటుంది. తెలుగు బోధన అన్న అంశాన్ని కేవలం తెలుగు సాహిత్య/భాషా బోధన అన్న సంకుచిత అర్థంలో గ్రహించకూడదు. సమగ్ర శాస్త్రాభివృద్ధికి సమగ్ర భాషాభివృద్ధిమాత్రమే మూలం అన్న

మౌలికసూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని మన భాషా వ్యవస్థను పటిష్ట పరచుకోడానికి ఇది మంచి తరుణం. ఈ ఫలితాలనుసాధించగలిగే ఏకైక లక్ష్యంతో పనిచేసే సమీకృత భాషాభివృద్ధి వ్యవస్థ నేటి అవసరం.

పైకి వేర్వేరుగా కనిపిస్తున్నా – ఈ విషయాలన్నీ ఒక సమగ్ర భాషాభివృద్ధి ప్రణాళికలో భాగం. దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే సర్వ వ్యవస్థలకూ భాష అవసరం తప్పనిసరి. సర్వ విషయాలనూ మోసుకువచ్చేది భాషే. మౌఖిక, లిఖిత రూపాలలో భాష అందించగలిగే ప్రయోజనాలను బాగా వినియోగించుకోడానికి తగిన అవసరాలన్నిటినీ ఇటువంటి సమీకృత వ్యవస్థలు మాత్రమే తీర్చగలుగుతాయి. సమగ్ర సమాజ/దేశ అభివృద్ధిని సూచించే అభివృద్ధి సూచులు ఎన్నిఉన్నా, సమగ్ర భాషాభివృద్ధిసూచులు లేని సమాజాలు/దేశాలు ఎప్పుడూ వెనుకబడే ఉంటాయి.

ఒక శుద్ధ విజ్ఞాన శాస్త్రాన్ని (pure science) అన్యభాషలో చదువుకొన్న విద్యార్థి తన మొదటి భాష (మాతృభాష)లో ఆ విషయాలను/భావాలను బాగా నివేదించగలుగుతుంటే ఆ సమాజంలో సంవాద పద్ధతులు బాగా వృద్ధి చెందినట్టు లెక్క. ఏ శాస్త్రమైనా, అది ఏ భాషలో నేర్చుకొన్నదైనా, తన భాషలో ఒక వ్యక్తి ఆవిష్కరించగలగాలి. నిజానికి, జ్ఞానాభివృద్ధి జరిగిన సమాజంలో మాట్లాడే భాషా, దానిని (వెనువెంతనే) వ్యక్తంచేసే భాషా ఒక్కటే అయినపుడు ఆ సమాచార నివేదనలో స్పష్టాధిక్యత ఉంటుంది. ఇటువంటి స్పష్టతను భాషాంతరీకరించిన (translation) సందర్భాలలో కూడా సంభావించగలిగినపుడే మన భాషలు అభివృద్ధి చెందినట్టు లెక్క. ఇందుకు తగిన సమానార్థ పదజాలం దొరకనపుడు – మూలభాషా పదాన్నే వాడి సంభాషణను నడుపుతుంటాం. అంటే– మన సమాజానికి కొత్తదైన భావాన్ని కొత్త పదజాలంతో ఎదుటివారికి నివేదించడానికి ఉపయోగిస్తున్నామన్నమాట. ఇటువంటి మిశ్రభాషణం ఎవరికీ మాతృభాష కాదు. ఆశ్చర్యకరంగా– మన దైనందిన వ్యవహారాలన్నీ ఈ మిశ్రభాషతోనే ముడిపడి ఉంటున్నాయి. ఇటువంటి భాషణంద్వారా – వ్యవహర్త చెప్పినది శ్రోత విని అర్థం చేసుకొన్నదీ (లేదా చదివి అర్థం చేసుకొన్నది) ఏమిటి? ఈ రెంటి మధ్య ఎటువంటి అర్థసంబంధం ఉంది? అన్నది పరిశీలించి చూడండి– ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలుగుచూస్తాయి. మన భాషల బలం ఎంతో మన అనుభవంలోకి వస్తుంది.

మిశ్ర భాషలో భావావిష్కరణ, భావ గ్రహణం చాలా కష్టం. కాబట్టి వ్యవహర్తలు తమ మొదటి భాషను నిరంతరం నవీకరించుకొంటుండాలి. ఇందుకు వ్యవహర్తలకు కావలసిన పరిజ్ఞానాన్ని సమీకృత భాషా వ్యవస్థలు అందించగలగాలి. ఇటువంటి సంస్కరణలు మొదట విద్యారంగం నుంచి ఆరంభమవ్వాలి. ప్రస్తుతం అమలులో ఉన్న వివిధ స్థాయుల తెలుగు వాచకాలను గమనించండి. అనేక శాస్త్రాలకు సంబంధించిన అంశాలు పాఠాలరూపంలో కనిపిస్తాయి. ఆయా శాస్త్రాల బోధనలో భాగం చేయదగ్గ పాఠాలెన్నో తెలుగు వాచకాలలో దర్శనమిస్తాయి. మాతృభాషలో ఆయా విషయాలను

నేర్పించాలనే ఆశయం మంచిదే కాని, ఇలా అమలు చేయడం మాత్రం సరికాదు. ఆయా శాస్త్రాల, విషయాల అభివృద్ధికి సహకరించే భాషావనరులను పెంపొందించుకొనే కార్యక్రమాన్ని ఇది ఆటంక పరుస్తుంది. సాహిత్య, భాషా బోధకులపై వారి అనుభవంలోలేని విషయాలను బోధించవలసిన అదనపు భారాన్ని మోపుతుంది. అందువల్ల, విధిగా ఒక స్థాయివరకూ, అన్ని విషయాలనూ (subjects) వారివారి మొదటి భాషలలోనే వివిధ బోధనాంశాలలో నేర్పగలిగే విధంగా ఆయా వ్యవస్థలు నవీకరింపబడాలి. ఇందుకు– స్థాయులకు అనుగుణమైన విషయాలవారీ పదపట్టికలను తయారుచేయడం అన్నది ఒక నిరంతర కార్యక్రమంగా సాగాలి.

మరో ప్రధానమైన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించి– ఈ వ్యాసాన్ని ముగిస్తాను. అది– భాషాబోధనలోనూ, వివిధ శాస్త్రాల బోధనలోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోడంలో మన వెనుకబాటుకు సంబంధించినది. సంగణకాలు (computers) వినియోగంలోకి వచ్చాక, సంవాద పద్ధతులలో (communication systems) అనేకమైన మార్పులొచ్చాయి. సంగణక ఆధారిత (computer based), అంతర్జాల ఆధారిత (internet based) సమాంతర తరగతుల నిర్వహణ ఇప్పటికే వినియోగంలో ఉంది. స్థాయులకు అనుగుణమైన పద్ధతిలో వీటివినియోగాన్ని అందుకోడంపై మన విద్యావ్యవస్థ దృష్టిసారించడం తక్షణావసరం. ఈ యుగ బలాలను అందుకోడంలో మన వెనుకబాటు ముందు తరాలకు మంచి సంకేతాలను ఇవ్వదు. పైగా– ఈ తరం బలహీనతలను రాబోయే తరాలలో బలంగా చాటుతుంది. ఈ అనావశ్యకమైన, అవాంచితమైన అపప్రథనుంచి గట్టెక్కాలంటే– విస్తృత ప్రయోజనాలను అందించగలిగే సమీకృత భాషావ్యవస్థల ఏర్పాటు తప్పనిసరి. ఇందుకోసం వివిధ స్థాయులలో ఇప్పటికే పనిచేస్తున్న నిపుణుల సలహాలను, మార్గదర్శకాన్ని పొందే అవకాశం అదృష్టవశాత్తూ మన సమాజం కలిగి ఉంది.

## 6. Bibliography


1. Alatis, James E., ed. 1980. *Georgetown University Round Table On Languages and Linguistics: Current Issues in Bilingual Education.* Washington: Georgetown University Press.
2. Brown, H. Douglas. 1993. *Principles of Language Learning and Teaching,* Third Edition. Englewood Cliffs, N.J.: Prentice-Hall.
3. Corder, S. Pitt. 1981. *Error Analysis and Interlanguage.* Oxford: Oxford University Press.
4. Finocchiaro, Mary and Christopher Brumfit. 1983. *The Functional-Notional Approach: From Theory to Practice*. New York: Oxford University Press.
5. Gulette, Margaret M. 1982, 1984. *The Art and Craft of Teaching.* Cambridge, MA: Harvard University Press.

6. Johnson, Keith and Keith Morrow, eds. 1981. *Communication in the Classroom*. London and New York: Longman Publishing.
7. Krashen, Stephen D. 1985. *Inquiries and Insights*. New York: Prentice Hall.
8. Larsen-Freeman, Diane. 1988. *Techniques and Principles in Language Teaching.* Oxford: Oxford University Press.
9. Oller, John W., Jr. 1983. *Methods That Work*. New York: Newbury House.

(ప్రపంచ తెలుగు సదస్సులో సమర్పించిన పత్రం. 05–07 జనవరి, 2012. ఒంగోలు. ఆంధ్రప్రదేశ్)

≻≻≻≻≺≺≺≺

# 5. భాష: ప్రపంచీకరణ, స్థానికీకరణ, ప్రపంచస్థానికీకరణల సంబంధం

పత్ర శీర్షికలోని ప్రపంచీకరణ అన్న మాటను globalization అన్న అర్థంలోనూ, స్థానికీకరణ అన్నమాటను localization అన్న అర్థంలోనూ, ప్రపంచస్థానికీకరణ అన్న మాటను glocalization అన్న అర్థంలోనూ వాడుతున్నాను.

Globalization, localization అన్న రెండు మాటల సంకర పదం glocalization. ఈ పదం విశ్వవ్యాప్తంగా అనేక రంగాలలో గత కొంత కాలంగా వాడుకలో ఉంది. ప్రపంచీకరణ, స్థానికీకరణల కలగలపు లక్షణాలను ప్రపంచస్థానికీకరణ ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని ప్రతి దేశమూ, సమాజమూ దీనికి ఉదాహరణలే!

ప్రపంచీకరణకు విరుగుడుగా ఆయా దేశాలలో, సమాజాలలో స్థానికీకరణ వేళ్ళూనుకొన్నది– అన్నది ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రక్రియను అధ్యయనం చేస్తున్నవారి అవగాహన. విశ్వవ్యాప్తంగా నివశిస్తున్న ప్రజలలోని – స్వీయ మూల శోధనాకాంక్షనుంచి బయలుదేరిన "స్థానికీకరణ" అనే ఈ అప్రకటిత ఉద్యమంలో వస్తూత్పత్తి, ఆర్థిక, రాజకీయ... తదితర వ్యవస్థలలో/రంగాలలో వస్తున్న మార్పులను గమనించడం ఒక ఆసక్తికరమైన అంశం. ఈ నేపథ్యంలో– ఆయా సమాజాల అంతర–బాహిర వ్యవస్థలను నడిపిస్తున్న భాషలను ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసన అవసరం ఉంది. ఈ దృష్టికోణం నుంచి పైన పేర్కొన్న ప్రపంచ స్థానికీకరణను అవగాహనకు తెచ్చుకోవలసిన ఆవశ్యకతను ప్రస్తుత పత్రం వివరిస్తుంది.

## 1. పరిచయం

మనిషి ఆలోచనా విధానాన్ని, దైనందిన జీవితాన్ని అమితంగా ప్రభావితం చేస్తున్న అనేకాంశాలకు మూలపాదుగా ఉన్న కాలంలో మనం ఉన్నాం. గడచిన అనేక శతాబ్దాల కాలంతో పోల్చినపుడు ఈ మార్పును ప్రస్తుతం స్పష్టంగా గుర్తించగలం. ప్రపంచ నాగరికతలు విలసిల్లన కాలంనుంచీ ప్రపంచీకరణప్రక్రియ ఆరంభమయ్యిందని నిరూపించే ప్రయత్నం అంతర్జాతీయంగా జరుగుతున్నది. "వసుధైక కుటుంబ" భావన మనకు ఎప్పటినుంచో ఉందని చెబుతూ సమన్వయించే ప్రయత్నాలూ జరిగాయి. ప్రస్తుత పత్రంలో 1960 దశాబ్ది తరువాత ప్రపంచీకరణ ప్రక్రియను మాత్రమే – అందునా భాషల కోణంనుంచి మాత్రమే – పరిశీలించి ఆ వివరాలను తెలపడానికి పరిమితమవుతున్నాను. ఈ ప్రభావాలకు కారణమవుతున్న ప్రపంచీకరణ (globalization), స్థానికీకరణ (localization),

ప్రపంచస్థానికీకరణ (glocalization) లను భాషల దృష్టికోణం నుంచి ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఉంది.

1960 తరువాతి కాలంలో విశ్వవ్యాప్తఆర్థిక వ్యవస్థలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొనిరావడం అన్న ప్రధానమైన అంశంతో వెలుగుచూసిన ప్రపంచీకరణ, నిజానికి – 1930ప్రాంతంలో – మొదటిసారిగా ప్రపంచవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో మార్పులకోసం ప్రతిపాదింపబడింది. మనిషి వ్యక్తిగత ప్రతిభను నిరూపించుకోడంలోనూ/ వినియోగించుకోడం లోనూ ఎదురయ్యే పరిధులను చెరిపివేసే లక్ష్యంతో వేళ్ళూనుకొన్న ప్రపంచీకరణ అన్న భావన 60, 70 దశకాలలో ఆర్థిక వ్యవస్థలలో మార్పులను తెచ్చే వృద్ధి సూత్రంగా సంకుచిత పరిధిలో స్థిరపడింది. ప్రపంచీకరణ=globalization, స్థానికీకరణ =localization, ప్రపంచస్థానికీకరణ=glocalizationఅన్నవి కేవలం తుల్యరూపాలు మాత్రమే కావు. కొన్ని సందర్భాలలో ఇవి భావనలు (concepts). ఇంకొన్ని సందర్భాలలో ఇవి అభివృద్ధి సూత్రాలు. చాలా వ్యవస్థలలో ఇవి వృద్ధి సిద్ధాంతాలు. అన్నిటినీ మించి – ఇవి అత్యంత వ్యాఖ్యానాపేక్షాలు. ఈ భావనల, సూత్రాల, సిద్ధాంతాల కోణంనుంచే మనం ప్రపంచ సమాజాలను, వాటి అంతర్విభాగాలను, వ్యవస్థలను అర్థం చేసికోవలసి ఉంటుంది.

ప్రపంచీకరణ ప్రక్రియ, దాని అనువర్తన నైజంవల్ల బహురూపాలలో దర్శనం ఇస్తుంది. దీని ద్వారా60, 70, 80, 90 దశకాలలో మానవాళి పొందిన ఫలితాలకు 20వ శతాబ్ది చివరి దశకంలో– అంటే, 90వ దశకంలో పొందిన ఫలితాలకు గుర్తించదగిన వైరుధ్యం ఉంది. ఆశ్చర్యకరంగా– అప్పుడప్పుడే ఆయా సమాజాలలోని ప్రజలకు ఏర్పడిన కొత్త అనుభవాలు ప్రపంచీకరణ పట్ల అంతకుముందు తమకు ఉన్న భావాలను తారుమారుచేశాయి. ఫలితంగా భావాలలో, వేష–భాషలలో వైరుధ్యాలు ఏర్పడ్డాయి. ప్రపంచ దేశాలన్నిటా ప్రత్యేకంగా వేరుచేసి చూపించలేని ఒక ప్రత్యేక లోకం రూపుదిద్దుకొంది. ఈ కొత్త లోకం సర్వ విషయాలలోనూ ప్రపంచ స్థానికీకరణను(glocalization) ప్రతిఫలిస్తోంది. ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా సంవాద పద్ధతులలో(communication systems), విద్యా వ్యవస్థలో అనేక మార్పులు కలుగుతున్నాయి. సమాజ ఉపరితల నిర్మాణంలోనూ, అంతరంగ నిర్మాణంలోనూ అత్యంత సహజం అనిపించేలా జరుగుతున్న ఈ పెను మార్పుల కారణంగా, ప్రపంచభాషల స్థితి గతులను ఎలా మారుతున్నాయన్నది ప్రధానంగా చర్చించవలసిన విషయం. సమాజ ఉపరితల నిర్మాణంలోనూ, అంతరంగ నిర్మాణంలోనూ భాషలకు ఘనిష్ఠమైన సంబంధం ఉంది. ఈ నేపథ్యాల దృష్టికోణంనుంచి మన భాషలకు సంబంధించిన చర్చ మన సమాజాలలో జరగిన దాఖలాలు తక్కువ.

## 2. భాషల కోణంనుంచి ప్రపంచీకరణ, స్థానికీకరణ–

## ప్రపంచస్థానికీకరణలను అర్థం చేసికోడం:

ప్రపంచ దేశాలను మార్కెట్ కేంద్రీకృత వ్యవస్థగా చూడడం అన్నది – అభివృద్ధి చెందిన దేశాల దృష్టి కోణం. అభివృద్ధి చెందుతున్న దేశాలు అభివృద్ధి చెందిన దేశాల నకళ్ళుగా మారడానికి కావలసిన బహురూప వ్యవస్థలను రూపొందించుకోడం అన్నది ఆశ్చర్యకరమైన నిజం. వీటి మధ్య తర్కసహమైన సేతువు నిర్మించడానికి కావలసిన కృషి ఒక క్రమపద్ధతిలో వ్యవస్థాపరంగా ఇంకా మన సమాజాలలో ఏర్పడలేదు. మనముందున్న తరాలకు లేని వస్తు సౌకర్యాలను మనం పొందగలగడంలోని ఆనందాన్ని పొందగలుగుతున్నామేగాని, వాటివెంటపడి వస్తున్న భావనల, సూత్రాల, సిద్ధాంతాల రహస్యాలను సంభావించలేకపోతున్నాం.

ప్రపంచం ఒక కుగ్రామంగా మారిందని లేదా ప్రపంచీకరణ యుగంలో మనమంతా నివశిస్తున్నామన్నది ఎంత నిజమో, ఈ కుగ్రామ/యుగ లక్షణాలను ఆయా సమాజాలలోని ప్రజలు బాగా అవగాహనకు తెచ్చుకోలేదన్నదికూడా అంతే నిజం. ఏకధ్రువ ప్రపంచంగా కనిపిస్తున్న ప్రస్తుత ప్రపంచంలోని, భిన్నధ్రువ లక్షణాలను జాగ్రత్తగా గమనించి భవిష్యత్తును దిద్ది తీర్చుకొంటున్న దేశాలు బహు తక్కువ. వీటన్నిటికీ భాషలతో సంబంధం ఉంది. పదే పదే మనం చెప్పుకొంటున్న అర్థికాభివృద్ధి, వస్తూత్పత్తి, పారిశ్రామికరణ మొదలైన వ్యవస్థలను పట్టి నడిపిస్తున్న జ్ఞానం వెలుగుచూస్తున్నది భాషల ద్వారానే! ఏ ఏ భాషల ద్వారా ప్రపంచం వీటిని సంభావించగలుగున్నది? ఏ ఏ భాషలతో అది బాగా సంగమిస్తున్నది? లేదా ఏ ఏ భాషలను తనలో సంగమింపజేసుకొంటున్నది అన్నది ఇక్కడ కీలకం.

భాష–వ్యవహర్తల సంఖ్య అన్న అంశాల ఆధారంగా, నేడు ప్రపంచవ్యాప్తంగా 845మిలియన్ల వ్యవహర్తలతో మాండరిన్(చైనీస్) మొదటిస్థానంలో ఉంది. తరువాతి స్థానం స్పానిష్‌ది. ఈ భాషకు 329మిలియన్ల వ్యవహర్తలు ఉన్నారు. ఇంగ్లిష్ 328 మిలియన్లమంది వ్యవహర్తలతో మూడోస్థానంలో ఉంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా మూడోవంతు ప్రజలకు రెండో ప్రధాన భాష హోదాతో ఇంగ్లిష్ – ఎక్కువ దేశాలలో వాడుకలో ఉంది. ఇది ఆ భాషకు, ఆ భాష మొదటి భాషగా వాడుకలో ఉన్న దేశాలకు బాగా కలిసి వచ్చే అంశం. ఈ విషయాన్ని ప్రపంచస్థానికీకరణతో ముడిపెట్టి చూడండి – భావజాల వ్యాప్తికి భాషలను ఉపయోగించుకోదగ్గ కొత్త అంశాలు మన అనుభవంలోకి వస్తాయి. ఈ విషయాలను బహుకోణీయ దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

## 3. ప్రపంచీకరణ, స్థానికీకరణ–ప్రపంచస్థానికీకరణ:

## భాషావ్యవహారంలో కలుగుతున్న మార్పులు:

ప్రపంచ విద్యా రంగంలో మార్పులకు ఉద్దేశించిన అభివృద్ధి సూత్రం ఆర్థిక రంగాలను ప్రభావితం చేసే అంశంగా ఎదిగి ప్రపంచ ముఖ చిత్రాన్ని మార్చివేయడమన్నది ఆశ్చర్యకరమైన నిజం. ఆదాన ప్రదానాలకు భాషా శాస్త్రవేత్తలు ఇచ్చిన కారణాలను అధిగమించి భాషల వాడుకలో మార్పులు కలిగాయి. ఆవశ్యకతాపూరణం అన్న ఒక్క లక్షణాన్ని వర్తింపజేసుకొని విద్యారంగం మొత్తంలో అనేక మార్పులు కలుగుతున్నాయి. ఫలితంగా– ప్రపంచంలోని ప్రజారంజక భాషే(popular language) బోధనాభాషగా స్థిరపడుతోంది. భాషా జ్ఞానాన్ని అందించే బోధనాంశాలు, సాంఘిక శాస్త్రాల జ్ఞానాన్ని అందించే బోధనాంశాలు, విజ్ఞాన/సాంకేతిక శాస్త్రాల జ్ఞానాన్నిఅందించే బోధనాంశాలు... అన్నిటా ఈ ప్రజారంజక భాషే వేళ్ళూనుకొంటున్నది.

ప్రజారంజక భాష(popular language)విషయంలో గుర్తించవలసిన విషయం ఏమంటే– సజాతీయ/భాషా కుటుంబాలలోని భాషల మధ్య వినిమయం చెదిరిపోవడం. పొరుగు భాషలతో సంగమం ఎక్కువ కావడం. స్థల, కాల ఆవధులను అధిగమించి తయారవుతున్న ఈ ప్రజారంజక భాషద్వారా వ్యక్తమవుతున్న సమ్మిశ్ర భాషా లక్షణాలను భాషా శాస్త్ర దృక్పథంతో అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఆయా భాషలలో కలుగుతున్న ఈ మార్పులను అధ్యయనంచేసి, వాటి వాడకంలో వస్తున్న నూతన పద్ధతులను క్రమబద్ధం చేయగలిగే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోకపోతే, భవిష్యత్తులో –భాషా కుటుంబ విభజన సూత్రాలను పునస్సమీక్షించుకోవలసిన అవసరం కలగవచ్చు.

## 4. సంస్కరణలు విద్యారంగంతో ప్రారంభం కావాలి

అనేక స్థాయిలుగా విభజించుకొన్న మన విద్యా వ్యవస్థలోని భిన్న రూపాలమధ్య సహేతుకమైన బంధాన్ని ఏర్పరుచుకోవలసిఉంది. ఆర్థిక, వస్తూత్పత్తి వ్యవస్థలకు ఉన్నట్టుగానే భాషలకుకూడా వృద్ధిసూచులు ఏర్పాటు చేసుకోవాలి. తమతమ వ్యక్తిగత దేశ వృద్ధి సూచులను ప్రభావితం చేయగలిగేవిగా భాషలను పరిగణించకపోతే వచ్చే అనర్థాలు అనంతం. అభివృద్ధి చెందిన దేశాలుగా మనం చెప్పుకొంటున్న దేశాలలో ఈ ముఖంగా దిద్దుబాటు చర్యలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

అమెరికా వంటి కొన్ని దేశాలలో అంతటా ఆంగ్ల భాషా వ్యవహారమేఉన్నా, తమదేశ భవిష్యదవసరాలను దృష్టిలో ఉంచుకొని విదేశీ భాషలను నేర్చుకొనేలా కొత్త తరాన్ని ప్రోత్సహించడం ఇందుకు తగిన ఉదాహరణగా పేర్కొనవచ్చు. దక్షిణాసియా భాషలతోపాటు జపనీస్, చైనీస్(మాండరిన్)

తదితర భాషలను ఉన్నత స్థాయులలో విధిగా నేర్చుకోవాలనే నిబంధన ఇప్పుడు అమెరికాలోని ముఖ్య రాష్ట్రాలలో అమలవుతోంది. ఈ భాషలన్నిటినీ ఒకే చోట నేర్పగలిగే విద్యాలయాలు అమెరికాలో అనేకం ఉన్నాయి. వివిధ భాషలతోపాటు, వివిధ బోధనాంశాలనుకూడా స్థానిక భాషలలో/మన మాతృభాషలలో బోధించగలిగే భాషా వనరులను వృద్ధిచేసికోవాలి. ఇటువంటి సమీకృత భాషా బోధన కేంద్రాలను ఏర్పాటుచేసుకోడంలో బహుభాషా వ్యవహార ప్రాంతమైన మన దేశంలోని విద్యాలయాలు వెనుకబడి ఉండడం గమనించి దిద్దుబాటుచర్యలు మొదలుపెట్టాలి.

## 5. సమీకృత భాషావ్యవస్థల ఏర్పాటు తక్షణావసరం

వివిధ శాఖలుగా, స్థాయులుగా విభజించబడ్డ మన విద్యావ్యవస్థను పుష్టిమంతం చేయడానికి సమీకృత భాషా వ్యవస్థలను ఏర్పాటు చేసికోవడం ఇప్పటి తప్పనిసరి అవసరం. భౌగోళికంగా వేలకిలోమీటర్లలో విస్తరించిఉన్న తెలుగువ్యవహార ప్రాంతాన్నే ఉదాహరణగా తీసికోండి. అన్ని ప్రాంతాలలోని భాషలోని వైవిధ్యాన్ని పట్టి చూపగలిగే వెసులుబాటు ఉన్న వ్యవస్థ మనకు లేదు. జిల్లాలు, మండలాలు... వంటి అంతర్విభాగాలలో వాడుకలో ఉన్న మౌఖిక భాషా వ్యవహారాన్ని "రికార్డు" చేసిన సందర్భాలు తక్కువ. మాండలికాల సేకరణపేరుతో ఇటువంటి ప్రయత్నం కొంత జరిగినా ఇంకా జరగవలసింది చాలా ఉంది.

క్షేత్రస్థాయిలో వాడుకలో ఉన్న పదజాలం బోధనకు పనికిరాదన్నభావం మారాలి. జనరంజక (popular) భాషలోనే అన్ని బోధనాంశాలను బోధించే స్థాయినుంచి విద్యారంగం తనదైన, స్వీయభావావిష్కరణకు అనుగుణంగా ఉండే పదజాలాన్ని/భాషను వృద్ధి చేసికొనే కార్యక్రమాన్ని తక్షణం ప్రారంభించాలి.

పాలనలో సౌలభ్యంకోసం వివిధ శాఖలుగా ప్రభుత్వ యంత్రాగాలను విభజించుకొన్నట్టే, వీటన్నిటినీ పట్టి నడిపిస్తున్న భాషావనరుల వృద్ధికి సమీకృత భాషావ్యవస్థలను ఏర్పాటుచేసికోవాలసిన అవసరం ఉంది. కేవలం, దైనందిన వ్యవహారాలను నడపడానికి మాత్రమేకాక, భవిష్యదార్థిక వ్యవస్థలను నియంత్రించే దిశలోనూ, దేశ భద్రతా విషయంలోనూ భాషలను కీలకాంశాలుగా పరిగణించే తెలివిడి మన సమాజాలలో పాదుకోవలసి ఉంది.

## 6. Bibliography:


6.1 Altis, James E., ed. 1980. *Georgetown University Round Table on Languages and Linguistics: Current Issues in Bilingual Education.* Washington: Georgetown University Press.

6.2 Bastardas-Boada, Albert. 2002. *World Language Policy in the era of Globalization: Diversity and Intercommunication from the Perspective of Complexity.* Noves SL, Revista de Sociolinguistics: Barcelona.

6.3 Bhagwati, Jagdish. 2004. *In Defense of Globalization.* Oxford. New York: Oxford University Press.

6.4 Fernando, Salvetti (ed). 2010. *Glocal Working. Living and Working across the Wrold with Cultural Intelligence.* Milan: Franco Angeli.

6.5 Gulette, Margaret M. 1982. *The Art and Craft of Teaching.* Cambridge, MA: Harvard University Press.

6.6 Oller, John W., Jr. 1983. *Methods That Work.* New York: Newbury House.

6.7 Sheila L. Corucher. 2004. *Globalization and Belonging: The Politics of Identity in a Changing World.* Rowman & Litlefield.


(తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక, భాషాశాస్త్ర-విదేశీ భాషల శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించిన పత్రం. 16-17 ఫిబ్రవరి, 2012. తిరుపతి. ఆంధ్రప్రదేశ్.)

≻≻≻≻≺≺≺≺

# ౬. భాషా బోధనలో సంగణక అనువర్తనలు

ప్రస్తుత ప్రపంచంలో సంగణక అనువర్తనలను ఉపయోగించని రంగం లేదు. విద్యావ్యవస్థలో సంగణక అనువర్తనలు చాలాకాలం క్రితమే ఆరంభమైనా వివిధ స్థాయిల అవసరాలను తీర్చడంలో ఇంకా కొంత వెనుకబాటు కనిపిస్తుంది. ఉన్నత విద్యలో సంగణక అనువర్తనలు విస్తృతంగా ఉపయోగపడుతున్నాయి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత తరగతులవారికి అనుగుణమైన సంగణక అనువర్తనలను రూపొందిచడంలో మనం కొంత వెనుకబడే ఉన్నాం.

వివిధ స్థాయిలకు భాషా బోధనలోను, వివిధ విషయాల (సబ్జెక్ట్స్) బోధనలోను సంగణక అనువర్తనలను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ పత్రంలో చర్చించడం జరుగుతుంది. సంగణక ఆధారిత బోధన అభ్యసన కార్యకలాపాలు ప్రభావవంతమైన ఫలితాలు ఇస్తాయి. అన్నిటినీమించి సంగణక అనువర్తనలు సమాహార బోధన వనరుగా ఉపయోగపడుతూ కొత్త తరానికి అనుగుణమైన విద్యాబోధనను అందిచడంలో సహకరిస్తాయి.

ఇప్పటికే రూపొందించిన సంగణక అనువర్తనలను వాడడంలో మన పాఠశాలలు ఎక్కడ ఉన్నాయన్నదానిని క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా గుర్తించడం జరిగింది. క్షేత్రస్థాయి పర్యటనలో లభించిన సమాచారానికి సంబంధించిన రేఖామాత్రమైన వివరాలు ఈ పత్రంలో ఉన్నాయి. సంగణక అనువర్తనల ద్వారా బోధించేటప్పుడు ఎదురయ్యే సమస్యలను గుర్తిస్తూనే కొన్ని పరిష్కార మార్గాలను కూడా ఈ పత్రంలో ఇవ్వడం జరిగింది.

## 1.విద్యా ప్రాముఖ్యత సాంకేతికపరమైన మార్పులు

జీవితాన్ని సమగ్ర దృష్టితో చూడగల పరిపూర్ణ మానవుడిని సృష్టించడమే విద్య యొక్క మహోన్నతమైన కర్తవ్యం. అయితే; ఆధునిక విద్యావిధానం పిల్లలు తమంతటతామే ఒక వ్యక్తిత్వం సంతరించుకునేలా ప్రోత్సహించాలని, ఎంతో సృజనాత్మకమైనవారిగా తయారు చేయాలని తలపోస్తోంది. మారుతున్న కాలాన్ని అనుసరించి విద్యాబోధనలో సంగణకాలు కీలక పాత్ర వహిస్తున్నాయి. దేశ ప్రగతికి మూలస్థంభంగా నిలిచేది శాస్త్ర సాంకేతిక రంగం. దీని ఎదుగుదలను నిర్దేశించేది ఆ దేశ విద్యావిధానం. శాస్త్ర సాంకేతిక రంగం పటిష్టంగా ఉండేందుకు అవసరమైన పునాదిని విద్యారంగం ద్వారా సాధించాలి.

ఆధునిక విజ్ఞానం సాధించిన అద్భుతమైన సృష్టి సంగణకం. ఇది మిగతా యంత్రాలవలెకాక మన ఆలోచనల ననుసరిస్తూ, సంక్లిష్ట సమాచార నిధులతో సంపర్కాన్ని కలిగిఉంటూ పనిచేస్తుంది. అధిక

వేగం, ఖచ్చితత్వం, అధిక సామర్థ్యం మొదలైన లక్షణాలను కలిగి అన్ని రంగాలలోనూ ఉపయోగపడుతుంది. వాటి సమగ్రాభివృద్ధికి దోహదపడుతోంది. అలాగే సంగణకం మన విద్యారంగంలో కూడా ప్రవేశించి అనేక రకాలుగా ఉపయోగపడుతోంది.

సాంకేతిక రంగంలో సంగణకం విప్లవాత్మకమైన మార్పులు తీసుకవచ్చింది. విద్యాస్థాయి, విషయం, బోధనాపద్ధతి, అభ్యసనస్థాయి మొదలైన అంశాలవారీగా విద్యావసరాలను తీర్చగల యంత్రంగా సంగణకం అందుబాటులోకి వచ్చింది.

భారతదేశంలో విద్యాబోధన గురుకుల పద్ధతిలో ప్రారంభమైంది. ఆధునిక విద్యావిధానంలో వచ్చిన అనేక మార్పులకు శాస్త్రాల వికసనం కూడా ఒక కారణం. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మార్పు తీసుకురావాలనే ధ్యేయంతో ప్రభుత్వ పాఠశాలల్లో సంగణకం ద్వారా బోధించడం జరుగుతోంది. ప్రస్తుతం విద్యావిధానంలో సంగణకం ద్వారా భాషాబోధన ఏ విధంగా జరుగుతుందో క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా వివరిస్తాం.

## 2. పాఠశాల విద్యాబోధనలో సంగణకాల వాడకం

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విజ్ఞానాన్నీ, ఉపకరణాలనూ సమంగా అభివృద్ధి చేసుకోకపోతే వెనుకబడిపోవడం ఖాయం. కాబట్టి; ఆధునిక ఉపకరణాల వినియోగ సామర్థ్యాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోలేకపోయినపుడు, ఇంత అభివృద్ధి చెందిన శాస్త్ర విజ్ఞానం నిరర్థకం.

ప్రస్తుతం ప్రభుత్వం పాఠశాలల్లో కొన్నింటిలో మాత్రమే సంగణకాన్ని ఉపయోగించి బోధించే పద్ధతిని అవలంబిస్తున్నారు. ఇలా బోధించే పాఠశాలల సంఖ్య చాలా తక్కువ. అభివృద్ధి చెందిన ప్రాంతాలలోనే సంగణకం ఉపయోగించి భాషను బోధించడం చాలా తక్కువ. అటువంటపుడు మారుమూల ప్రదేశాలలో దీనిని ఆశించలేం.

సంగణకాన్ని ఉపయోగించి విద్యాబోధన జరిపే పాఠశాలల్లో, ముందుగా సాధారణ తరగతి బోధనానంతరం సంగణకం ద్వారా బోధన జరుగుతుంది. ఇది తరగతిగది బోధనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రాథమిక స్థాయిలో ఈ సంగణకం ద్వారా భాషాబోధనను గమనిస్తే ఉదాహరణకు; వర్ణమాలను బోధించే సమయంలో ముందుగా కొన్ని రోజులు తరగతిలో వర్ణమాలను నేర్పిస్తారు. ఆ తరువాత సంగణకంలో సి.డి. ల రూపంలో పొందుపర్చిన వర్ణమాలను క్రీడా పద్ధతిలో బోధిస్తారు. ఈ 'వర్ణమాల' బోధనను మరింత బలపరచడానికి అక్షరాలను పాటల రూపంలో కదిలే చిత్రాల ద్వారా రూపొందించి పిల్లలకు చూపిస్తున్నారు.

ఉదాహరణకు: వర్ణమాల నేర్పే సందర్భంలో–

అ – అమ్మ మాట తియ్యన

ఆ – ఆవుపాలు తెల్లన

ఇ – ఇటుక గోడ మందము

ఈ – ఈల పాట విందము

ఇలా అనిపిస్తూ, సంబంధ చిత్రాలను చూపించడం ద్వారా పిల్లల్లో ఆయా వస్తువులకు, విషయాలకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని కల్పించడం జరుగుతోంది.

పిల్లలు నిత్యం చూసే జంతువులు, పక్షులను కదిలేచిత్రాల రూపంలో ఆడిస్తూ భాషాంశాలను బోధించడం జరుగుతోంది.

ఉదాహరణకు:

చిలుక–ఎగురుతుంది

పండు — పడుతుంది

చిలుక ఏం చేస్తుంది? అని ప్రశ్నిస్తూ, సంగణకంలో 'పడుతుంది' అన్న పదంపై నొక్కితే 'అది తప్పు'అనే సూచనను ఇస్తుంది. మనం సరియైన సమాధానం సూచించేవరకు 'అది తప్పు' అంటూ మళ్ళీ ప్రయత్నించమని చెప్తుంది. చివరకు 'చిలుక ఎగురుతుంది' అనే సమాధానం సాధించేవరకూ ఈ కృత్యాధార బోధన, అభ్యాసం కొనసాగుతాయి. ఈ విధమైన కార్యక్రమాల ద్వారా ప్రభావవంతంగా బోధన జరుగుతోంది.

మన సంస్కృతి, సంప్రదాయాలను బోధించడానికి, అనేక విషయాలను తెలపడానికి సి.డి. లను రూపొందించి వారికి అవగాహనను కల్పిస్తున్నారు. 'జానపద సంపద' అనే అంశంలో పల్లె వాతావరణాన్ని చూపించడం జరిగింది.

ఉపాధ్యాయుడు ఎంత పండితుడైనా, ఎన్ని ప్రణాళికలు రచించినా, ఎన్ని పద్ధతులు పాటించినా ఒక్కోసారి కొన్ని కఠిన భావనలను విద్యార్థులకు చెప్పడం కష్టమయ్యే సందర్భాలు కనిపిస్తున్నాయి.

ఉదాహరణకు:

సముద్రం చూడనివారికి సముద్రాన్ని గురించి ఎంత వివరిస్తే 'సముద్రం' అనే భావనను సమగ్రంగా గ్రహించగలుగుతారు? ఈ అంశాలలో మన విద్యార్థులకు అందించే విషయజ్ఞానం, భాషాజ్ఞానం, భావన, సూత్రాలు, లక్షణాలు మొదలైనవాటిని చక్కగా అవగాహనకు తేవడానికి ఉపాధ్యాయుడికి ఈ సి. డి. లు ఉపయోగపడుతాయి.

ఈ సి. డి. లలో పిల్లలు తమకు కావలసిన అంశాన్ని ఎంచుకునే వీలుంది. ఆ అంశం అవగాహన అయ్యేంతవరకు సమయాన్ని కేటాయించవచ్చు. స్వయం అభ్యాసనకు అవకాశం ఇచ్చేలా ఈ సి. డి. లు రూపొందించబడ్డాయి. తరగతిలో ఒకసారి బోధించిన విషయాన్ని విద్యార్థి మరలా అధ్యయనం చేసుకునే వెసులుబాటు ఉంది.

కొన్ని పాఠశాలలకు ఈ సి. డి. లను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. కొన్ని సి.డిలను "అజీం ప్రేంజీ ఫౌండేషన్" వంటి స్వచ్ఛంద సంస్థలు రూపొందిస్తున్నాయి. మరికొన్నిచోట్ల ఆ పాఠశాలలను దత్తత తీసుకున్న ప్రైవేట్ సంస్థలే కావలసిన వనరులను సమకూరుస్తున్నారు. ఇలా రూపొందించబడిన సి. డి. లలో కొన్ని పిల్లల ప్రమేయంతో అభ్యసన కార్యకలాపం సాగేవిధంగా ఉండగా, మరికొన్ని పిల్లల ప్రమేయం ఏమాత్రం లేకుండా కేవలం చూడటానికి మాత్రమే పరిమితమయ్యేలా రూపొందించబడి ఉన్నాయి.

## 3. సంగణకం ద్వారా బోధన – ఉపయోగాలు

ఆధునిక యుగంలో సంగణకం వచ్చిన తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి గుణాత్మకమైన మార్పు తీసుకుంది. దీనివల్లనే బోధనలోకూడా సంగణకం వినియోగంలోకి వచ్చింది. మనిషి మనసులోని ఆలోచనలతో పురుడుపోసుకున్న సంగణకం, మనిషి చేయలేని పనులను అతితక్కువ కాలంలో సునాయాసంగా చేయగలుగుతోంది. సంగణకం ప్రమేయం విద్యారంగంలో కూడా ప్రవేశించి విద్యావిలువలను, అత్యున్నత స్థాయి ప్రమాణాలను సాధించడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది.

నేడు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో 'డిజిటల్ పాఠాలు' తయారు చేయబడి భాషాబోధనను సులభతరం చేసాయి. అప్పటివరకు ఉపాధ్యాయుల మౌఖికంగా జరిగిన బోధన నేడు సంగణకంద్వారా నేర్చుకునే వెసులుబాటు ఉంది. ఉపాధ్యాయుడికంటే సంగణకం ద్వారా జరిగే భాషాబోధనలో నూటికి నూరు శాతం మెరుగైన ఫలితాలను విద్యార్థులు పొందుతారు.

బోధనను కొత్త సాంకేతికతకు అనుగుణంగా మలచడం, ఒక ప్రణాళిక ద్వారా అమలు చేయడం, అభివృద్ధి చేయడం నేటి భాషా పరిస్థితుల దృష్ట్యా అత్యవసరం. భాషాబోధనలో సంగణకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా మునుపు లేని వేగాన్నీ, నిర్దిష్టతనూ నేడు సాధించగలుగుతున్నాం.

విద్యార్థులకు సంగణకం ద్వారా బోధించడంవల్ల అనేక లాభాలు కలుగుతాయి. సాంకేతిక విజ్ఞానం పెరగడంవల్ల పాఠ్యాంశాలలో ఉన్న పరిమిత విషయాలనేకాక సమగ్రమైన పరిజ్ఞానాన్ని పొందగలరు. సంగణకం ద్వారా బోధనాకార్యక్రమానికీ, విద్యార్థికీ మధ్య పరస్పర అర్థవంతమైన చర్య, ప్రతిచర్యలు ఏర్పడడానికి వీలవుతుంది. కొత్తదనంవల్ల విద్యార్థులలో ప్రేరణ కలుగుతుంది. వాస్తవమైన

అనుభూతి చెందుతారు. కాబట్టి పిల్లలకు సంగణకంలో చూపించి బోధించడం ద్వారా సరైన పద్ధతిలో అర్థం చేసుకోవడానికి, గుర్తుంచుకోవడానికి వీలవుతుంది.

విద్యార్థుల స్థాయి, మానసిక పరిణతినిబట్టి భాషోపాధ్యాయుడు భాషానైపుణ్యాలు పెంపొందించాల్సి ఉంటుంది. చిన్న పిల్లలకు ఆటలు, పాటలు అంటే ఇష్టం. కాబట్టి అందుకు అనుగుణంగా కథలు చెప్పడం, శిశుగేయాలు, అభినయ గేయాలవంటివి వినిపించడంలాంటి కార్యక్రమాల ద్వారా వారిలో శ్రవణ నైపుణ్యం పెంపొందించవచ్చు. వీటిని సంగణకం ద్వారా నిర్వహించవచ్చు. మాటతోపాటు చిత్రాన్ని జోడించడంవలన విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించవచ్చు.

పిల్లలకు శ్రవణ నైపుణ్యం అలవడిన తర్వాత పాఠశాలకు రావడం జరుగుతుంది. శ్రవణం ద్వారా భాషణం అలవడుతుంది. అనుకరణ ద్వారా భాషను నేర్చుకుంటారు. అంటే ఆ పిల్లలు ఇంట్లో పెద్దల ఉచ్చారణను విని, భాషించడం జరుగుతుంది. కాబట్టి పాఠశాలకు వచ్చే విద్యార్థుల భాషణంలో తేడా కనిపిస్తుంది. ఈ తేడాలను ఉపాధ్యాయుడు గమనించి సరిచేయాల్సిన అవసరం ఉంటుంది. భాషోపాధ్యాయుడు సరైన భాషను ఉపయోగిస్తూ ఉంటే విద్యార్థులు దానిని వింటూ తమ శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ మంచి భాషను నేర్చుకుంటారు. ఉపాధ్యాయుడి ఉచ్చారణ కొన్ని సందర్భాలలో వ్యత్యాసాలు రావచ్చు. కాని సంగణకంలో నిక్షిప్తం చేసిన ఉచ్చారణ ఎప్పుడూ ఒకే విధంగా ఉంటుంది.

పిల్లల్లో నైతిక భావాలను పెంపొదించడానికి వేమన, సుమతి శతకాలవంటి నీతిపద్యాలనూ, కరుణ, భక్తి రసాలతో కూడిన పద్యాలనూ, దేశభక్తి గేయాలనూ, పాటలను పాడి విద్యార్థులకు వినిపించాలి. ఉపాధ్యాయుడు పాడలేని సందర్భంలో ఆ లోటును సంగణక సహాయంతో తీర్చవచ్చు. పిల్లల్లో విద్యాబోధన సంగణకం ద్వారా చేయడంవలన వారు విద్యపట్ల ఎక్కువ ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది. ఎందుకంటే చిన్నపిల్లలు అప్పుడే ఆటపాటల వయసునుండి పాఠశాలకు వస్తుంటారు. కాబట్టి వారిని ఆకట్టుకొనే విధంగా బొమ్మలు, ఆట పాటల రూపంలో విషయాలను బోధించడంవల్ల పాఠశాలకు రావడానికి శ్రద్ధ చూపుతారు.

సంగణకం ఉపయోగించి బోధించడం ద్వారా నేడు ప్రపంచంలోని విషయాలను కూడా తరగతిగదిలో చూపవచ్చు. ఆయావిషయాలలో, సంఘటనలలో నేరుగా విద్యార్థులను భాగస్వాములను చేయవచ్చు. నేరుగా కలిగే అనుభవంద్వారా, అనుభూతులద్వారా అభ్యసన కార్యకలాపాలలో వేగం హెచ్చుతుంది. నాణ్యత పెరుగుతుంది. నేర్చిన అంశాలు దీర్ఘకాలం స్మృతిలో ఉండి, విద్యార్థికి ఉన్నత తరగతుల అభ్యసనంలో ఎంతో సహకరిస్తాయి. విద్యార్థులకు సమగ్ర మూర్తిమత్వం అలవడుతుంది.

## 4. సమస్యలు

భాషబోధనలో సంగణకాన్ని ఉపయోగించడంవలన చాలా లాభాలున్నా, వాటిని ఉపయోగించుకోవడంలో మనం వెనుకబడే ఉన్నాం. మచ్చుకు కొన్ని:

4.1 నేడు చాలా పాఠశాలల్లో సంగణకాలు ఉన్నా వాటిని ఉపయోగించగలిగిన బోధకులు లేక వాడే పరిస్థితిలేకపోవడం.

4.2 అన్ని పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్యకు సరిపడా సంగణకాలు అందుబాటులో లేకపోవడం.

4.3 సంగణక ఆధారంగా పాఠ్యాంశాలను సి. డి. ల రూపంలో సరియైన నిపుణులచే తయారు చేసి, అన్ని పాఠశాలలకు అందించకపోవడం.

4.4 సంగణకాల నిర్వహణకయ్యే ఖర్చులకు ఆర్థిక వనరులను సమకూర్చకపోవడం.

4.5 సంగణకం ద్వారా బోధనలో ఏయే తరగతులలో ఏయే పాఠ్యప్రణాళికలు ఉండాలి? ఎలాంటి సాఫ్ట్ వేర్లు, ఉపకరణాలు కావాలి? మాతృభాషలో నేర్చుకునే సౌకర్యం ఎలా ఉండాలి? ఎలాంటి పుస్తకాలు కావాలి? ... వంటి అంశాలలో స్పష్టత లేకపోవడం. ఇటువంటి పరిస్థితులే ఉపాధ్యాయులకు ఇబ్బందుల ను పెంచుతున్నాయి. అలాగే పాఠశాలల్లో మౌలిక వనరుల కొరత ఉంది. ప్రాజెక్టులలోని పాఠ్యాంశాలను సంగణకం ద్వారా ఏ విధంగా సమన్వయపరుచుకోవాలో ప్రణాళికలు లేవు.

## 5. రాదగిన మార్పులు – సూచనలు

సంగణకం అనేది ఆయా విభాగాలలో విజ్ఞానాన్ని సంపాదించడానికీ, నలుగురికి పంచడానికి ఒక శక్తివంతమైన మాధ్యమం.

5.1 సమాచార రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను గురించి ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు అవగాహన కలిగే విధంగా సంగణక శిక్షణ ఇవ్వాలి.

5.2 ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో సంగణకం ద్వారా బోధనన ప్రవేశపెట్టాలి.

5.3 ప్రభుత్వ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. పాఠ్యప్రణాళికలో సంగణక అనువర్తనలను కూడా ఒక పాఠ్యాంశంగా చేర్చాలి.

5.4 సంగణకాల నిర్వహణకయ్యే ఖర్చులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం చెల్లించాలి.

5.5 సంగణక ఆధారిత బోధనను నిర్వహించుటకు ప్రతి పాఠశాలలో ప్రత్యేక గదులను కేటాయించాలి.

5.6 స్వయం అభ్యసనమునకు అవకాశం కలిపించేలా పాఠ్యాంశాల సి. డి. లను రూపొందించాలి.

విద్యార్థులకు ముందుగా విద్యాభ్యాసానికి కావాల్సిన సదుపాయాలను సమకూర్చిన తరువాతనే వీటిని ప్రవేశపెడితే బాగుంటుంది. కానీ తోచిందే అమలు చేయాలన్న తొందరపాటు ప్రయత్నాలు సానుకూల ఫలితాలు ఇవ్వవు. కాబట్టి ఆయా వ్యవస్థలు లోతుగా ఆలోచించి, చర్చించి తగిన చర్యలు చేపట్టాలి.

## 6. వివిధ స్థాయిలలో బోధనకు సంగణక అనువర్తనలను రూపొందించడం

ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయిలకు అనుగుణమైన సంగణక అనువర్తనలను శాస్త్రీయమైన పద్ధతులను రూపొందించుకోవాలి. నల్లబల్ల, ఛార్టులు, ఫ్లాష్ కార్డులు, మట్టి, మైనపు బొమ్మలు మొదలైనవాటిని ఏయే స్థాయిలకు అనుగుణమైన భాషాబోధన వనరుగా ఉపయోగిస్తున్నామో మొదటగా గుర్తించాలి. వీటి మూలాలను సంగణక అనువర్తనల్లో భాగం చేయడంవలన ఏకకాలంలో అనేక ఫలితాలను సాధించవచ్చు. తద్వారా సంగణకాన్ని ఒక సమాహార బోధనోపకరణంగా మార్చవచ్చు. బోధనోపకరణాల తయారీ, వినియోగం మొదలగువాటిలో ఎదురయ్యే క్షేత్రస్థాయి పరిమితులను అధిగమించవచ్చు.

సమాహార బోధనోపకరణంగా ఉన్న సంగణక అనువర్తనలను వివిధ ప్రాంతాలకు ఏకకాలంలో పంపగలిగే వీలుంది. ఇందువల్ల ఎక్కడికక్కడ బోధనోపకరణాల తయారీ అన్న సమస్య తొలగిపోతుంది. సంగణక అనువర్తనల్లోని బోధనోపకరణాల స్థాయికి అనుగుణమైన భాష, క్షేత్రస్థాయి భాషలద్వారా వివరించడం వలన బోధన, అభ్యసన కార్యకలాపాలు ఉత్సాహాభరితమూ, ప్రభావశీలమూ అవుతాయి.

బోధనోపకరణాలను వివిధ స్థాయిలకు అనుగుణంగా ముందే సిద్ధంచేసి పంపడం ఒక వెసులుబాటు. దీనిని వినియోగంలోకి తెచ్చుకోవడంలో ఎదురయ్యే పరిమితులను అంతర్జాలం ఆధారంగా అధిగమించవచ్చు. 1980 వ దశకంలో ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి వచ్చిన విశ్వవ్యాప్తజాలంలో ఉన్న బహుముఖీనమైన సమాచారాన్ని బోధనలో వినియోగించుకోవచ్చు. స్థాయికి అనుగుణమైన సమాచారాన్ని అంతర్జాలంలోంచి ఎంపిక చేసుకొని వాటి వివరణలను, ప్రయోజనాలను మన భాషలో విద్యార్థులకు అందించవచ్చు. స్థల, కాల అవధులను అధిగమించే లక్షణమున్న ఈ విధమైన సమాచారాన్ని వినియోగించుకుంటూనే మనమూ అటువంటి సమాచారాన్ని సృష్టించి అంతర్జాలంలో నిక్షిప్తం చేయవచ్చు.

అంతర్జాలంలో సమాచారానికి ఉన్న అదనపు బలాన్ని మనం జాగ్రత్తగా గుర్తించాలి. అంతర్జాలంలోని సమాచారమంతా "అధిపాఠ సంకేత భాష (హెచ్.టి.ఎం.ఎల్)"లో నిరంతరం నవీకరణకు అనుగుణమైన పద్ధతిలో కలపబడి ఉంటుంది. దీనిద్వారా వినియోగదారులు తమ కిష్టమొచ్చిన సమాచారాన్ని క్షణాల్లో పొందగలిగే అవకాశం ఉంటుంది.

తెలుగు వ్యవహార ప్రాంతాలలోని అన్ని ప్రాంతాలకు ఏకకాలంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం అత్యంత కష్టసాధ్యమైన పని. ఈ సమస్యలను అధిగమించడానికి ఒక ప్రభావవంతమైన ఆకరంగా సంగణక అనువర్తనను వినియోగించుకొని నిరంతరం నవీకరణలకు అవకాశం ఉండే పాఠ్య

ప్రణాళికను మనం తయారు చేసుకోవాల్సి ఉంది. ఇందుకు సహకరించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందన్న విషయాన్ని విస్మరించకూడదు.

## 7. ఉపయుక్త గ్రంథాలు


7.1. ఉపేందర్ రెడ్డి, ఎన్(సం.). 2002. ప్రాథమిక విద్య. హైదరాబాద్: తెలుగు అకాడమి.

7.2. వార్నర్, ఎస్. ఎ. 2003 . టీచర్. హైదరాబాద్: ప్రజాశక్తి బుక్ హౌజ్.

7.3 సరోజన, బి(సం.). 2002 తెలుగు బోధనాపద్ధతులు. హైదరాబాద్: తెలుగు అకాడమి.

7.4. సాంబమూర్తి, డి. 1999. తెలుగు బోధనాపద్ధతులు. హైదరాబాద్: నీల్ కమల్ పబ్లికేషన్స్.


## 7.2. పరిశోధన పత్రం


పవన్ కుమార్, పమ్మి. 2011 " తెలుగు భాషాభివృద్ధి: సంగణక ఆధారిత పాఠ్య ప్రణాళిక ఆవశ్యకత " (వ్యాసం) " తెలుగు పున్నమి ". విజయవాడ: కృష్ణాజిల్లా రచయితల సంఘం (పుటలు 603-606)


**7.3. ఈ పత్రంలో ఉపయోగించిన క్షేత్రస్థాయి సమాచారం కింద సూచించిన పాఠశాలలనుండి సేకరించబడింది. ఈ పాఠశాలలన్ని రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్నాయి.**

7.3.1. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు) గ్రా: గౌలిదొడ్డి, మం: శేరిలింగంపల్లి, రంగారెడ్డి జిల్లా.

7.3.2. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. గ్రా: గచ్చిబౌలి, మం: శేరిలింగంపల్లి, రంగారెడ్డి జిల్లా.

7.3.3. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. మం: మల్కాజ్ గిరి: రంగారెడ్డి జిల్లా.

7.3.4.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. మం: శేరిలింగంపల్లి: రంగారెడ్డి జిల్లా.

7.3.5. మండల ప్రాథమిక పాఠశాల. గ్రా: గౌలిదొడ్డి, మం: శేరిలింగంపల్లి, రంగారెడ్డి జిల్లా

*(ప్రపంచీకరణ యుగంలో నవీన భాషా బోధన పద్ధతులు: వ్యూహాలు అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సులో 1. కుర్మకోరె రవి, 2. తాడూరి స్రవంతి, 3. బట్రాజు ఉషారాణి, 4. నాయిని ఉమామహేశ్వరి [ఐ.ఎం.ఏ., ఎం.ఏ. తెలుగు విద్యార్థులు]లతో కలిసి సమర్పించిన పత్రం. తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, దక్షిణ ప్రాంతీయ భాషా కేంద్రం, మైసూరుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సు. 06-07 మార్చి, 2012. హైదరాబాదు. తెలంగాణ.)*

>>>><<<<

# 7. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో భాషా బోధన: క్షేత్ర స్థాయి పరిశీలన

రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం పరిధిలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలు, మాధ్యమిక పాఠశాలల నుంచి సేకరించిన క్షేత్ర స్థాయి సమాచారం ఈ పత్రానికి ఆధారం. పదమూడు పాఠశాలల నుంచి సేకరించిన క్షేత్ర స్థాయి సమాచారంలో తెలుగు భాషాభోధనకు సంబంధించిన అంశాలను విశ్లేషణాత్మకంగా వివిధ విభాగాలలో ఈ పత్రంలో వివరించడం జరిగింది.

ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి నివసిస్తున్న కుటుంబాలలోని పిల్లలు ఈ పాఠశాలల్లో వివిధ తరగతులు చదువుతున్నారు. తమిళం, కన్నడం, మరాఠీ, బీహారి, రాజస్థానీ, పంజాబీ, ఉర్దూ, హిందీ, గుజరాతీ భాషలు ప్రథమ భాషలుగా కల్గిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. తెలుగులో ఆయా భాషల, శాస్త్రాల బోధన అభ్యాసనాలు ఎలా జరుగుతున్నాయనే అంశం పై ప్రధానంగా దృష్టి నిలిపి, ఆ వివరాలను ఈ పత్రంలో చర్చించడం జరిగింది.

ఈ అధ్యయనంలో ఎంపిక చేసుకొన్న ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఇతర రాష్ట్రాల పిల్లలకు చదువును నేర్పించడానికి తమశక్తియుక్తులను, అనేక రకాలైన పద్ధతులను అనుసరిస్తున్నారు. అవి :

## 1.1. సైగలు, ఉచ్చారణ, హావభావాలు

సమాచార సేకరణకు ఎంపిక చేసికొన్న ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా తెలుగు మాధ్యమంలో బోధన జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన ఇతరరాష్ట్రాల విద్యార్థులకు తెలుగు రాకపోవడం, ఉపాధ్యాయులకు ఆ పిల్లల మాతృభాష తెలియకపోవడం వల్ల సైగలతో బోధనను ప్రారంభిస్తారు. దీనితో విద్యార్థులు ఉపాధ్యాయుల హావభావాలను, పెదాల కదలికను ఆ సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగే ఉపాధ్యాయులు కూడా ఆ పిల్లల హావభావాలను, సైగలను అనుసరించి బోధించడానికి ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థి పాఠశాలలో చేరిన మొదట్లో విద్యాబోధన, సంభాషణ వారిమధ్య ఈ విధంగానే కొనసాగుతోంది. ఉపాధ్యాయులు బోధించిన అంశాలు విద్యార్థులకు ఎంతవరకు అర్థం అవుతున్నాయన్నది ఎప్పటికప్పుడు బేరీజువేసుకొనే పద్ధతి ఈ పాఠశాలల్లో లేదు. మాసాంత... పరీక్షలలో విద్యార్థులు రాసే సమాధానాలలో లేఖన దోషాలు ఎక్కువగా కనబడుతున్నాయి. ఈ విద్యార్థుల ఉచ్చారణ సరిచేయవలసిన అవసరం ఎక్కువగా ఉంది.

## 1.2 రెండు భాషల వర్ణమాలలను ఒకేసారి పరిచయం చేయడం

కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తర భారదేశానికి చెందిన (ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, మధ్యప్రదేశ్) విద్యార్థులు ఉండటంచేత వారికి ఏకకాలంలో రెండు భాషల (హిందీ, తెలుగు) వర్ణమాలలను పరిచయం చేయడం జరుగుతోంది. పై ప్రాంతాల విద్యార్థులకు హిందీ భాష తెలియడంచేత ఉపాధ్యాయులు వారి అభిరుచిని గమనించి బోధన చేస్తున్నారు. అలాగే ఒకే చార్టులో హిందీ-తెలుగు వర్ణమాలలోని అక్షరాలను ఒకదాని కింద ఒకటి రాసి బోధించడం జరుగుతోంది.

| ఉదా:- | अ | आ | इ | ई | उ | ऊ |
|---|---|---|---|---|---|---|
| | అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ |

తెలుగు, హిందీ అక్షరాల ఉచ్చారణలో ఒకేవిధంగా ఉండటంచే విద్యార్థులు తెలుగు భాషను నేర్చుకోవడానికి సులభంగా ఉంటుంది.

## 1.3 పద పద్ధతి

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు భాష బోధనా పరిచయాన్ని 'స్నేహబాలకార్డు'లను ఉపయోగించి విద్యార్థులకు పదాలను పరిచయం చేస్తున్నారు. ఇలా చేయటాన్నే 'పద (పరిచయ) పద్ధతి'గా వ్యవహరిస్తున్నారు. మొట్టమొదట ఈ కార్డులని 'రిషిమిల్లి' అనే స్వచ్ఛంద సంస్థ చిత్తూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. అక్కడ సత్ఫలితాలు రావడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశ పెట్టింది. ఇక్కడి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఈ కార్డులు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అధికంగా ఉపయోగపడటం విశేషం.

ఈ కార్డుల ద్వారా విద్యార్థులకు మొదటగా అభినయ గేయాన్ని నేర్పిస్తారు. ఈ గేయాన్ని పదేపదే పాడుతూ అభినయించడం వల్ల పిల్లలకు తెలుగు భాష తెలియకపోయినా తొందరగా అర్థం చేసుకోగలుగుతున్నారు . ఆ తర్వాత పద పద్ధతిలో పదాలను పరిచయం చేస్తూ మొదటగా 'పలక' అనే పదాన్ని నేర్పిస్తారు. ఎందుకంటే ఆ వస్తువు(పలక) నిత్యం వారి చేతుల్లోనే ఉండడంతో ఆ పదాన్ని గ్రహించి తొందరగా నేర్చుకుంటారనే ఉద్దేశంతో ఆ పదంతోనే బోధనను ప్రారంభించడం జరుగుతోంది. తర్వాత, మిగిలిన పదాలైన 'ఏనుగు, పడవ' మొదలైన వాటిని నేర్పిస్తారు. భాషను అర్థం చేసుకోలేని విద్యార్థులకు అధికంగా వాడుకలో ఉన్న పదాలను మొదట సంభాషణాత్మకంగా నేర్పిస్తారు. దీనితో వారికి

కొంత భాషాపరిజ్ఞానం లభిస్తుంది. తర్వాత వర్ణమాల చార్టుని చూపించి గతంలో నేర్పిన పదాలలోని అక్షరాలని గుర్తించమంటారు. అక్షరాలను గుర్తుపట్టేలా చేయాలనే ఉద్దేశంతోనే మొదట హల్లులను, అటు పిమ్మట అచ్చులను నేర్పిస్తున్నారు. ఇక్కడ వర్ణ క్రమాన్ని నేర్పించడం వారి ముఖ్య ఉద్దేశం కాదు. వీటి తర్వాత స్థాయి 'సంసిద్ద కార్డుల'ను పరిచయం చేయడం. ఇందులో సామాన్య వాక్యాలను నేర్పిస్తున్నారు. ఈ కార్డులను ఉపయోగించి బోధన చేయడం ద్వారా గ్రహణ శక్తి పెరుగుతున్నదని, మంచి ఫలితాలు వస్తున్నాయని, ఇతర రాష్ట్ర విద్యార్థులు తెలుగు విద్యార్థులతో సమానంగా చదువగలుగుతున్నారని, తెలుగు మాధ్యమ విధానానికి అలవాటు పడుతున్నారని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

## 1.4 సంబంధిత భాషా పరిజ్ఞానంగల ఉపాధ్యాయునితో బోధన

ఒకే రాష్ట్రానికిచెందిన విద్యార్థులు అధికంగా ఉన్న కొన్ని పాఠశాలల్లో వారి మాతృభాష తెలిసిన ఉపాధ్యాయునిచే బోధన చేయించడం జరుగుతోంది. ఆ ఉపాధ్యాయుడు తులనాత్మక (ఉదా:- కన్నడ-తెలుగు) చార్టుని తయారుచేసి విద్యార్థులకి బోధించడం ద్వారా అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు వ్యవహార భాషాసమస్యను అధిగమిస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా విద్యార్థులు త్వరగా తెలుగు భాషను నేర్చుకోడంతో పాటు తెలుగు భాషాభ్యసనంలో సత్ఫలితాలను సాధిస్తున్నారు.

## 1.5 విద్యార్థుల మాతృభాషను తెలుసుకొని చెప్పటం

ఇతర రాష్ట్ర విద్యార్థుల బోధన పద్ధతుల్లో మరో సులువైన పద్ధతి విద్యార్థుల మాతృభాషని తెలుసుకొని చెప్పటం ఒకటి. ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు విద్యార్థుల నివాసాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో సంభాషించి నిత్యం వాడే కొన్ని పదాలకు అర్థాలు తెలుసుకొని, కొంత భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటాడు. దీని ద్వారా ఉపాధ్యాయుడు తనదైన శైలిలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేస్తాడు. ఈ విధానంవల్ల విద్యార్థులు కొంతమేరకు భాషాసమస్యను అధిగమించి క్రమం తప్పకుండ పాఠశాలకు హాజరవుతూ, విద్యనభ్యసించడానికి ఆసక్తి చూపుతున్నారు.

## 1.6 బహుభాషా పరిజ్ఞానంగల తోటి విద్యార్థుల పక్కన కూర్చోబెట్టడం

ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులకు తెలుగు రాదు కాబట్టి వారిని ఉపాధ్యాయులు హిందీ, తెలుగు వచ్చిన తోటి విద్యార్థులతో కూర్చోబెట్టడం జరుగుతోంది. దీనితో దాదాపు ఒకే వయసుగల విద్యార్థుల అభిరుచులు, అలవాట్లు, అవసరాలు ఒకే విధంగా ఉంటాయనే ఉద్దేశంతో, వారి మధ్య

సంభాషణ సులువుగా సాగి అర్థంచేసుకునే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు ఇతర రాష్ట్ర విద్యార్థుల విషయంలో ఈ రకమైన విధానాన్ని అవలంభిస్తున్నారు. దీనితో విద్యార్థుల విషయంలో అవగాహన శక్తి సామార్థ్యాలు పెరిగి, విషయ గ్రహణశక్తిని పెంపొందించుకుంటున్నారు.

## 2. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు

ఇతర రాష్ట్ర విద్యార్థులకు విద్యను బోధించడంలో ఉపాధ్యాయులు అనేక రకాలైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. అవి:

### 2.1 భాషాసమస్య

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు తెలుగు రాదు. కాని వారు తెలుగు విద్యార్థులతో పాటు కూర్చొని తెలుగును నేర్చుకొంటున్నారు. ఇలాంటి ప్రాంతేతర విద్యార్థులతో ఉపాధ్యాయులు ఎదుర్కొనే ప్రధాన సమస్య భాషాసమస్య. దీని వల్ల ఉపాధ్యాయునికి, విద్యార్థికి మధ్య అంతరం ఏర్పడుతోంది. ఉత్తరభారతదేశ రాష్ట్రాల విద్యార్థులకు ప్రథమ భాష అయిన హిందీలో (ప్రాంతీయ భేదాలను కలుపుకొన్న) కొంత అభినివేశం ఉండటం వల్ల వారికి బోధన హిందీలో సాగుతుంది. కాని హిందీ వారి మాతృభాష కాదు. కాబట్టి అటువంటివారికి హిందీలో కూడా పూర్తి స్థాయిలో విద్యను అందించలేకపోతున్నామని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతదేశ రాష్ట్రాల (తమిళనాడు, కర్ణాటక, కేరళ) విద్యార్థులకు హిందీలో అభినివేశం తక్కువగా ఉండటంచేత వారికి విద్యనందిచడంలో రెండు భాషలలో అభినివేశం లేని ఉపాధ్యాయులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

### 2.2. విద్యార్థుల వయసులో తారతమ్యాలు

అధిక వయస్సు గల విద్యార్థులు పాఠశాలలో చేరడానికి వస్తే వారి వయసుకు తగిన తరగతిలో కూర్చోబెట్టడం, ఆ తరగతి పాఠ్యాంశాల జ్ఞానాన్ని అందించడానికి ముందు సంసిద్ధపరచగలిగే అంశాలను బోధించడం ప్రస్తుతం అమలులో ఉంది. విద్యార్థి స్థాయిని బట్టి ఎ, బి, సి, డి, కేటగిరీలుగా విభజించి బ్రిడ్జి కోర్సుల రూపంలో విద్యాబోధన జరుగుతోంది. ఈ బ్రిడ్జి కోర్సుల్లో తెలుగు విద్యార్థులకు సమానంగా ఇతర రాష్ట్ర విద్యార్థుల అభ్యసన స్థాయులను పెంచుతున్నారు. అభ్యసనంలో పోటీతత్వంవల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులుకూడా భాషా కౌశలాలను పెంపొందించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. బ్రిడ్జికోర్సు పద్ధతి స్థానిక

విద్యార్థులలోనూ, ఇతర రాష్ట్రాల విద్యార్థులలోనూ ఆహ్లాదకరమైన అభ్యసనాన్ని పెంచుతున్నదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

## 2.3 విద్యార్థుల తల్లిదండ్రుల్లో అవగాహన లోపం

క్షేత్ర పర్యటనకు ఎంచుకొన్న పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులలో ఎక్కువమంది నిరాక్షరాస్యులు కావటంచేత వారు తమ పిల్లలను పాఠశాలలకు పంపించటానికి సంకోచిస్తున్నారు. అంతేకాకుండా చేతి వృత్తులు చేసుకునే కొంతమంది తల్లిదండ్రులు, పిల్లలు తమ చేతి కింద ఉంటే చేదోడువాదోడుగా ఉంటారని బడికి పంపడం మానేస్తున్నారు. నిరాక్ష్యరాసులైన కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతమైన చదువులను చదివించలేమనే న్యూనభావంతో వారివెంట పనుల్లోకి తీసుకెళ్లడం జరుగుతోంది. దీనిని గమనించిన కొన్ని స్థానిక స్వచ్ఛంద సంస్థలు తల్లిదండ్రులను చైతన్య పరిచి వారి పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారు.

## 3. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు

వలసలుగా వచ్చిన కొంతమంది ఇతర రాష్ట్ర కూలీలు తమ పిల్లలను చదివించే ఆర్థిక వనరులు లేక సమస్యలతో సతమతమవుతున్నారు. తమ  పిల్లలనైనా ప్రయోజకుల్ని చేయాలనే సంకల్పంతో, వారిని దగ్గరలోఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపించడం జరుగుతోంది. కాని, వారి పిల్లలు పాఠశాలలో చేరిన తర్వాత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య – భాషాసమస్య.

## 3.1 భాషాసమస్య

విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య భాషాసమస్య. ప్రాంతేతర విద్యార్థులకు వారి మాతృభాష తప్ప తక్కిన ఇతర భాషలతో పరిచయం ఉండదు. కాబట్టి, విద్యాభ్యాసంలో వారు ప్రధానంగా భాషాసమస్యను ఎదుర్కోవలసి వస్తోంది. మన ప్రభుత్వ పాఠశాలలన్నీ తెలుగు మాధ్యమాలు కావటం చేత బోధనభాషకు, విద్యార్థుల మాతృభాషకు మధ్య సంబంధం ఉండదు. దీనితో ఉపాధ్యాయులు బోధించే విషయాలను తెలుగు ప్రాంత విద్యార్థులతో సమానంగా ప్రాంతేతర విద్యార్థులు గ్రహించలేకపోతున్నారు. దీని వల్ల విద్యార్థికి, ఉపాధ్యాయునికి మధ్య భాష విషయంలో అంతరం ఏర్పడుతోంది. అందువల్ల, విద్యార్థులు తమ భావాలను సంపూర్ణంగా వ్యక్తపరచలేకపోతున్నారు. కాబట్టి విద్యార్థుల్లో భాషాసమస్యతోపాటు, భావవ్యక్తీకరణ సమస్య కూడా తలెత్తుతోంది.

## 3.2 స్థిర నివాసం లేకపోవటం

ప్రజలు ఉపాధి కోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళినపుడు వారికి అదే ప్రాంతంలో ఎక్కువ రోజులు ఉపాధి లభించడమనేది జరగదు. దీనితో వలస కూలీలు ఒకే చోట స్థిర నివాసాలను ఏర్పర్చుకోలేరు. కాబట్టి అటువంటి వారి పిల్లలు ఒకే పాఠశాలలో ఎక్కువ రోజులు విద్యనభ్యసించలేకపోతున్నారు. దీనితో ఆ పిల్లలకు సరైన విద్య లభించడంలేదు. ఈ కారణంతో ఉపాధ్యాయులు కూడా వారికి విద్యను నేర్పించడంలో కొంత అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్ర విద్యార్థులు విద్యను నేర్చుకోవడానికి స్థిర నివాసం లేకపోడం గుర్తించదగిన ఒక సమస్య.

## 3.3 పరిసరాల ప్రభావం

విద్యాభ్యాస కాలంలో విద్యార్థులపై పరిసరాల ప్రభావం అధికంగా ఉంటుంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్ళే తొలి రోజుల్లో పాఠశాల వాతావరణానికి, ఇంటి దగ్గర పెరిగిన వాతావరణానికి వ్యత్యాసం ఉంటుంది. దీనితో విద్యార్థులు పాఠశాల వాతావరణానికి తొందరగా అలవాటు పడడంలో సంఘర్షణకు గురవుతున్నారనిపిస్తోంది. కొందరు ఆసక్తిగల ఉపాధ్యాయులు తమ పరిసర ప్రాంతాలలో ఇతర రాష్ట్రాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం కూడా ఈ పాఠశాలల్లో చదువుకొంటున్న ఇతర రాష్ట్ర విద్యార్థులపై కనబడుతోంది.

## 3.4 ఆర్థిక సమస్యలు

వలస కూలీల జీవితం 'రెక్కాడితే గాని డొక్కాడని' పరిస్థితుల్లో ఉంటోంది. పనిచేస్తే గాని పూట గడవని వారు తమ పిల్లల చదువుకు చిన్న మొత్తంలో అయ్యే ఖర్చును సైతం భారంగా భావిస్తున్నారు. వారి పిల్లలకు దుస్తులు , పుస్తకాలు తదితర వస్తువులను కొనివ్వలేని పేదరికం తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఈ ప్రభావం విద్యార్థులపై చెప్పకనే చెప్పినంతగా కనబడుతోంది.

## 4. స్వచ్ఛంద సంస్థల కృషి

రాష్ట్రంలోని కొన్ని స్వచ్ఛంద సంస్థలు విద్యా వ్యవస్థకు సహాయం చేయాలనే ప్రధాన ధ్యేయంతో తమకు అందుబాటులో ఉన్న పాఠశాలలను కొన్నింటిని దత్తతకు తీసుకొని వాటిని అభివృద్ధి పరుస్తున్నాయి. అలాంటి స్వచ్ఛంద సంస్థలు బాలకార్మికులకు, ఇతర రాష్ట్ర విద్యార్థులకు ప్రత్యేకంగా

అనుబంధ పాఠశాలలను స్థాపించి, ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన చేస్తున్నాయి. ఈ సంస్థల కృషికి తోడుగా ప్రభుత్వ పాఠశాలలు 'అనుబంధ పాఠశాలలకు' మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తున్నాయి.

శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాలలో ఉన్న నాంది, మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్ (ఎం.వి.ఎఫ్), ఇన్ఫోటెక్ , అజీం ప్రేంజీ ఫౌండేషన్, కర్తవ్య-(ఎన్.ఎస్.ఎస్) యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు లాంటి సంస్థలు, ఆయా సంస్థలలోని విద్యార్థులు తమ సమీప ప్రాంతాలలోని ఇటువంటి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న జీవన శైలికి అనుకూలంగా పాఠశాలలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ఆధునిక శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి కంప్యూటర్లను, ప్రొజెక్టర్లను, సైన్సు పరికరాలను అందిస్తూ విద్య అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. అంతేగాక విద్యార్థుల్లో చదువుకోవాలనే ఆసక్తిని కల్పించటానికి చేసే ప్రయత్నంలో భాగంగా ఇతర రాష్ట్ర విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, దుస్తులను, బ్యాగులను, పలకలను తదితర వస్తువులను పంపిణి చేస్తున్నాయి. ఈ విధంగా ఆ సంస్థలు పాఠశాలలను నిరంతరం సందర్శిస్తూ పర్యవేక్షిస్తున్నాయి.

## 5. పరిష్కార మార్గాలు

దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చి దిద్దబడుతుందనే నానుడి ఉంది. ఇది నిజం చేయడానికి మన ప్రభుత్వాలు విద్యారంగానికి తగిన ప్రాధాన్యాన్ని ఇస్తున్నాయి. విద్యా రంగానికి మన ప్రభుత్వాలు మరికొంత ప్రోత్సాహాన్ని అందిస్తే మన దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుంది. విద్యారంగం అభివృద్ధి చెందాలన్నా, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్న కనీసం ఈ కింది మౌలిక అంశాలపై దృష్టి నిలపవలసిన అవసరం ఉంది.

5.1 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంచాలి. (కూర్చునేందుకు, ఆటలాడుకొనేందుకు తగిన స్థలం, తాగునీరు, కరెంటు, మరుగుదొడ్లు ... తదితర సౌకర్యాలు)

5.2 విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా తరగతి గదులను నిర్మించాలి. ఆదర్శవంతమైన ఉపాధ్యాయ-విద్యార్థుల నిష్పత్తిని ఖచ్చితంగా అమలుచేయాలి.

5.3 ఇతర రాష్ట్రాల విద్యార్థులున్న ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలకు అనుబంధ పాఠశాలల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి. ఇవి పాఠశాలల సమయంలో కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పనిచేస్తాయి. ఆ

ప్రాంతంలోని విద్యావంతులైన ఔత్సాహిక యువతీ, యువకులచే ఈ సమయాలలో పాఠాలు బోధించబడాలి.

5.4 ఇతర రాష్ట్రాల విద్యార్థులున్న పాఠశాలల్లో బహుభాషా పరిజ్ఞానంగల ఉపాధ్యాయులను నియమించాలి.

5.5 పిల్లలు తమంతట తామే సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవడానికి ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

5.6 విద్యార్థుల దృక్పథానికి అనుగుణమైన బోధనచేయాలి.

5.7 పిల్లల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, వారిలోని సృజనాత్మకతను వెలికితీయాలి.

5.8 ప్రాథమిక తరగతులలోనే నిర్మాణాత్మకమైన సృజన శక్తికి పునాది వేయాలి.

5.9 పిల్లల మనో భావాలను, అభిప్రాయాలను ఉపాధ్యాయులు ఓపిక, సహనంతో తెలుసుకొని బోధించాలి.

5.10 విద్యపట్ల ప్రాంతేతర విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, వారిని చైతన్య పరచాలి.

5.11. విద్యారంగంలోని మౌలిక విషయాలను చర్చించి ఇటువంటి వారి కోసం క్షేత్రస్థాయి స్వచ్ఛంద సంస్థల సహాయంతో పాఠ్య ప్రణాళికలను రూపొందించాలి.

5.12. ప్రాథమిక, మాధ్యమిక పాఠ్య ప్రణాళికల రూపకల్పనలో క్షేత్ర స్థాయిలో వాడుకలో ఉన్న భాషను ఉపయోగించాలి.

## 6. సంప్రదించిన గ్రంథాలు/ఆకరాలు

i వార్నర్, ఎస్. ఎ. 2003. టీచర్. హైదరాబాద్: ప్రజా శక్తి బుక్ హౌస్.

ii సాంబమూర్తి, డి. 1999. తెలుగు బోధన పద్ధతులు. హైదరాబాద్: నీల్ కమల్ పబ్లికేషన్స్.

## 6.1 క్షేత్రస్థాయి సమాచారం (FIELD DATA)

ఈ పత్రంలో ఉపయోగించిన క్షేత్రస్థాయి సమాచారం ఈ కింద సూచించిన పాఠశాలల నుంచి సేకరించబడింది. ఈ పాఠశాలలన్నీ రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం పరిధిలో ఉన్నాయి .

i మండల ప్రాథమికోన్నత పాఠశాల, గౌలి దొడ్డి.

ii మండల ప్రాథమికోన్నత పాఠశాల, గౌలి దొడ్డి(అనుబంధ పాఠశాల, కేశవనగర్ కాలనీ)

iii మండల ప్రాథమికోన్నత పాఠశాల, నానక్ రాంగూడ.

iv మండల ప్రాథమికోన్నత పాఠశాల, మసీద్ బండ.

v మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గచ్చిబౌలి.

vi మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గోపన్ పల్లి.

vii మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పాపిరెడ్డి నగర్ కాలనీ, చందానగర్.

viii మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, శేరిలింగం పల్లి క్యాంపస్.

ix మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, తారానగర్, లింగంపల్లి.

x మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, లింగంపల్లి.

xi మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మియాపూర్.

xii మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, న్యూ కాలని, మియాపూర్.

xiii మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంబేద్కర్ నగర్ కాలనీ, మియాపూర్.

## 6.2. కర్తవ్య (NSS PROGRAME) హైదరాబాద్ విశ్వవిద్యాలయం

గోపన్ పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనివేళలు ముగిసిన తర్వాత యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్ లోని 'కర్తవ్య' ఎన్. ఎస్. ఎస్. వాలంటీర్స్ ఒకటి నుండి ఏడవ తరగతి వరకు గల విద్యార్థులకు అదనపు (అనుబంధ) తరగతులు నిర్వహిస్తున్నారు. ( 2007 నుండి ఈ కార్యక్రమం కొనసాగుతోంది).

(*ప్రపంచీకరణ యుగంలో నవీన భాషా బోధన పద్ధతులు: వ్యూహాలు అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సులో* 1. *జోగు చిరంజీవి*, 2. *మ్యాతరి ఆనంద్* [*ఐ.ఎం.ఏ., ఎం.ఏ. తెలుగు విద్యార్థులు*] *కలిసి సమర్పించిన పత్రం. తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, దక్షిణ ప్రాంతీయ భాషా కేంద్రం, మైసూరుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు*. 06-07 *మార్చి*, 2012. *హైదరాబాదు. తెలంగాణ*.)

## 8. భాషా బోధన - రాతలో వచ్చే చిక్కులు, పరిష్కారాలు.

ప్రాథమిక స్థాయి తెలుగు బోధనలో లిపిని పరిచయం చేయడం ఒక కీలకమైన కార్యకలాపం. అటు ఉపాధ్యాయులను, ఇటు విద్యార్థులను ఇది అమితంగా పరీక్షిస్తుంది. లేఖనాన్ని అభ్యసింపజేయడం, అభ్యసించడం ఒక ప్రధానమైన భాషాకౌశలం అని బోధనాశాస్త్రం నిర్వచిస్తుంది. ఈ కౌశలాన్ని విద్యార్థులకు పరిచయం చేయడంలోనూ, నేర్పడంలోనూ ఉపాధ్యాయులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. విద్యార్థులు లేఖనంలో వెనకబడటంవల్ల అనేకమైన అవరోధాలు ఎదురవుతాయి. తాము నేర్చుకున్న జ్ఞానాన్ని అటు మౌఖికంగానూ, ఇటు లేఖనంలోనూ బాగా వ్యక్తీకరించినప్పుడే ఉన్నత విద్యలను బాగా నేర్చుకోగలుగుతారు.

భాషాబోధనలో ముఖ్యంగా లిపిని పరిచయం చేయడంలోనూ, లేఖనాన్ని నేర్పడంలో మన పాఠశాలల్లో ఇంకా దృష్టి నిలపవలసిన ఆవశ్యకత కనిపిస్తున్నది. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం పరిధిలో ఉన్న మూడు పాఠశాలల్లో జరిపిన క్షేత్రస్థాయి పర్యటన ఆధారంగా ఈ పత్రంలో వివిధ స్థాయుల విద్యార్థులు లేఖనంలో చేస్తున్న దోషాలను గుర్తించడం జరిగింది. ఒకటవ తరగతి నుంచి పన్నెండవ తరగతి వరకు చదువుతున్న ఈ విద్యార్థులు లేఖనంలో చేస్తున్న దోషాలకు కొన్ని పరిష్కార మార్గాలను కూడా ఈ పత్రంలో సూచించడం జరిగింది. ఈ పత్ర రచనకోసం సేకరించిన క్షేత్రస్థాయి సమాచారంలో విద్యార్థులు చేసిన లేఖన దోషాలను వారి నోట్స్ నుంచి సేకరించిన సమాచారంకూడా ఈ పత్ర రచనకు అక్కరకు వచ్చింది.

### 1 లేఖనం

లేఖనం – చతుర్విధ భాషానైపుణ్యాలలో (శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం) చివరిదీ, ముఖ్యమైనదీ, కఠినమైనదీ కూడా. దీనినే మనం రాతగా వ్యవహరిస్తున్నాం. వాచిక చర్యకు అక్షరరూపం లేఖనం. ధ్వనిరూపంలోని భాషాంశం లిపి రూపాన్ని సంతరించుకోవడం అంటే శాశ్వతత్వాన్ని పొందుతున్నదని గ్రహించాలి. వాగ్రూపమైన భాషకు ఒక స్థిరమైన రూపాన్ని కల్పించడానికి, ఆ పాఠానికి/సమాచారానికి స్థల, కాల అవధులను అధిగమింప చేయడానికి మనకు లేఖనం ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఒక్క ముక్కలో – 'కర్ణగోచరాలైన భాషాధ్వనులను అక్షి గోచరాలుగా లిపి రూపంలో రాయడమే లేఖనం' (వెంకటేశ్వరరావు, రామరాజు.[సం.] 2011:237)

లేఖనం/రాతలో నైపుణ్యాన్ని సాధింపజేయడంకోసం ప్రతి విద్యార్థి చేత అభ్యాసం చేయించవలిసిన ప్రధాన బాధ్యత ఉపాధ్యాయులదైతే, ఆ తర్వాతి బాధ్యత తల్లిదండ్రులది. సంప్రదాయ

పద్ధతిలో మొదట అక్షరాలు దిద్దించడం, ప్రతిరోజు కొత్త అక్షరాలు పరిచయంచేసే ముందు విద్యార్థికి ఇంతకు పూర్వం తెలిసినవన్నీ రాయమనడం, ఇలా అక్షరాలూ, గుణింతాలు అన్నీ వచ్చిన తర్వాత రెండక్షరాలు, మూడక్షరాలు గల పదాలు రాయించడం నిత్యకృత్యంగా చేయించడం కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ విధమైన బోధనాపద్ధతిని పాటిస్తున్న దాఖలాలు కనపడడంలేదు. పిల్లలకు లేఖనాన్ని నేర్పడం కంటే ముందు నిర్దుష్టమైన భాషణ, పఠన కౌశలాలు నేర్పడం అత్యంత ఆవశ్యకమనీ, అదే రాతను/లేఖనాన్ని పరిపుష్టం చేస్తుందని భాషాబోధనా నిపుణులు పేర్కొనడం ఇందుకే!

## 2 లేఖనం – లక్షణాలు

నిర్దుష్టమైన, అందమైన రాత భావప్రకటనకు, భావగ్రహణకు అత్యంత దోహదకారి. దీన్ని సాధించడానికి తప్పని సరిగా ఉండాల్సిన లక్షణాలను కొందరు బోధనా విద్యావేత్తలు పేర్కొన్నారు. (వెంకటేశ్వరరావు,రామరాజు.[సం.] 2011:242-245) వీటిని 2.1 – 2.7లమధ్య ఈ పత్రంలో స్పర్శామాత్రంగా వివరించడం జరుగుతోంది.

## 2.1 రీతి

రీతి అనగా రాసే విధానం. అక్షరాల్ని ప్రస్ఫుటంగా రాయడం. అదీకాక ఒక్కొక్క పదాన్నీ వేగంగా రాయడం.

## 2.2 సమత

సమత అనగా అక్షరాల ఆకారం. అక్షరాల పరిమాణం ఒకసారి పెద్దదిగా మరోసారి చిన్నదిగా ఉండకుండా ఏకరూపకతను పాటించడం. అక్షరానికీ, అక్షరానికీ మధ్య ఉండవలసిన వ్యవధానం పాటించడం కూడా సమత కిందికే వస్తుంది. వాక్యంలో ఏకాక్షరాలు, ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు వస్తున్నప్పటికీ సమతను తప్పక పాటించాలి. ప్రారంభం నుంచి చివరి వరకు ఈ సమతను పాటించినట్లయితే ఆ లేఖనం ప్రత్యేకతను సంతరించుకొని, చదవడానికి యోగ్యంగా ఉంటుంది.

## 2.3 స్పష్టత

రాతలో స్పష్టత ప్రధాన గుణం. ఇది లోపించినట్లయితే మిగిలిన ఎన్ని గుణాలున్నా అంటే ఎంత వేగంగా రాసినా, ఎంత అందంగా రాసినా ప్రయోజనం ఉండదు. స్పష్టత సాధించడానికి– అక్షరాలు ఒకదానికొకటి తగలకుండా రాయడం, పదంలోని అక్షరాల మధ్య దూరం సమానంగా ఉండటం, పదానికీ, పదానికీ మధ్య ఉండే దూరం పదంలోని అక్షరాల మధ్య ఉండే దూరం కంటే కొంత ఎక్కువగా

ఉండేట్టు జాగ్రత్త పడడం అన్న అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. దీనివల్ల అన్వయం సులభంగా, అర్థగ్రహణం చురుకుగా జరుగుతుంది.

## 2.4 వేగం

స్పష్టత, వేగం ఈ రెండు సమానంగా సాధిస్తూ వెళ్ళాలి. అక్షరాన్ని ఎంత పొందికగా, గుండ్రంగా రాసినప్పటికీ వేగాన్ని సంతరించుకోకపోతే రాత కష్టమనిపిస్తుంది. ఇది నిరంతరాభ్యాసం వల్ల సాధించవచ్చు. ఉక్తలేఖనాభ్యాసం వల్ల, చూచిరాతల సహకారంతో వేగాన్ని సాధించవచ్చు.

## 2.5 భంగిమ

భంగిమ అంటే మనం కూర్చుండే తీరు, లేఖన సాధనాన్ని పట్టుకునే విధానం. ఇది కూడా ఉత్తమ లేఖనానికి సహకరిస్తుంది. రాత బల్లలు విద్యార్థులకు సరియైన ఎత్తులో ఉంచడం, విద్యార్థి నిటారుగా కూర్చుండి బల్లలపై చేతులుంచి కుడిచేయి, భుజం రాస్తున్న పంక్తికి లంబంగా ఉండేటట్లు చూసుకోవాలి. ఈ విధంగా మొట్టమొదటి నుంచి సాధన చేసినట్లయితే చక్కటి రాత అలవడుతుంది.

## 2.6. వర్ణక్రమ దోషరాహిత్యం

స్పష్టంగా, అందంగా, వేగంగా రాసినప్పటికీ వర్ణక్రమంలో దోషం ఉన్నట్లయితే అది ఉత్తమమైన రాత అనిపించుకోదు. ఈ లక్షణం అందంగా రాసేవారికే ఎక్కువ అవసరం. ఎందుకంటే వారి రాతలో దోషాలు గుర్తించడం అతి సులభం.

## 2.7 విరామ చిహ్నాలను పాటించడం

రాతలో విరామ చిహ్నాల వాడుక ప్రాధాన్యతను సంతరించుకొంది. వాటిని సక్రమంగా వాడినట్లయితే భావ స్ఫురణ సులభంగా కలుగుతుంది. పూర్తివిరామ(ఫుల్ స్టాప్), కించిద్విరామ(కామా) చిహ్నాలను ఏయే సందర్భాలలో వాడాలి? అన్నది ప్రాథమిక తరగతుల నుండి విద్యార్థులకు నేర్పించాలి.

## 3 రాతలో వచ్చే సమస్యలు

విద్యార్థుల రాతలో ప్రధానమైన సమస్య– దోషాలు దొర్లడం. స్పష్టమైన, నిర్దుష్టమైన భాషణం చక్కటి, దోషరహితమైన రాతకు దోహదం చేస్తుంది. భాషణంలోని దోషాలను నిర్లక్ష్యం చేస్తే అవే రాతలో కూడా స్థిరపడతాయి. బాధ్యతగల ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థి సాధారణ ఉచ్చారణ దోషాలను గమనించి, వాటిని సమయస్ఫూర్తితో సవరిస్తే, విద్యార్థి దోషరహితమైన రాతను అలవరచుకుంటాడు.

అలాకాని పక్షంలో విద్యార్థి రాతలో అనేక సమస్యలు చోటుచేసుకుంటాయి. వాటిని ఈ కింది విధంగా గుర్తించవచ్చు.

## 3.1 వర్ణాలు రాయడంలో వచ్చే సమస్యలు

రాతలో కలిగే ప్రధాన సమస్య వర్ణాలను రాయడంలో గమనించవచ్చు. ప్రతి ఒక్కరూ ప్రమత్తత కలిగి ఉన్నప్పటికీ కొన్ని కొన్ని సందర్భాలలో వర్ణాలు రాయడంలో తప్పులు చేస్తూ ఉంటారు. ఈ తప్పులే అనేక రకాలుగా జరిగి సమస్యగా పరిణమిల్లుతుంది. కింద 3.1.1 నుంచి చూపుతున్న ఉదాహరణలు వివిధ స్థాయిల విద్యార్థులు రాతలో చేసే సాధారణ దోషాలను పట్టి చూపుతాయి.

### 3.1.1 అల్పప్రాణ వర్ణాలను మహాప్రాణ వర్ణాలుగా రాయడం

కొందరి రాతలో అల్పప్రాణ వర్ణాలకు బదులుగా మహాప్రాణ వర్ణాలను రాయడం కనిపిస్తోంది. 3.1.1 నుంచి చూపుతున్న ఉదాహరణలలోని మొదటి మాటలు పత్ర రచయితలవి. రెండవ పదం విద్యార్థుల చేతిరాతనుంచి (నోట్సులనుంచి) గ్రహించడం జరిగింది.

ఉదా. సందర్భం – సంధర్భం

బాధ – భాద

బానిసత్వం – భానిసత్వం

### 3.1.2 మహాప్రాణ వర్ణాలను అల్పప్రాణ వర్ణాలుగా రాయడం

ప్రాథమిక దశ నుంచి ఉన్నత దశ వరకు కూడా ఏదో సందర్భంలో ఈ సమస్యను విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం భాషపై సరియైన అవగాహన లేకపోవడమేనని చెప్పుకోవచ్చు.

ఉదా. విద్యాభ్యాసం - విద్యాబ్యాసం

భూభాగం - భూబాగం

భారతం - బారతం

3.1.3. /ఋ/ అనే వర్ణాన్ని /బు/ గా రాయడం కనిపిస్తుంది. దానికి కారణం వేగంగా రాయడంలో ఆ వర్ణాన్ని ఏ విధంగా రాసింది గమనించకపోవడం, సరిచూసుకోకపోడం.

3.1.4. /ఉ/ అనే వర్ణానికి పైన ఒక కొమ్ముకు బదులు రెండు కొమ్ములు పెట్టడం కూడా కొందరి రాతలో కనిపిస్తుంది. /ఊ/ వర్ణానికి ఉన్న రెండు కొమ్ములు /ఉ/ వర్ణానికి కూడా ఉంటాయనే అప్రమత్తత ఇందుకు కారణంగా చెప్పవచ్చు.

3.1.5. /మ/, /య/ వర్ణాలను రాయడంలో భేదం పాటించకపోవడం సాధారణంగా ప్రతి ఒక్కరు చేసే లోపం. దానికి కారణం ఆ వర్ణాల ప్రత్యేకత సరిగా తెలియకపోవడం, రాసేటప్పుడు అశ్రద్ధ చూపడమే.

ఉదా. ప్రియ– ప్రిమ

విషయం – విషమం

రామ – రాయ

3.1.6. /ఘ/, /షు/ అనే వర్ణాలను రాయడంలో సందిగ్ధత.

ఉదా. ఘట్టాలు – షుట్టాలు

ఇంగ్లీషు – ఇంగ్లీఘ

ఆగష్టు ( ఆగస్టు ) – ఆగఘ్టు

3.1.7. /ళ/, /శ/ అనే వర్ణాలను అభేదంగా రాయడం.

ఉదా. శచీదేవి – ళచీదేవి

భారతదేశం – భారతదేళం

3.1.8. /భ/, /ఛ/ వర్ణాలమధ్య భేదం పాటించకపోవడం.

ఉదా. ప్రభుత్వం – ప్రఛుత్వం

త్రిభుజం – త్రిఛుజం

సత్యభామ – సత్యఛామ

అలాగే /చ/, /బ/ వర్ణాల మధ్య కూడా తేడా లేకపోవడం గమనించవచ్చు.

ఉదా. చిగుళ్ళు – బిగుళ్ళు

బారిష్టరు — చారిష్టరు

3.1.9. /ఒ/ అనే వర్ణాన్ని /బ/గా రాయడం అనేక సందర్భాలలో కనిపిస్తుంది.

ఉదా. ఒక – బక

ఒంగోలు – బంగోలు

ఒకరిసొమ్మా? – బకరిసొమ్మా?

3.1.10. /స/, /గు/ వర్ణాల మధ్య రాతలో వ్యత్యాసం లేకపోవడం.

ఉదా. సరిచేయడం – గురిచేయడం

గుర్తులు – సర్తులు

3.1.11. /స/, /న/ వర్ణాలను రాయడంలో బేధాన్ని పాటించకపోవడం.

ఉదా. సమ్మదాశ్రువులు – నమ్మదాశ్రువులు

సాహస – సాహన

సత్యభామ – నత్యభామ

## 4. రాతలో సమస్యలు

ఒక విద్యార్థి ఒక వర్ణాన్ని/పదాలను రాసేటప్పుడు ఎదురయ్యే ఇబ్బందిని రాత సమస్యగా పరిగణించవచ్చు. ఇలాంటి సమస్య ఎదురైనప్పుడు ఆ విద్యార్థి తన సౌకర్యార్థం పదాలలోని వర్ణాల్ని తనకు సులభమనిపించిన పద్ధతిలో రాస్తాడు. అలా రాయడం మూలంగా ఒక వర్ణం అనేక రూపాలను సంతరించుకుంటుంది. వాటిలో ముఖ్యమైనవి...

4.1. /ఐ/ అనే వర్ణాన్ని బహురూపాలలో రాయడం.'

తరచుగా ఎక్కువమంది విద్యార్థులరాతలో ఇది అనావశ్యకమైన ఒంపులకు గురి అవుతుంటుంది. లేదా కింది భాగంలో రెండుసున్నలు పక్కపక్కనే రాసినట్టుగా మారిపోతుంది. ఇటువంటి లేఖనాన్ని భాషోపాధ్యాయులు జాగ్రత్తగా గుర్తించి ప్రాథమిక తరగతులలోనే సరిచేయాలి.

4.2. /క/ అనే వర్ణాన్ని రాయడంలో ఒక్కొక్కరు ఒక్కో పద్ధతిని పాటించడం.

4.3. /ఖ/ వర్ణాన్ని అనేక రూపాలలో రాయడం.

4.4. ఇటువంటి సమస్యలే /డ/, /ఠ/, /ణ/ వర్ణాల రాతలోనూ కనిపిస్తున్నాయి. వీటిని భాషోపాధ్యాయులు జాగ్రత్తగా గమనించి పరిష్కరించాలి.

## 5 ఒత్తు(లు) రాయడంలో వచ్చే సమస్యలు

సాధారణంగా వర్ణాల తరువాత ఎక్కువ మంది తమ రాతలో ఒత్తుల దగ్గరే సమస్యను ఎదుర్కొంటున్నారు. కొన్నిటిని ఇక్కడ చూద్దాం. కింద చూపిన ఉదాహరణలనుంచి, విద్యార్థులు రాతలో చేస్తున్న ఈ విధమైన దోషాలను గమనించవచ్చు.

5.1. "మ" ఒత్తుకి "శ" ఒత్తుకి మధ్య తేడా చూపించలేకపోతున్నారు.

ఉదా. నిదర్శనాలు – నిదర్మనాలు

5.2. "త" ఒత్తుకు "ఐ" కారంలోని కింది సగభాగం రాసేప్పుడు రాసే గుర్తుకూ మధ్య భేదం చూపించడంలో పొరపాటు పడుతుండడం.

ఉదా. కుమార్తె – కుమారై

సమానమైనవి – సమానమ్తెనవి

5.3. "వ" ఒత్తుకు "య" ఒత్తుకి మధ్య భేదాన్ని పాటించకపోవడం.

ఉదా. స్వామినాథన్ – స్యామినాథన్

విద్య – విద్వ

సర్వ – సర్య

## 6 పదాల్లో వచ్చే సమస్యలు

'భాషలో అర్థ బోధన సామర్థ్యంగల కనిష్ఠ భాషాంశం పదం'. (పవన్ కుమార్, పమ్మి. 2010. సామాన్య భాషాశాస్త్రం నోట్స్) దీనికి చిన్న చిన్న మార్పులు (జరిగితే)/ చేయడంద్వారా విపరీతార్థం గానీ, అర్థావగాహనకు భంగంగాని, అసంబద్ధత గానీ ఏర్పడడానికి అవకాశం ఉంది. కొన్నింటిని ఇక్కడ చూద్దాం.

### 6.1 హ్రస్వాలు దీర్ఘాలుగా, దీర్ఘాలు హ్రస్వాలుగా మార్పుచెందడం

ఉదా. (i) దశరథుడు – దశారథుడు

జొచ్చెన్ – జోచ్చెన్

(ii) సీతాదేవి – సితాదేవి

సమీపంలో – సమిపంలో

## 7 వాక్యాల నిర్మాణం, రాతలో వచ్చే సమస్యలు

'సంపూర్ణ అర్థాన్నిచ్చే కొన్ని పదాల సముదాయమే వాక్యం. ఇది భాషకు సంబంధించిన చర్చలో (ధ్వనితో మొదలు పెట్టినపుడు) చివరిదీ, శక్తివంతమైనదీ. కొన్ని పదాలు క్రమంగా పేర్చినంత మాత్రాన అది వాక్యం అయ్యే అవకాశం లేదు. వాక్యంలోని పదాలమధ్య స్థాన సంబంధం, యోగ్యతా సంబంధం, ఆదేశ సంబంధం అనేవి ఉండాలి.' (పవన్ కుమార్, పమ్మి. 2010. సామాన్య భాషాశాస్త్రం నోట్స్) పత్ర పరిమితుల దృష్ట్యా, వాక్య నిర్మాణానికి సంబంధించిన చర్చ ఇక్కడ చేయడం లేదు. విద్యార్థుల రాతలో వాక్యాలకు సంబంధించిన ఒక ప్రధాన సమస్యను గుర్తించడం జరిగింది. అది పదానికీ, పదానికీ మధ్య వ్యవధి పాటించకపోవడమే. చాలా మంది విద్యార్థుల రాతలో ఈ లక్షణం కనిపిస్తోంది.

ఉదా.

"శ్రీరాముని జన కమహరాజుతో ఓ రాజా ఆదిశేషు నితల చేత" గా కొనసాగే వాక్యాల సంపుటినిలో గమనించ్చవచ్చు. పదాల మధ్య అసమానమైన ఖాళీలతో వాక్యం కొనసాగడం, పదాల విరుపు, సంయోగాలపై అవగాహన లేకపోవడం, ప్రత్యయాలను, గౌరవవాచకాలను వేరుచేసి రాయడం... మొదలైన అనేక అసంబద్ధతలు కనిపిస్తున్నాయి.

## 8 విరామ చిహ్నాల వాడుకలో వచ్చే సమస్యలు

వాక్యాన్ని వేరుచేయడానికి ఉపయోగించేది విరామచిహ్నం (ఫుల్ స్టాప్). వాక్యం పూర్తయ్యిందని తెలియజేయడానికి పూర్తి విరామ చిహ్నాన్ని, రెండు అసంపూర్ణ వాక్యాల్ని కలుపడానికి, రెండు ప్రత్యేక పదాల్ని వేరుచేయడానికి కించిద్విరామ చిహ్నాన్ని(కామా) వాడడం అనేది తప్పనిసరి. లేకపోతే భావగ్రహణంలో పాఠకుడికి అసౌకర్యం ఏర్పడుతుంది. ఆశ్చర్యార్థకాలు, ప్రశ్నార్థకాలు తదితర చిహ్నాల పాత్ర కూడా అత్యంత ఆవశ్యకమైనదే. వీటి వాడకంపై తెలుగు వ్యవహర్తలకు ఒక కట్టుబాటు ఉన్నట్టు కనపడదు. ముఖ్యంగా పూర్తి విరామ చిహ్నాన్ని వాడుతుంటారు గాని, కించిద్విరామ చిహ్నం(కామా) వాడకంలో సరైన అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులలోకూడా వెనుకబాటు కనిపిస్తున్నది.

## 9 పరిష్కారమార్గాలు

రాతలో వచ్చే సమస్యలను అధిగమించడానికి ఇప్పుడు చెప్పబోతున్న పరిష్కార మార్గాలు క్షేత్రస్థాయి పర్యటనద్వారా మాకు లభించిన సమాచారం ఆధారంగా రూపొందించబడ్డాయి. క్షేత్రస్థాయి పర్యటనలద్వారానూ, స్థాయి ఆధారంగానూ ఈ రంగంలో ఇంకా కృషిని కొనసాగించడానికి అవకాశం ఉంది.

9.1 ఈనాటి కాలంలో ప్రధానంగా వర్ణాలని రాసి దిద్దించే విధానానికి బదులు నల్ల బల్లపై రాసిన దానిని చూపి పుస్తకాల (నోట్ బుక్ )లో రాసుకోమనడం, వర్క్ బుక్ లో రాయడం/దిద్దడం అనే విధానం కొనసాగుతోంది. దీని మూలంగా వర్ణాన్ని ఉన్నది ఉన్నట్లు రాయడంలో విద్యార్థులకు సరియైన అవగాహన ఉండటంలేదు. కాబట్టి ప్రాథమిక దశలోనే విద్యార్థుల చేత వర్ణాల్ని దిద్దించడం, నిర్దుష్టతపై దృష్టిని కేంద్రీకరించే విధంగా చేయడం వల్ల రాతలో వచ్చే సమస్యలను కొంత వరకు పరిష్కరించవచ్చు.

9.2 నవోదయ లాంటి ఉన్నత ప్రమాణాలు గల పాఠశాల/కళాశాలల్లో తెలుగు నోట్స్ రాయించక పోవడం, కేవలం ముద్రిత ప్రతుల (printed material)పై, పాఠ్య పుస్తకాలపై ఆధారపడి విద్యనభ్యసింపజేయడం కనిపిస్తోంది. దోషభూయిష్టమైన ఈ పద్ధతివల్ల రాతపై పట్టు సాధించడంలో విద్యార్థులు వెనుకబడుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవడంతో పాటు, చేతి రాతపై పట్టు సాధించే విధంగా విద్యార్థుల్ని ప్రోత్సహించే భాధ్యత విస్మరింపరానిది.

9.3 కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని దశల్లోనూ విద్యార్థులు రాతలో చేసే పొరపాట్లను సరిదిద్దడంలో కొందరు ఉపాధ్యాయులు మందకొడిగా వ్యవహరిస్తున్నారు. దీనికి తల్లిదండ్రులు తమ పిల్లల అభ్యసన కార్యకలాపాలను పర్యవేక్షించకపోడం, ఆంక్షలు, ఉపాధ్యాయుడి వ్యక్తిగత నిర్లక్ష్యం... మొదలైన కారణాలను చెప్పుకోవచ్చు. పై అంశాలలో తగిన మార్పులు రావడం మూలంగా విద్యార్థి రాత మెరుగుపడే అవకాశం ఉంటుంది.

9.4 'ఒక్కసారి రాయడం వందసార్లు చదివినదానితో సమానం' అన్న విషయాన్ని మరువరాదు. జిరాక్సులు (నకళ్ళు), వాడడం నేటి కాలంలో అధికమయ్యింది. ఇదొక రకంగా విద్యార్థులను రాత నుండి దూరం చేస్తోంది. అలా కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు, చేతిరాతపైకూడా ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తే మామూలు ఫలితం కంటే రెట్టింపు ఫలితం పొందే అవకాశం ఉంటుంది.

9.5 మొదట ఉపాధ్యాయుడు స్పష్టంగా, నిర్దుష్టంగా భాషించడం, పఠించడం, లిఖించడం చేసి విద్యార్థులకు మార్గదర్శకుడిగా ఉండాలి.

9.6 విద్యార్థులతో చూచిరాత, ఉక్తలేఖనం వంటివి నిత్యం చేయించాలి.

9.7 ప్రతిరోజు ఇంటిపని (హోమ్ వర్క్) ఇవ్వడం, చేసుకొచ్చిన వాటిని సరిచేయడం. సందర్భోచితంగా సూచనలివ్వడం, తప్పులు పునరావృతం కాకుండా శ్రద్ధ తీసుకోవాలి .

9.8 విద్యార్థులు రాతలో చేసే సాధారణ దోషాలను ముందే వారిదృష్టికి తీసుకొనివెళ్ళి, వాటికి సమాంతరంగా ఒప్పు పదాల పట్టికలను తయారుచేయించాలి. అభ్యాసాలద్వారా వాటిని నేర్చుకొనే అవకాశం కల్పించాలి.

9.9 ధ్వన్యుత్పత్తి జ్ఞానం కలిగించి స్పష్టమైన ఉచ్చారణ ద్వారా ఉత్తమ భాషణాన్ని అలవాటు చేయాలి. దీని నుంచి మంచి పఠనం, లేఖనం పెంపొందుతాయి.

9.10 వ్యాసాలు, లేఖలు, వ్యాస రచన పోటీల ద్వారా లేఖన నైపుణ్యాన్ని పెంపొందించ గలిగితే, విద్యార్థుల భావవ్యక్తీకరణ, భావగ్రహణాలు సమర్థవంతమౌతాయి.

9.11 దోష సవరణలో విద్యార్థులను నిందించరాదు, నిరుత్సాహపరుచరాదు.

9.12 దోష రహితంగా రాసినట్లైతే వారిని అభినందించాలి .

9.13 సృజనాత్మక రచనలను ప్రోత్సహించాలి .

## 10 ఉపయుక్త గ్రంథసూచి / ఆకరాలు

10.1 (i) బ్రహ్మానందం, వై. కె.(సం.). 2005. *తెలుగు – బోధనా పద్ధతులు.* హైదరాబాదు: తెలుగు అకాడమి.

10.1 (ii) వెంకటేశ్వరరావు, రామరాజు.(సం.). 2011. *తెలుగు బోధనా పద్ధతులు.* హైదరాబాదు: తెలుగు అకాడమి. మొదటిముద్రణ– 2010.

### 10.2 సందర్శించిన పాఠశాలలు

10.2.1 యు. ఓ.హెచ్. క్యాంపస్ స్కూల్, హైదరాబాదు విశ్వవిద్యాలయం, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాదు, రంగారెడ్డి జిల్లా.

10.2.2 జవహర్ నవోదయ విద్యాలయ, నల్లగండ్ల, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాదు, రంగారెడ్డి జిల్లా.

10.2.3 జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల, శేరిలింగంపల్లి, శేరిలింగంపల్లి మండలం, హైదరాబాదు, రంగారెడ్డి జిల్లా.

(*ప్రపంచీకరణ యుగంలో నవీన భాషా బోధన పద్ధతులు: వ్యూహాలు అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సులో* 1. *మెరుగు రాంచందర్*, 2. *మెండా ఆదికేశవులు*, 3. *గరిగె రాజేశ్*, 4. *మల్లిపూడి రవిచంద్ర* [*ఎం.ఏ. తెలుగు విద్యార్థులు*]*లతో కలిసి సమర్పించిన పత్రం. తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, దక్షిణ ప్రాంతీయ భాషా కేంద్రం, మైసూరుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు*. 06-07 *మార్చి*, 2012. *హైదరాబాదు. తెలంగాణ.*)

# 9. ఎలక్ట్రానిక్ నిఘంటువుల నిర్మాణంలో మెలకువలు: తెలుగు

'తెలుగుభాషకు సమగ్ర నిఘంటువు' అన్నది ఈ కాలపు తప్పనిసరి అవసరం. జరిగిపోయిన కాలంతో పోల్చితే, ఈ అవసరం ఇప్పుడు చాలాఎక్కువ అని తేలికగా గుర్తించగలం. ఇప్పటివరకూ వెలువడిన తెలుగు నిఘంటువుల సంఖ్య తక్కువేమీ కాదు. వందల సంఖ్యలో వెలువడిన తెలుగు నిఘంటువులను, వాటి స్వరూప, స్వభావాలను గురించి చేసిన విశేష చర్చ మనకు అందుబాటులో ఉంది. కాబట్టి, సంప్రదాయ నిఘంటువుల గుణగణ వివేచనం ఈ పత్రంలో చేయడంలేదు. కాని, సంప్రదాయ నిఘంటువులను సంగణకాత్మక (సమగ్ర) తెలుగు నిఘంటువును నిర్మించుకోడానికి ప్రధాన వనరులుగా గ్రహించవలసిన అవసరం ఉంది. ఈ ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని, సమగ్ర తెలుగు ఎలక్ట్రానిక్ నిఘంటువును నిర్మించడంలోని మెలకువలను చర్చించడానికి ఈ పత్రం పరిమిత మవుతున్నది.

## 1. ఎలక్ట్రానిక్ నిఘంటువు

ఎలక్ట్రానిక్ నిఘంటువు సంగణకం(computer)లో నిక్షిప్తంచేసిన నిఘంటువు లేదా సమాచార నిక్షిప్త సాధనాల(సి.డి.లు, మెమరీ స్టిక్‌లు...) లో ఉండి సంగణకంద్వారా చూడడానికి, వినియోగించుకోడానికి అనుగుణమైన పద్ధతిలో కూర్చిన నిఘంటువులు. సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పుల కారణంగా, ఇప్పుడు ఎలక్ట్రానిక్ నిఘంటువుల వినియోగంలో అనేక మార్పులు వచ్చాయి. పామ్‌టాప్‌లు, నోట్‌బుక్‌లు మొదలైన సంక్షిప్తీకృత ఎలక్ట్రానిక్ వస్తుసంచయంలోనూ, మొబైల్ ఫోన్లలోనూ ఎలక్ట్రానిక్ నిఘంటువులను ఇప్పుడు వినియోగించుకోవచ్చు. మార్పులకు, చేర్పులకు అనుగుణమైన రీతిలో అందుబాటులో ఉన్న ఇటువంటి నిఘంటువుల వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నది.

## 2. ఎలక్ట్రానిక్ నిఘంటువు నిర్మితి, ప్రయోజనాలు

ఎలక్ట్రానిక్ నిఘంటువు అన్నది మనకు మరీ కొత్త మాట కాదు. ఏక, ద్వి భాషా ఎలక్ట్రానిక్ నిఘంటువులు (ప్రధానంగా తెలుగు-తెలుగు, తెలుగు-ఇంగ్లిష్ భాషలకు) కొన్ని మనకు పరిచితమే! ఇవి అంతర్జాలం(internet)లో ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. అయితే, ఇవి ఎలక్ట్రానిక్ నిఘంటువు నిర్మాణానికి అనుగుణమైన అమరికను ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిఘంటువులు అంతగా ప్రతిబింబించవు. ఇప్పటికే వాడుకలోఉన్న సంప్రదాయ ముద్రణ నిఘంటువులను ఎలక్ట్రానిక్ నిఘంటువులుగా మార్చి అంతర్జాలం(internet)లో అందుబాటులో ఉంచారు. నిజానికి, ఎలక్ట్రానిక్ నిఘంటువుల లక్ష్యమూ, ప్రయోజనమూ... విస్తృతమైనవి. పరిధులు తక్కువ. ప్రయోజనం అధికం. కొన్నిటిని ఇక్కడ గమనిద్దాం.

2.1 ఎలక్ట్రానిక్ నిఘంటువులవాడకానికి- 2లో చెప్పుకొన్నట్టుగా ఏదో ఒక సాధనం (సంగణకం/పామ్ టాప్/నోట్‌బుక్...) అవసరం. ఎలక్ట్రానిక్ నిఘంటువులవాడకంలో సౌలభ్యం ఎక్కువ. సంప్రదాయ ముద్రణ నిఘంటువులవాడకంలో ఎదుర్కొనే క్లేశాలు (పుటలసంఖ్య, ఆరోపానికి సంబంధించిన అకారాది క్రమాన్ని పాటించడంలో ప్రమత్తత పొందే అవకాశం...) ఎలక్ట్రానిక్ నిఘంటువుల వాడకంలో ఉండవు.

2.2 సంప్రదాయ ముద్రణ నిఘంటువులకు ఉండే స్థల పరిమితి ఎలక్ట్రానిక్ నిఘంటువులకు ఉండదు.

2.3 సంప్రదాయ ముద్రణ నిఘంటువులకు ఉండే పరిమాణ పరిమితి (పుటల సంఖ్య/నిఘంటువు పరిమాణం...) వంటివి ఎలక్ట్రానిక్ నిఘంటువుల విషయంలో పెద్ద చర్చనీయాంశాలు కావు.

2.4 ఎలక్ట్రానిక్ నిఘంటువులు నిరంతరం నవీకరణకు అవకాశాన్ని ఇస్తాయి. సంప్రదాయ ముద్రణ నిఘంటువుల నవీకరణ బహు క్లిష్ట సాధ్యం. సమయం, ఆర్థిక వనరులు... ఇత్యాది అంశాలు ఇక్కడ ప్రధాన అడ్డంకులుగా ఉంటాయి.

2.5 సంప్రదాయ ముద్రణ నిఘంటువులకు ఉండే కాల పరిమితి ఎలక్ట్రానిక్ నిఘంటువులకు ఉండదు. విశ్వవ్యాప్తంగా ఉన్న వినియోగదారులందరికీ ఏక కాలంలో అందుబాటులో ఉంటాయి.

2.6 ఎలక్ట్రానిక్ నిఘంటుకర్తలు అందరూ ఒకేచోట కూర్చుని పనిచేయ నవసరంలేదు. నిర్మితికి సంబంధించిన అవగాహన, పథకరచన, లక్ష్యాలు... తెలిస్తే చాలు. ప్రపంచంలో ఎక్కడినుంచైనా ఎలక్ట్రానిక్ నిఘంటువులను తయారు చేసి వినియోగంలోకి తీసికొనిరావచ్చు.

2.7 నిఘంటువులు- అంటే సృజనాత్మక రచనలకే/సాహిత్య రచనలకే అన్న అపవాదును ఎలక్ట్రానిక్ నిఘంటువులు పూర్వపక్షం చేస్తాయి. ఏకకాలంలో వివిధ రంగాలకు(fields), వివిధ అంశాలకు (subjects) సంబంధించిన నిఘంటువులను రూపొందించవచ్చు.

2.8 పుటల పరిమాణం, నిఘంటు పరిమాణం అన్నవి ఎలక్ట్రానిక్ నిఘంటువుల విషయంలో సమస్యలుకావు.

2.9 ఎలక్ట్రానిక్ నిఘంటువులలో ఆరోపాలను వెతికి అర్థ వివరణలను గ్రహించడం చాలా సులభం.
2.10 ఎలక్ట్రానిక్ నిఘంటువులలో ఆరోపాలను చేర్చడం, అర్థ వివరణలను కూర్చడం, నవీకరరించడం... మొదలైన పనులను నిరంతరం చేయవచ్చు. సంప్రదాయ ముద్రణ నిఘంటువులు పది సంవత్సరాల

వ్యవధిలో పది ముద్రణలు పొందితే, ఎలక్ట్రానిక్ నిఘంటువు పదిసంవత్సరాల వ్యవధిలో, కొన్ని వేల నవీకరణలు పొందే అవకాశం ఉంది.

2.11 వినియోగదారుల వినియోగ సందర్భానికి తగిన సమాచారాన్ని, ఎలక్ట్రానిక్ నిఘంటువులలో రూపొందించడం తేలిక.

2.12 ఎలక్ట్రానిక్ నిఘంటువులలో ఆరోపాలను చేర్చడం, అర్థ వివరణలను కూర్చడం, నవీకరరించడం... మొదలైన పనులద్వారా, నిఘంటు పరిమాణాన్ని వినియోగదారుని అవసరానికి అనుగుణంగా పెంచుకోవచ్చు. తగ్గించుకోవచ్చు.

2.13 ఒక భాషలో రూపొందించిన సమగ్ర ఎలక్ట్రానిక్ నిఘంటువు ఆధారంగా, ద్వి, త్రి, బహుభాషా నిఘంటువులను తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో, మానవవనరుల అర్థవంతమైన శక్తి వినియోగంతో కూర్చవచ్చు.

2.14 ఎలక్ట్రానిక్ నిఘంటువులను భౌతికంగా ఒక చోటునుంచి మరోచోటుకు తీసుకువెళ్ళవలసిన అవసరం తక్కువ. అంతర్జాలాన్ని(internet) వినియోగంలోకితేగల సంగణకం లేదా ఎలక్ట్రానిక్ పరికరం అందుబాటులో ఉంటే చాలు.

2.15 ఇప్పటికే అందుబాటులో ఉన్న సంప్రదాయ ముద్రణ నిఘంటు వనరుల నవీకరణతో, సమగ్ర ఎలక్ట్రానిక్ నిఘంటువులను తెలుగు భాషకు తయారు చేయడం ప్రారంభించాలి.

## 3. అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులోఉన్న నిఘంటువులు

అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులోఉన్న ఒకటి రెండు ఎలక్ట్రానిక్ నిఘంటువులను పరిచయం చేయడం, తద్వారా సమగ్ర ఎలక్ట్రానిక్ తెలుగు నిఘంటువు రూపొందించుకోడానికి అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ నిఘంటువులను/వనరులను పరిచయం చేయడానికి ఈ విభాగం పరిమితమవుతున్నది.

అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులోఉన్న తెలుగు-తెలుగు-ఇంగ్లిషు నిఘంటువులకు ఆంధ్రభారతి సంప్రదించదగిన ఒక ఆకరం (ఆకరాలలోని URL-1 చూడండి). ఇది; శబ్దరత్నాకరం, బ్రౌణ్య తెలుగు-ఇంగ్లిషు నిఘంటువు, శంకర నారాయణ తెలుగు-ఇంగ్లిషు నిఘంటువు... వంటి 16

నిఘంటువుల సమాహారం. దీనిలో పదాన్ని శోధించుకొనే వెసులుబాటు ఉంది. మనకు కావలసిన పదాలకు అర్థవివరణలను నిర్ణీత నిఘంటువునుంచి కోరుకొంటున్నామా? లేక అన్ని నిఘంటువులనుంచీ తెలిసికోవాలను కొంటున్నామా అన్నది ఎంచుకొనే సౌలభ్యం ఉంది. అలాగే పదంలో కొంతభాగం తెలిసినా ఆ వర్ణక్రమంలో ఉన్న పదాలన్నిటినీ ఇది వెతికి చూపిస్తుంది. ఇటువంటి నిఘంటు వనరులను సమగ్ర ఎలక్ట్రానిక్ తెలుగు నిఘంటువు రూపొందించుకోడంలో వినియోగించుకోవచ్చు.

ఆంధ్ర భారతిలో ఇచ్చిన వినియోగదారుని ఐచ్ఛికాలు లేకుండా కేవలం పదాన్ని శోధించడానికి మాత్రమే అవకాశం కల్పించి మరొక ఎలక్ట్రానిక్ తెలుగు కోశం శబ్దకోశ్ (ఆకరాలలోని URL-2 చూడండి). ఏఏ ప్రామాణిక సంప్రదాయ నిఘంటువనరులనుంచి ఈ సమాచారం లభిస్తోందో, ఆ వివరాలు వినియోగదారునికి అందుబాటులో ఉంచకపోవడం నిరాశపరిచే అంశం.

అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులోఉన్న నిఘంటువులలో వినియోగదారునికి అర్థ వివరణలను గ్రహించడానికి ఐచ్ఛికాన్ని ఇచ్చేవి కొన్ని. నియంత్రించేవి మరికొన్ని. 1. సమాచార అమరిక, 2. నిఘంటు నిర్మాణం... మొదలైన ప్రత్యేకాంశాలపై ఇంకా చర్చకు అవకాశం ఉంది. పత్ర పరిమితుల దృష్ట్యా వాటన్నిటిని ఇక్కడ పేర్కొనటంలేదు.

## 4. సమగ్ర ఎలక్ట్రానిక్ నిఘంటువు నిర్మితి క్రమం

ఉపవిభాగం-3లో చర్చించిన అంశాలు తెలుగు భాషకు ఒక సమగ్ర ఎలక్ట్రానిక్ నిఘంటువు రూపొందించుకోవలసిన ఆవశ్యకత తెలియజేస్తున్నాయి. ఆధునిక కాలంలో- మరీముఖ్యంగా ఇటీవలి కాలంలో వచ్చిన సామాజిక మార్పులు, భాషావ్యవహారంలో వచ్చిన భేదాలు, అధ్యయన అంశాలు, సామాజిక రంగాలు... దీని అవసరాన్ని మరింతగా చాటుతున్నాయి. తమభావాలను స్వీయాభివ్యక్తులలో వ్యక్తం చేయాలన్న భాషా వ్యవహర్తల కాంక్ష.. మొదలైన అంశాలు ఒకవైపూ, సంగణకాలు, ఇంటర్ నెట్... వంటి సౌకర్యాలు మరోవైపూ ఈ భావనను వృద్ధి చేస్తున్నాయి.

తెలుగు భాషకు సమగ్ర ఎలక్ట్రానిక్ నిఘంటువును తయారు చేయడానికి (1) అందుబాటులో ఉన్న సంప్రదాయ ముద్రణ నిఘంటు వనరులు, (2) అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ నిఘంటు వనరులు ప్రధాన ఆకరాలు. వీటితోపాటు మరిన్ని విస్తృతప్రయోజనాలను ప్రదర్శించే తెలుగు సమాచార నిధులను (ఎలక్ట్రానిక్ రూపంలో అందుబాటులో ఉన్న) కూడా ప్రధాన ఆకరాలుగా స్వీకరించాలన్న ప్రత్యేకాంశాన్ని, దాని నిర్మాణ క్రమాన్ని ఈ పత్రంలోని ఉపవిభాగం-4లో చర్చించడం జరుగుతున్నది.

అందుబాటులో ఉన్న సంప్రదాయ ముద్రణ నిఘంటు వనరులు, అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ నిఘంటు వనరులు మాత్రమే సమగ్ర ఎలక్ట్రానిక్ నిఘంటువును తయారు చేయడానికి సరిపోవు. ఆధునిక కాలంలో భాష ప్రయోగంలోఉన్న వివిధ రంగాలకు సంబంధించిన సమాచారాన్ని సంగణీకరించి వాటినుంచి ఆరోపాలను గ్రహించి అర్థవివరణలను కూర్చవలసి ఉంది. ఇందుకోసం భాషా ప్రయోగ వైవిధ్యాన్ని ప్రదర్శించే తెలుగు సమాచార నిధులను వివిధ రంగాలకు సంబంధించిన పద్య, గద్యాత్మక, ఆధునిక వచన రచనల రూపంలో వివిధ సమాచార నిధులను కూడా ప్రధాన ఆకరాలుగా గ్రహించవలసి ఉంది.

2, 3, 4 ఉపవిభాగాలలో చర్చించిన అంశాలకు తోడు, చారిత్రక, ప్రాంతీయ, సాంఘిక... భేదాలన్నిటినీ ప్రతిఫలించేదిగా ఉండే సమగ్ర ఎలక్ట్రానిక్ తెలుగు నిఘంటువును రూపొందించుకోవాల్సి ఉంది. భాషా ప్రయోగ రంగాలలో ప్రధానమైన ఏ ఒకటి, రెండు రంగాలకు సంబంధించిన నిఘంటువనరులతోనో, సమాచార నిధులతోనో ఈ పనిని ప్రారంభించవచ్చు. భాష ప్రవర్తిల్లే రెండు ప్రధాన మార్గాలు– మౌఖిక, లిఖిత పద్ధతులను రెంటినీ దీనిలో సమన్వయించే వెసులుబాటును కూడా కల్పించుకోవచ్చు. సంప్రదాయ ముద్రణ పద్ధతిలో కాకుండా ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులకు అనుగుణంగా ఉండేట్టుగా చలనశీల సమాచార నిధులుగా, నిఘంటువులుగా వీటిని రూపొందించుకోవాలి. బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడగల సమగ్ర ఎలక్ట్రానిక్ తెలుగు నిఘంటునిర్మితిలోని ప్రధాన, ఉపవిభాగాలను కింది రేఖాచిత్రం పరిచయమాత్రంగా చూపుతుంది.

సమగ్ర తెలుగు సమాచార నిధి

↓

పఠనయోగ్య, శ్రవ్యయోగ్య సమాచార నిధి

↓

చలనశీల (ఆన్ లైన్) పఠనయోగ్య, శ్రవ్యయోగ్య రచనల నిధి

↓

ఆన్ లైన్ లో రాయడం, చదివినదానిని రికార్డుచేసి అప్‌లోడ్ చేయడం మొదలైన పనులు నిర్వహించడానికి కావలసిన సదుపాయాలు/టూల్స్/అప్లికేషన్లు... అందుబాటులో ఉంచడం.

↓

పరిశోధకులు / వ్యవహర్తలు / ఆన్ లైన్ చర్చాబృందాలు

↓

చారిత్రక/ప్రాంతీయ/సాంఘిక భాషా వ్యవహారాలకు ప్రత్యేక/సమగ్ర నిఘంటువుల తయారీ

↓

మౌఖిక-లిఖిత, గృహ-బహిరంగ, విద్యావంతుల-అవిద్యావంతుల,
పిన్నల-పెద్దల, స్త్రీ-పురుష, మొదలైన వ్యవహార భేదాలను ప్రతిబింబించే కోశాలు.

↓

వివిధ అంశాలవారీగా(subjects) అనువర్తన కోశాలు...

↓

వివిధ రంగాలకు (fields) సంబంధించిన అనువర్తన కోశాలు...

↓

మాండలిక నిఘంటువులు-1, 2, 3, 4...

సమగ్ర తెలుగు భాషా నిఘంటువు, (చారిత్రక, ప్రాంతీయ, సాంఘిక భేదాలతో కలిపి/వేరుగానూ)
(వినియోగదారుని అవసరాలకు అనుగుణమైన సౌలభ్యంతో. . . (సంక్షిప్తీకృత, వివరణాత్మక . . .)

పత్రంలో పరిచయంచేసిన 'సమగ్ర ఎలక్ట్రానిక్ తెలుగు నిఘంటు నిర్మాణం' సరళరూపంలో కనిపించే సంక్లిష్ట ప్రక్రియ. పెనవేసుకొనిపోయినట్టుండే ఈ సరళ-సంక్లిష్ట నిర్మాణాలను అర్థం చేసికొని తెలుగు వ్యవహర్తలందరికీ వారి దైనందిన, ప్రత్యేక భాషావసరాలను తీర్చగల ఎలక్ట్రానిక్ వనరులను రూపొందించుకోడం మాత్రం నేటి అవసరం.

## 5. ఉపయుక్త గ్రంథ/రచనల/ఆకర సూచి

### 5.1 తెలుగు


5.1.1 ఉషారాణి, గోవిందరాజులు, పి. 2003. తెలుగు నిఘంటువులు-ఒక అధ్యయనము. తిరుపతి.

5.1.2 కృష్ణమూర్తి, భద్రిరాజు. 1962. మాండలిక వృత్తిపదకోశం. ప్రథమ సంపుటం-వ్యవసాయపదాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

5.1.3 ____________ 1971. మాండలిక వృత్తిపదకోశం. ద్వితీయ సంపుటం-చేనేత పదాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

5.1.4 ____________ (సం.) 2010. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

5.1.5 నరసింహారెడ్డి, పి.సి. 1971. వ్యావహారిక ఖండికలు: లఘు వ్యాఖ్యలు. రాధాకృష్ణ, బూదరాజు(సం.) తెలుగు మాండలికాలు, కరీంనగర్ జిల్లా. హైదరాబాదు: తెలుగు అకాడమి.

5.1.6 రాధాకృష్ణ, బూదరాజు. 1968. తెలుగు మాండలికాలు (శ్రీకాకుళం జిల్లా). హైదరాబాదు: తెలుగు అకాడమి.

5.1.7 _____________ (సం.) 1968. తెలుగు మాండలికాలు (కడప జిల్లా). హైదరాబాదు: తెలుగు అకాడమి.

5.1.8 _____________ (సం.) 1977. తెలుగు మాండలికాలు (వరంగల్లు జిల్లా). హైదరాబాదు: తెలుగు అకాడమి.

5.2. పత్రం

5.2.1 పవన్ కుమార్, పమ్మి. 2012. సంగణకాత్మక తెలుగు మాండలిక నిఘంటు నిర్మాణం. అంతర్జాతీయ రెండో తెలుగు అంతర్జాల సదస్సులో సమర్పించిన పత్రం. నవంబరు 1-2, 2012. గీతం విశ్వవిద్యాలయం: విశాఖపట్టణం.

## 5.3 English

5.3.1 Atkins, S. & Jundell, M. 2008. *The Oxford Guide to Practical Lexicography*. OU Press: 238-246.

5.3.2. De Schrver, Gilles-Maurice,. 2003. *Lexicographers dreams in the electronic dictionary age* in International Journal of Lexicography, 16(2): 143-199

5.3.3 Lisker, L. 1963. *Introduction to Spoken Telugu*. New York: American Council of Learned Societies.

5.3.4 Nesi, H. 2009. *Dictionaries in Electronic form* in COWIE, A. P. (Ed.) The Oxford History of English Lexicography, OU Press.

**5.4 URLs:**

5.1 http://www.andhrabharati.com/dictionary/index.php

5.2 http://www.shabdkosh.com/te/

(నిఘంటు నిర్మాణంలో నూతన పద్ధతులు అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సులో సమర్పించిన పత్రం. భాషాభివృద్ధిపీఠం, PSTU. హైదరాబాదు. 06-07 మార్చి, 2012. హైదరాబాదు. తెలంగాణ)

>>>><<<<

# 10. సంగణకాత్మక తెలుగు మాండలిక నిఘంటు నిర్మాణం

తెలుగుభాషకు ఇప్పటివరకూ వెలువడిన నిఘంటువుల స్వరూప, స్వభావాలను దృష్టిలోఉంచుకొని రేఖామాత్రంగా స్పృశిస్తూ, సంగణకాత్మక తెలుగు మాండలిక నిఘంటువులను నిర్మించుకోవలసిన ఆవశ్యకతను ఈ పత్రంలో చర్చించడం జరుగుతున్నది. వృత్తిపదకోశాలకు, మాండలిక పదకోశాలకు ఉన్న సూక్ష్మభేదాలను పరిచయంచేస్తూ, ప్రాచీన కావ్యభాషలోని మాండలికాలను గుర్తించడంలో సంప్రదాయ నిఘంటుకర్తలు పొందిన ప్రమత్తతను పరిచయం చేయడం జరుగుతున్నది, ఆధునిక మౌఖిక, లిఖిత వ్యవహారాలలోఉన్న తెలుగును ఒకేచోట పట్టి చూపగల, సమాచార నిధుల నిర్మాణం ఒక తప్పనిసరి అవసరంగా గుర్తించవలసిన ఆవశ్యకతను, ఈ పత్రంలో పరిచయం చేయడం జరుగుతున్నది. ఇలా నిర్మించిన ఒక సమగ్ర సమాచార నిధిపై ఆధారపడి తయారుచేయదగిన ఒక సంగణకాత్మక మాండలిక నిఘంటు నిర్మాణానికి కావలసిన ప్రాథమిక రూపాన్ని ఈ పత్రం ఆవిష్కరిస్తున్నది.

## 1. తెలుగు నిఘంటువులు

తెలుగు నిఘంటువులకు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇప్పటివరకూ తెలుగు భాషకు లెక్కకు మిక్కిలిగా నిఘంటువులు వెలువడ్డాయి. అన్నీ ఒక నిర్దిష్టమైన ఉద్దేశమూ, ప్రయోజనమూ కలిగినవే! బహుధా విభజనకు యోగ్యమైన ఈ నిఘంటువులను స్వరూప, స్వభావ విభాగాలలో సమగ్రంగా దర్శించవచ్చు.

తెలుగులో కావ్య భాషకు వెలువడినన్ని నిఘంటువులు వాడుక భాషకు వెలువడలేదు. కావ్యభాషకు వెలువడిన నిఘంటువులు సర్వం సమగ్రమని ఇక్కడ ఉద్దేశం కాదు. వాడుక భాషకు కూర్చిన నిఘంటువులలోనూ ఎక్కువశాతం ప్రమాణ రచనలపై ఆధారపడినవే! భాషకు ఉన్న మౌలిక వ్యక్తరూపాలలో, మౌఖిక వ్యవహారానికి వెలువడిన తెలుగు నిఘంటువులు చాలా తక్కువ. ఇప్పటికే సంప్రదాయ ముద్రణ పద్ధతిలో గ్రంథరూపంలో వెలువడిన నిఘంటువుల వాడకంలో శ్రమ ఎక్కువ. మౌఖిక వ్యవహారంలోని వాడుక పదాలకు అర్థాలు ప్రత్యక్ష భాషణంలో కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడంద్వారా సాధించగలం. ఇటువంటి వివరణలను వాడుక/మాండలిక రచనలనుంచి గ్రహించాలంటే మాత్రం నిఘంటువుల అవసరం తప్పనిసరి.

తెలుగు భాషకు సంబంధించి ఇటువంటి కృషి వృత్తిపదకోశాల నిర్మాణంతో ప్రారంభమైంది. మాండలిక పరిశోధన పత్రికల ప్రచురణవైపు కొనసాగింది. సూక్ష్మంగా పరిశీలించినపుడు ఈ రెంటిమధ్య ఉన్న తేడాలను గమనించవచ్చు.

## 2. వృత్తి పదకోశాలు-మాండలిక పదకోశాలు

తెలుగు వ్యవహారంలో వృత్తి పదకోశాలు, మాండలిక కోశాలు రెంటినీ రెంటి అర్థంలో లేదా ఒకే అర్థంలో వాడడం కనిపిస్తుంది. కానీ వాటి నిర్మాణంలోనూ, ప్రయోజనంలోనూ స్వల్పమైన భేదాలున్నాయి. తెలుగులో వృత్తి పదకోశాలు వ్యవసాయం, చేనేత, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం ... మొదలైన రంగాలకు ఇప్పటికే వెలువడ్డాయి. ఈ వృత్తి పదకోశాల పేర్లముందు "మాండలిక" అన్న మాట కనిపిస్తుంది. నిజానికి, ఇవి వర్గ మాండలిక పదకోశాలు. అంటే- వివిధ వృత్తులలో ఉన్నవారి భాషావ్యవహారంలో ఆ వృత్తికి సంబంధించిన పదజాలాన్ని ఏర్చికూర్చిన కోశాలన్నమాట!

ఈ లక్షణాలతోపాటు మరిన్ని విస్తృతప్రయోజనాలను కలిగించేవి మాండలిక పదకోశాలు. ఒక మండలంలో వివిధ వృత్తులలో ఉన్నవారి భాషా వ్యవహారంలోని పదజాలం దీనిలో ప్రతిబింబిస్తుంది. చారిత్రక, ప్రాంతీయ, సాంఘిక...మొదలైన ప్రధాన కారణాలవల్ల భాషా వ్యవహారంలో వచ్చే మార్పులను మాండలిక పదకోశాలు వెల్లడిస్తాయి. వీటితోపాటు, మౌఖిక-లిఖిత, గృహ-బహిరంగ, విద్యావంతుల-అవిద్యావంతుల, పిన్నల-పెద్దల, స్త్రీ-పురుష... మొదలైన వ్యవహార భేదాలను, ఇతర కారణాలవల్ల పదజాలంలో వచ్చే మార్పులను మాండలిక నిఘంటువులు పట్టి చూపుతాయి. ఒక భాషా వ్యవహారప్రాంతంలోని భాషా మండలాల ఆధారంగా మాండలిక పదాల (వృత్తి పదాలతో కలుపుకొని) అధ్యయనం, సేకరణ ఎలా చేయవచ్చన్న వివరణను కింది రేఖాచిత్రం సంక్షిప్తంరూపంలో నిరూపిస్తుంది.



ఇంతవరకు తెలుగులో వెలువడిన వృత్తిపదకోశాలలోని ప్రధాన ఆరోపాల ఎంపిక ఆయా వృత్తులుచేసేవారి వ్యవహారంపై ఆధారపడి చేయబడింది. సంబంధిత భాషా మండలంలోని వ్యవహారం మొత్తాన్ని ఈ విభజన ప్రతిబింబించదు. అందువల్ల పై రేఖాచిత్రంలో చూపిన విధంగా సంప్రదాయ గ్రంథరూపంలో ఉన్నదికాకుండా, ఎప్పటికప్పుడు మార్పులకు, చేర్పులకు అనుగుణమైన సమగ్రమైన ప్రమాణ తెలుగు భాషా నిఘంటువును మనం నిర్మించుకోవలసి ఉంది.

## 3. మాండలిక నిఘంటువు

### 3.1 కావ్య భాష: మాండలిక నిఘంటువు

1, 2 విభాగాలలో చర్చించిన అంశాలకుతోడు మరిన్ని అంశాలను (సంగణకాత్మక) మాండలిక నిఘంటువులో భాగం చేయవచ్చు. నిఘంటువులు, వాటి నిర్మాణం... ఇత్యాది అనేకమైన అంశాలలో గుణాత్మకమైన మార్పులను తేగలిగేట్టుగా సంగణకాత్మక మాండలిక నిఘంటువు నిర్మించబడాలి. కావ్యాలకు సమగ్రమైన వ్యాఖ్యలు, సంప్రదాయ కావ్యభాషను దాదాపుగా ప్రతిబింబించే నిఘంటువులు మనకు ఉన్నాయనుకొంటుంటాం. అవి పాక్షిక సత్యాలనడానికి సుప్రసిద్ధులైన కవుల ప్రయోగాలే నిదర్శనం. ఉదాహరణకు– తిక్కన రచనలోని మాండలిక పద ప్రయోగాన్ని గమనించండి.

“కుడవనిచ్చు తఱియుఁ గురువర క్రక్కించు
నవరసంబు నెఱిఁగి యరి నృపాలు
నీవు ధీరవృత్తి నిడుఁ ద్రాటఁ బోనిమ్ము
క్రమ్ము కపిల యనఁగ గ్రమ్మి చెఱుపు”

(శ్రీ మదాంధ్ర మహాభారతం. ఆశ్రమవాస పర్వం: 1–72)

పైపద్యంలో కపిల అన్నమాట దేశ్య శబ్దం. దక్షిణ మండలంలో వాడుకలో ఉన్న ఈ మాటను ఉత్తర, మధ్య మండలాలలో ‘మోట’గా వ్యవహరిస్తారు. హిందీ వ్యవహార ప్రాంతాలతో ఉన్న భౌగోళిక సన్నిహితత్వంవల్ల ఈ మాట (<మోతా) ముందుగా ఉత్తరమండలంలోకి ప్రవేశించి ఆపై మధ్య మండలంలోకి విస్తరించిందని గమనించవచ్చు. ఇది ప్రాచీన గ్రంథాలలోని మాండలిక ప్రయోగాల సంగతి.

### 3.1 ఆధునిక కవిత్వం, వచన రచనలు: మాండలిక నిఘంటువు

ఆధునిక కవిత్వంలోనూ, వచనరచలలోనూ ఇటీవలి కాలంలో మాండలిక పద బాహుళ్యం హెచ్చింది. ప్రాంతీయ, సాంఘిక కారణాలను ఇక్కడ విస్మరించకూడదు. మాండలిక పద బాహుళ్యం కేవలం ఒక రంగానికి సంబంధించిన రచనలకు పరిమితం కాకపోవడం గమనించవలసిన విషయం.

ఉదాహరణకు ఉత్తరమండలంనుంచి వెలువడిన మాండలిక వచనరచనలోని కొంత భాగాన్ని ఇక్కడ గమనించండి.

“ సెప్తా ఇనా కక్కా! ఆసాములిండ్లల్ల పెండ దొక్కి పిడ్కెలు జెయ్యాలె! పొయ్యిలక్ కట్టెలు తేవాలె! ఎంత మందుంటె అందర్కి సెప్పులు గుట్టియ్యాలె! పాత కొత్త సెప్పులకుగల్పి పదేను మాన్కలు. ఇగ ఇను కక్కా! ముత్తూం ఎన్మిది కుండలు గింత సేవజేస్తే వొచ్చేది. గాల సేనేరబోతె నీల కుండ నిండ కంకులు నింపిత్తరు! ఎన్కముందు వొడి మాదిగోని వొంచె నింపుకోవచ్చు. నాగలిత్తనాన్కి రెండుపూటలు బోతె తవ్వెడు గింజలు కల్లం అల్కుపూతకు కల్ల మద్లు ఇత్తులు ఊకి ఎత్తుకోవాలె! సెల్కల కల్లమైనా వొరి కల్లమైనా వొచ్చేదంతే! ఏదుం పందుం పుట్టెడు ఇగో దాన్నెం లెక్కొస్తే గిట్లుంటది...” (కక్క:34)

## 4. సంగణకాత్మక మాండలిక నిఘంటువు ఆవశ్యకత

1, 2విభాగాలలోని నేపథ్యమూ, 3, 3.1, 3.2లలోని వివరణలు సంగణకాత్మక మాండలిక నిఘంటువులను రూపొందించుకోవలసిన తక్షణ ఆవశ్యకత తెలియజేస్తున్నాయి. ఆధునిక కాలంలో–మరీముఖ్యంగా ఇటీవలి కాలంలో వచ్చిన సామాజిక మార్పులు, భాషావ్యవహారంలో వచ్చిన భేదాలు, దీని అవసరాన్ని మరింతగా చాటుతున్నాయి. తమభావాలను స్వీయాభివ్యక్తులలో వ్యక్తం చేయాలన్న తపన ఒకవైపూ, సంగణకాలు, ఇంటర్ నెట్... వంటి సౌకర్యాలు మరోవైపూ ఈ భావనను వృద్ధి చేస్తున్నాయి.

ఇటువంటి వ్యవహార భేదాలవల్ల భాష విస్తృతి చెందుతుంది. ఇది సరళరూపంలో కనిపించే సంక్లిష్ట ప్రక్రియ. పెనవేసుకొనిపోయినట్టుండే ఈ సరళ–సంక్లిష్ట నిర్మాణాలను అర్థం చేసికొని తెలుగు వ్యవహర్తలందరికీ సుబోధకం చేయగల వనరులను రూపొందించుకోడం నేటి అవసరం.

## 5. సంగణకాత్మక మాండలిక నిఘంటు నిర్మితి

3.1, 3.2 ఉపవిభాగాలలో చర్చించిన విధంగా తెలుగుభాషకు కావ్యవ్యవహారంతో మొదలుపెట్టి, ఆధునిక తెలుగు వ్యవహారంతో కలుపుకొని ఒక సమగ్ర సంగణక మాండలిక నిఘంటువును నిర్మించుకోవాలి. ఇది చారిత్రక, ప్రాంతీయ, సాంఘిక... భేదాలన్నిటినీ ప్రతిఫలించేదిగా ఉండాలి. భాష ప్రవర్తిల్లే రెండు ప్రధాన మార్గాలు– మౌఖిక, లిఖిత పద్ధతులను రెంటినీ దీనిలో సమన్వయించే వెసులుబాటును కలిగి ఉండాలి. కావ్యాలు లేదా రచనలు అటు సమాచార నిధి రూపంలోనూ, వాటిని వినగలిగే సౌకర్యంఉన్న పద్ధతులలోనూ సంగణకాలపై నమోదు చేయాలి. చదివిన పాఠాన్ని లేదా సమాచారాన్ని నమోదుచేసి అటు రాతలో చూపుతూ, ఇటు వినగలిగే వెసులుబాటును ఇచ్చే పద్ధతిలో తెలుగు సమాచారనిధులు రూపొందించాలి. సంప్రదాయ ముద్రణ పద్ధతిలో కాకుండా ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులకు అనుగుణంగా ఉండేట్టుగా చలనశీల సమాచార నిధులుగా, నిఘంటువులుగా వీటిని

రూపొందించుకోవాలి. బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడగల సంగణకాత్మక మాండలిక నిఘంటు నిర్మితిలోని ప్రధాన, ఉపవిభాగాలను కింది రేఖాచిత్రం పరిచయమాత్రంగా చూపుతుంది.

సమగ్ర తెలుగు రచనల నిధి

↓

పఠనయోగ్య, శ్రవ్యయోగ్య రచనల నిధి

↓

చలనశీల (ఆన్ లైన్) పఠనయోగ్య, శ్రవ్యయోగ్య రచనల నిధి

↓

పరిశోధకులు / వ్యవహర్తలు / ఆన్ లైన్ చర్చాబృందాలు

↓

చారిత్రక/ప్రాంతీయ/సాంఘిక భాషా వ్యవహారాలకు ప్రత్యేక/సమగ్ర నిఘంటువుల తయారీ

↓

1. వృత్తి/వర్గ పదకోశాలు (వివిధ వృత్తులు, కులాలు ఆధారంగా)

↓

2. మౌఖిక-లిఖిత, గృహ-బహిరంగ, విద్యావంతుల-అవిద్యావంతుల,
పిన్నల-పెద్దల, స్త్రీ-పురుష... మొదలైన వ్యవహార భేదాలను ప్రతిబింబించే కోశాలు

↓

మాండలిక నిఘంటువులు-1, 2, 3, 4...?

ప్రమాణ తెలుగు భాషా నిఘంటువు (చారిత్రక, ప్రాంతీయ, సాంఘిక భేదాలతో కలిపి/వేరుగానూ)

## 6. ఉపయుక్త గ్రంథ సూచి

6.1 తెలుగు

6.1.1 ఎల్లయ్య, వేముల. 2000. కక్క. నల్గొండ: నీలి ప్రచురణలు.

6.1.2 కృష్ణమూర్తి, భద్రిరాజు. 1962. మాండలిక వృత్తిపదకోశం. ప్రథమ సంపుటం-వ్యవసాయపదాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6.1.3 ____________ 1971. మాండలిక వృత్తిపదకోశం. ద్వితీయ సంపుటం-చేనేత పదాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6.1.4 ____________ (సం.) 2010. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

6.1.5 నరసింహారెడ్డి, పి.సి. 1971. వ్యావహారిక ఖండికలు: లఘు వ్యాఖ్యలు. రాధాకృష్ణ, బూదరాజు(సం.) తెలుగు మాండలికాలు, కరీంనగర్ జిల్లా. హైదరాబాదు: తెలుగు అకాడమి.

6.1.6 మల్లేష్, మంత్రి. 2012. వేముల ఎల్లయ్య కక్క నవల: భాషా వైవిధ్యం. హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం.

6.1.7 రాధాకృష్ణ, బూదరాజు. 1968. తెలుగు మాండలికాలు (శ్రీకాకుళం జిల్లా). హైదరాబాదు: తెలుగు అకాడమి.

6.1.8 _____________ (సం.) 1968. తెలుగు మాండలికాలు (కడప జిల్లా). హైదరాబాదు: తెలుగు అకాడమి.

6.1.9 _____________ (సం.) 1977. తెలుగు మాండలికాలు (వరంగల్లు జిల్లా). హైదరాబాదు: తెలుగు అకాడమి.

6.2 **English**

6.2.1 Krishnamurti, Bh. 2003. The Dravidian Languages. Cambridge: Cambridge University Press.

6.2.2 Lisker, L. 1963. Introduction to Spoken Telugu. New York: American Council of Learned Societies.

6.2.3 Sapir, Edward. 1921. Language: An Introduction to the Study of Speech. New York: Harcort, Brace & world.

(అంతర్జాతీయ తెలుగు అంతర్జాల సదస్సు-2లో సమర్పించిన పత్రం. 02-04 నవంబరు, 2012. విశాఖపట్టణం. ఆంధ్రప్రదేశ్.)

# 11. తెలుగు: సంగణకాత్మక భాషాభివృద్ధియోజన

తెలుగుభాషాభివృద్ధికి సమగ్రమైన 'సంగణకాత్మక భాషాభివృద్ధియోజన' (Computational Language Planning and Development)ను రూపొందించుకోవలసిన ఆవశ్యకతను ఈ పత్రంలో పరిచయం చేయడం జరుగుతున్నది. 'భాషాభివృద్ధి, భాషాయోజన' అన్నవి కొత్త మాటలు కాకపోయినా, ఇప్పటివరకూ ఇవి పండితుల, భాషావేత్తల చర్చలకు మాత్రమే పరిమితమై ఉన్నాయి. భాషాభివృద్ధియోజన (Language Planning and Development) అన్నది ప్రతి భాషా సమాజానికి ఒక తప్పనిసరి అవసరం. ఏ భాషా సమాజంలోనైనా– వివిధ కాలాలలో వెలువడిన కావ్యాలు, గ్రంథాలు, వివిధాంశాలపై వెలువరించిన రచనలు... మొదలైనవి ఆ భాషాభివృద్ధి, వికాసాలను సూచించే గీటురాళ్ళుగా నిలుస్తాయి. అయితే; నానాటికీ పెరుగుతూపోయే సమాజాల భాషావసరాలను దృష్టిలో ఉంచుకొని వీటిని పునర్మూల్యాంకనం చేయడం భాషాభివృద్ధి యోజనలో కీలకమైన అంశం. ఈ అవసరం గడచిన కాలంతో పోల్చితే ఇప్పుడు చాలాఎక్కువ అని తేలికగా గుర్తించగలం. అత్యంత కీలకమూ, ప్రభావవంతమూ అయిన ఈ అవసరాలన్నిటినీ తీర్చడంలో మానవవనరులకు సంగణక అనువర్తనలు తోడైతే, ఆ భాషా, ఆ సమాజమూ సమంగా వృద్ధి సాధించగలుగుతాయి. ఈ స్థితిని చేరుకోడానికి ఇప్పటికే ప్రసిద్ధమైఉన్న 'యోజన'కు సంగణకాత్మక అనువర్తనకోణాన్ని జోడించడం, అందుకు అనుసరించదగ్గ వ్యూహాన్ని పరిచయంచేయడం ఈ పత్రంలోని ప్రధాన విషయం.

## 1. పూర్వరంగం నుంచి వర్తమానంలోకి...

తెలుగుభాషకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. వేలసంఖ్యలో రచనలు వెలువడ్డాయి. కాలక్రమానుగుణమైన, రచనా వైవిధ్యాన్ని, భాషా ప్రయోగ వికాసాన్ని పరిశోధకులు ఇప్పటికే చాలావరకు నిరూపించారు. వెలువడిన తెలుగు రచనలు, వాటి స్వరూప, స్వభావాలను గూర్చి చేసిన విశేషచర్చ మనకు అందుబాటులో ఉంది. సంప్రదాయ రచనల గుణగణ వివేచనం ఒకవైపు జరుగుతుండగా, కాలక్రమంలో ఆ సమాచార నిధులకు మరెంతో సమాచారం చేరుతూవస్తోంది. ఇది కావ్యాలు, శాస్త్ర గ్రంథాలు... తదితర రచనల రూపంలో ఉంది. ఇదంతా తెలుగువారి, తెలుగుభాషా సమాజంయొక్క సాంస్కృతిక వారసత్వం. తెలుగువారి సొత్తు.

వ్యక్తిగతంగానూ, వ్యవస్థాపరంగానూ తెలుగు భాషాభివృద్ధికి ఎంతో ప్రయత్నం జరిగింది. వ్యక్తులసేవ పేర్కొంటూపోవడానికి ఈ పత్రపరిమితి అడ్డువస్తున్నది. నన్నయ నుండి నేటివరకూ తెలుగు సాహిత్య సంపదను పుష్టిమంతం చేస్తున్న కవులు, రచయితలు, శాస్త్రకారులు... అందరినీ ఇక్కడ పేర్కొనవచ్చు. సంస్థలు చేస్తున్న కృషిలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు, తెలుగుభాషా సమితి, ఆంధ్ర సారస్వత

పరిషత్తు, సాహిత్య అకాడమీలతోపాటు, ఆంధ్ర రాష్ట్రంలోనూ, రాష్ట్రం వెలుపలాఉన్న కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పేర్కొనదగినవి.

భాషావసరాలు నానాటికీ పెరుగుతూనే ఉంటాయి. సమాజాల వృద్ధి, భాషల వృద్ధిపై ఆధారపడి ఉంటుందన్నది చారిత్రక సత్యం. ఇందుకు ప్రధాన కారణాలు రెండు; 1. సమాజాలు పెద్దవికావడం, 2. భాషలో పదసంపద పెరగడం. కాని, ప్రధాన భాషా వనరులుగా ఉంటూ, బహుధా విభజనకు అవకాశం కల్పించే సంప్రదాయ రచనలకు కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. ఉదాహరణకు; సంప్రదాయ రచనలన్నీ కేవలం చదువుకోడానికి సహకరిస్తాయి. వీటిని 'వినే' అవకాశం లేదు. ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే! ఈ పత్ర శీర్షికలో పేర్కొన్న సంగణకాత్మక భాషాభివృద్ధియోజనలో పైన పేర్కొన్న మినహాయింపు వంటివాటికి అవకాశం ఉండదు. బహుకోణ దృష్టితో భాషను అనుశీలించి, బహుళ ప్రయోజనకారిగా సమాచారాన్ని వివిధరూపాలలో (formats) అందుబాటులో ఉంచడానికి, ఇది వెసులుబాటును కల్పిస్తుంది. తద్వారా, భాషాభివృద్ధి యోజనలో చలనశీలతకు ప్రాధాన్యం ఇవ్వడం సాధ్యపడుతుంది. ఒక సమాజంలోని సభ్యులందరూ ఏర్పరచుకొన్న భాష, ఆ సమాజ అవసరాలను అన్నిటినీ తీర్చగలిగే దశకు చేరుకోడం అన్నది సంక్లిష్టమైన ప్రక్రియ. సంక్లిష్టతనుంచి సరళతవైపుకు సాగడానికి సంగణానువర్తనలను వినియోగించడం అన్నది ఈ కాలపు వెసులుబాటు.

## 2. భాషాభివృద్ధి: భాషాయోజన– చర్చనీయాంశాలు

తెలుగు భాషాభివృద్ధి, భాషాయోజనలకు సంబంధించి ఇప్పటివరకూ ముఖ్యంగా మూడు రంగాలచుట్టూ విశేషమైన చర్చ జరిగింది. అవి; 1. విద్యారంగం, 2. పాలనారంగం, 3. మాధ్యమరంగం. సమాజ ఉపరితల, అంతరంగ నిర్మాణాలను ప్రభావితం చేయగల ఈ రంగాలకు సంబంధించిన భాష వాడుక, భాషావనరుల వృద్ధి ఏ స్థాయిలో ఉన్నాయి? వాటి గమనమెటుపోతున్నది? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలించవలసిన ఆవశ్యకత ఉంది. అంతర్విభజనకు అమితంగా అవకాశం ఉన్న పై రంగాలకుతోడు, అంతర్జాతీయ కోణంనుంచి భాషాయోజనలో మార్పులు చేసుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఈ అగత్యాన్ని వర్తమాన 'ప్రపంచీకరణ యుగం' బహుముఖాలనుంచి హెచ్చరిస్తున్నది.

ప్రపంచీకరణ ప్రక్రియ, దాని అనువర్తన నైజంవల్ల అనేక రూపాలలో, తావులలో ప్రవర్తిల్లుతుంది. దీని ద్వారా 60, 70, 80, దశకాలలో మానవాళి పొందిన ఫలితాలకు 20వ శతాబ్ది చివరి దశకంలో– అంటే, 90వ దశకంలో పొందిన ఫలితాలకు గుర్తించదగిన వైరుధ్యం ఉంది. ఆశ్చర్యకరంగా– అప్పుడప్పుడే ఆయా సమాజాలలోని ప్రజలకు ఏర్పడిన కొత్త అనుభవాలు, ప్రపంచీకరణ పట్ల అంతకుముందు ఉన్న భావాలను తారుమారుచేశాయి. ఫలితంగా– భావాలలో, వేష–భాషలలో వైరుధ్యాలు ఏర్పడ్డాయి. ప్రపంచ దేశాలన్నిటా ప్రత్యేకంగా వేరుచేసి చూపించలేని ఒక ప్రత్యేక లోకం

రూపుదిద్దుకొంది. ఈ కొత్త లోకం సర్వ విషయాలలోనూ ప్రపంచ స్థానికీకరణను(glocalization) ప్రతిఫలిస్తున్నది అని విజ్ఞులు గుర్తించారు. ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా సంవాద పద్ధతులలో (communication systems), విద్యా వ్యవస్థలో అనేక మార్పులు కలుగుతున్నాయి. సమాజ ఉపరితల నిర్మాణంలోనూ, అంతరంగ నిర్మాణంలోనూ అత్యంత సహజం అనిపించేలా జరుగుతున్న ఈ మార్పుల కారణంగా, ప్రపంచభాషల స్థితి గతులు ఎలా ప్రభావిత మవుతున్నాయన్నది ప్రధానంగా చర్చించవలసిన విషయం.

ప్రపంచ వ్యాప్తంగా విద్యారంగంలో మార్పులకు ఉద్దేశించిన 'ప్రపంచీకరణ' అన్న అభివృద్ధి సూత్రం ఆర్థిక రంగాలను ప్రభావితం చేసే అంశంగా ఎదిగి, ప్రపంచ ముఖ చిత్రాన్ని మార్చివేయడమన్నది ఆశ్చర్యకరమైన నిజం! ఆదాన-ప్రదానాలకు భాషా శాస్త్రవేత్తలు ఇచ్చిన కారణాలను అధిగమించి, భాషల వాడుకలో మార్పులు కలుగుతుండడం ఇక్కడ గమనించవలసిన విషయం. ఆవశ్యకతాపూరణం అన్న ఒక్క లక్షణాన్ని వర్తింపజేసుకొని విద్యారంగం మొత్తంలో అనేక మార్పులు వస్తున్నాయి. ఫలితంగా- ప్రపంచంలోని ప్రజారంజక భాషే (popular language) బోధనాభాషగా స్థిరపడుతోంది. భాషా జ్ఞానాన్ని అందించే బోధనాంశాలు, సాంఘిక శాస్త్రాల జ్ఞానాన్ని అందించే బోధనాంశాలు, విజ్ఞాన/సాంకేతిక శాస్త్రాల జ్ఞానాన్నిఅందించే బోధనాంశాలు... అన్నిటా ఈ ప్రజారంజక భాషే వేళ్ళూనుకొంటున్నది.

ప్రజారంజక భాష (popular language) విషయంలో గుర్తించవలసిన విషయం ఏమంటే- సజాతీయ భాషా కుటుంబంలోని భాషల మధ్య 'వినిమయం' చెదిరిపోదం. పొరుగు భాషలతో సంగమం ఎక్కువ కావడం. స్థల, కాల అవధులను అధిగమించి తయారవుతున్న, ఈ ప్రజారంజక భాషద్వారా వ్యక్తమవుతున్న సమ్మిశ్ర భాషా లక్షణాలను భాషా శాస్త్ర దృక్పథంతో అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఆయా భాషలలో కలుగుతున్న ఈ మార్పులను అధ్యయనంచేసి, వాటి వాడకంలో వస్తున్న నూతన పద్ధతులను క్రమబద్ధం చేయగలిగే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోకపోతే, భవిష్యత్తులో - భాషా కుటుంబ విభజన సూత్రాలను పునస్సమీక్షించుకోవలసిన అవసరం కలగవచ్చు. సమాజ ఉపరితల నిర్మాణంలోనూ, అంతరంగ నిర్మాణంలోనూ భాషలకు ఉన్న ఇటువంటి ఘనిష్ఠమైన సంబంధాన్ని, ఈ నేపథ్యాల నుంచి చర్చించి, అభివృద్ధి యోజనను మనం రూపొందించుకోవలసి ఉంది. ఇందుకు సంగణకాత్మక భాషాభివృద్ధి యోజన సహేతుకమైన, తార్కికమైన పరిష్కార మార్గంగా భావించవచ్చు.

## 3. ఎలక్ట్రానిక్ వనరుల నిర్మితి, ప్రయోజనాలు

సంగణకాత్మక భాషాభివృద్ధియోజనలో అత్యంత కీలకమైన అంశం సమాచార నిధులన్నీ(వివిధ కాలాలకు సంబంధించిన కావ్యాలు, గ్రంథాలు, రచనలు... మొదలైనవి) ఎలక్ట్రానిక్ రూపంలో పరిశోధకులకు అందుబాటులో ఉంచడం. ఎలక్ట్రానిక్ రూపంలో నిక్షిప్తంచేసిన సమాచార నిధులు,

సంగణకం లేదా సమాచార నిక్షిప్త సాధనాల (సి.డి.లు, మెమరీ స్టిక్‌లు, ...) లో భద్రపరచబడి, సంగణకంద్వారా చూడడానికి, వినియోగించుకోడానికి అనుగుణమైన అవకాశాన్ని ఇస్తాయి.

సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పుల కారణంగా ఇప్పుడు ఎలక్ట్రానిక్ రూపంలో వినియోగంలో ఉన్న సమాచార నిధుల సంఖ్య, వాటిలో వైవిధ్యం ఎక్కువగానే ఉంది. పామ్‌టాప్ లు, నోట్ బుక్‌లు మొదలైన సంక్షిప్తీకృత ఎలక్ట్రానిక్ వస్తుసంచయంలోనూ, మొబైల్‌ఫోన్లలోనూ ఎలక్ట్రానిక్ రూపంలోని సమాచార నిధులలోని సమాచారాన్ని ఇప్పుడు వినియోగించుకోవచ్చు. మార్పులకు, చేర్పులకు అనుగుణమైన రీతిలో అందుబాటులో ఉన్న ఇటువంటి సమాచార నిధుల వినియోగం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నది.

ఎలక్ట్రానిక్ రూపంలో భాషా వనరులను అభివృద్ధి చేయడం అన్నది భారతీయ భాషలకు 60, 70 దశకాలలోనే ప్రారంభమైనా, వేగం పుంజుకొన్నది మాత్రం 90వ దశకం తర్వాతనే! ఈ పత్రంలోని ఉపవిభాగం-2లో సూచించిన అంశాలతోపాటు, పరిశోధనలకోసం, వివిధ అవసరాలకోసం నిర్మించిన ఇటువంటి సమాచార నిధులు ప్రస్తుతం అంతర్జాలం(internet)లో ప్రపంచవ్యాప్తంగా భాషాభిమానులకు, పరిశోధకులకు అందుబాటులో ఉన్నాయి. అయితే, ఇవి అన్నీ ఏకరూపతను కలిగి లేవు. ఎలక్ట్రానిక్ రూపంలో అందుబాటులో ఉన్న సమాచార నిధులన్నిటిలోనూ ఏక రూపత సాధనకు అనుగుణమైన ఫాంట్లను, కన్వర్టర్లను మనం ఏర్పర్చుకోవలసిఉంది. ఎలక్ట్రానిక్ సమాచార నిధుల ప్రయోజనాలు విస్తృతమైనవి. కొన్నిటిని ఇక్కడ గమనిద్దాం.

3.1 ఎలక్ట్రానిక్ సమాచార నిధులవాడకానికి పైన చెప్పుకొన్నట్టుగా ఏదో ఒక సాధనం (సంగణకం/పామ్ టాప్/నోట్‌బుక్...) అవసరం. ఎలక్ట్రానిక్ సమాచారనిధుల వాడకంలో సౌకర్యం ఎక్కువ.

3.2 సంప్రదాయ ముద్రణ రూపంలో ఉన్న సమాచార నిధులకు ఉండే స్థల పరిమితి ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న సమాచార నిధులకు ఉండదు.

3.3 సంప్రదాయ ముద్రణ రూపంలో ఉన్న సమాచార నిధులకు ఉండే పరిమాణపరిమితి (పుటల సంఖ్య... గ్రంథ పరిమాణం. . .) ఎలక్ట్రానిక్ సమాచార నిధులకు ఉండదు.

3.4 ఎలక్ట్రానిక్ సమాచార నిధులు నిరంతరం నవీకరణకు అవకాశాన్ని ఇస్తాయి. సంప్రదాయ ముద్రణ గ్రంథాల నవీకరణ బహు క్లిష్ట సాధ్యం. సమయం, ఆర్థిక వనరులు... ఇత్యాది అంశాలు ఇక్కడ ప్రధాన అడ్డంకులుగా ఉంటాయి.

3.5 సంప్రదాయ ముద్రణ సమాచార నిధులకు ఉండే కాల పరిమితి ఎలక్ట్రానిక్ సమాచార నిధులకు ఉండదు. విశ్వవ్యాప్తంగా ఉన్న వినియోగదారులందరికీ ఏక కాలంలో అందుబాటులో ఉంటాయి.

3.6 ఒక విషయంపై ఎలక్ట్రానిక్ సమాచార నిధులను అందరూ ఒకేచోట కూర్చుని వృద్ధి చేయనవసరంలేదు. నిర్మితికి సంబంధించిన అవగాహన, పథకరచన, లక్ష్యాలు... తెలిస్తే చాలు. ప్రపంచంలో ఎక్కడినుంచైనా ఎలక్ట్రానిక్ సమాచార నిధులను తయారు చేసి అందుబాటులోకి తీసికొనిరావచ్చు.

3.7 ఎలక్ట్రానిక్ సమాచార నిధులు ఒక రంగానికి (field), విషయానికి(subject) పరిమితమైనవి కావు. – అంటే ఏకకాలంలో వివిధ రంగాలకు, వివిధ అంశాలకు సంబంధించిన సమాచార నిధులను రూపొందించవచ్చు.

3.8 పుటల పరిమాణం, సమాచార పరిమాణం అన్నవి ఎలక్ట్రానిక్ సమాచారనిధుల విషయంలో సమస్యలుకావు.

3.9 ఎలక్ట్రానిక్ సమాచార నిధులలో కావల్సిన సమాచారాన్ని వెతికిపట్టుకోడం చాలా సులభం.

3.10 ఎలక్ట్రానిక్ సమాచార నిధులలో అదనపు సమాచారాన్ని చేర్చడం, అర్థ వివరణలను కూర్చడం, నవీకరరించడం... మొదలైన పనులను నిరంతరం చేయవచ్చు. సంప్రదాయ ముద్రణ సమాచార నిధులు ఏభై సంవత్సరాల వ్యవధిలో పది ముద్రణలు పొందితే, ఎలక్ట్రానిక్ సమాచార నిధులు కొన్ని నెలల వ్యవధిలో కొన్ని వందల నవీకరణలు పొందుతాయి.

3.11 వినియోగదారుల వినియోగ సందర్భానికి తగిన ఎలక్ట్రానిక్ సమాచార నిధులను రూపొందించడం తేలిక.

3.12 ఎలక్ట్రానిక్ సమాచార నిధులలో అదనపు సమాచారాన్ని చేర్చడం, అర్థ వివరణలను కూర్చడం, నవీకరరించడం... మొదలైన పనులద్వారా సమాచార నిధి పరిమాణాన్ని వినియోగదారుని అవసరానికి అనుగుణంగా పెంచుకోవచ్చు. తగ్గించుకోవచ్చు.

3.13 ఒక భాషలో రూపొందించిన సమగ్ర ఎలక్ట్రానిక్ సమాచార నిధుల ఆధారంగా ద్వి, త్రి, బహుభాషా సమాచార నిధులను తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో, మానవవనరుల అర్థవంతమైన శక్తి వినియోగంతో అనువదింపచేసి అందుబాటులోకి తేవచ్చు.

3.14 ఎలక్ట్రానిక్ సమాచార నిధులను, భౌతికంగా ఒక చోటునుంచి మరోచోటుకు తీసుకువెళ్ళవలసిన అవసరం ఉండదు. అంతర్జాలాన్ని(internet) వినియోగంలోకి తేగల సంగణకం లేదా ఎలక్ట్రానిక్ పరికరం అందుబాటులో ఉంటే చాలు.

3.15 ఇప్పటికే అందుబాటులో ఉన్న సంప్రదాయ ముద్రణ సమాచార నిధులను నవీకరించి, సమగ్ర ఎలక్ట్రానిక్ సమాచార నిధులను తయారు చేయడంలో వేగాన్ని పెంచవలసిఉంది.

## 4. అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులోఉన్న తెలుగు ఎలక్ట్రానిక్ సమాచార నిధులు

అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులోఉన్న బ్లాగులు, ఆన్ లైన్ జర్నళ్ళు, వివిధ సంస్థల, కార్యాలయాల, విశ్వవిద్యాలయాల సమాచారం... మొదలైనవన్నీ దీనికి ఉదాహరణలే! భారతీయ భాషా కేంద్ర సంస్థ (www.ciil.org) వంటి URLsలో కనిపించే తెలుగు ఎలక్ట్రానిక్ సమాచార నిధులు ముందు పేర్కొన్న సమాచారనిధులకన్నా భిన్నమైనవి. పైన ఉపవిభాగం-2లో పేర్కొన్న విశేష లక్ష్యాల సాధనకు ఈ సమాచారం పనికివస్తుంది.

వివిధ లక్ష్యాలు, ఆకాంక్షలు, ఊహలతో (!) రూపొందించి అందుబాటులో ఉంచిన తెలుగు సమాచార నిధులను, పాఠకులు అంతర్జాలంలో google... వంటి శోధన యంత్రాలను ఉపయోగించి గమనించవచ్చు. వీటిలో కొన్నిటిని యథాతథంగానూ, మరికొన్నిటిని మన అవసరాలకు అనుగుణంగానూ మార్చుకొని వినియోగించుకోవలసి ఉంది. ఉదాహరణకు; అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులోఉన్న తెలుగు-తెలుగు-ఇంగ్లిషు నిఘంటువులకు ఆంధ్రభారతి సంప్రదించదగిన ఒక సమాచార నిధి. (ఆకరాలలోని URL-1 చూడండి). ఇది శబ్దరత్నాకరం, బ్రౌణ్య తెలుగు-ఇంగ్లిషు నిఘంటువు, శంకర నారాయణ తెలుగు-ఇంగ్లిషు నిఘంటువు... వంటి 16 నిఘంటువుల సమాహారం. దీనిలో పదాన్ని శోధించుకొనే వెసులుబాటు ఉంది. మనకు కావలసిన పదాలకు అర్థవివరణలను నిర్ణీత నిఘంటువునుంచి కోరుకొంటున్నామా? లేక అన్ని నిఘంటువులనుంచీ తెలిసికోవాలనుకొంటున్నామా? అన్నది ఎంచుకొనే సౌలభ్యంఉంది. అలాగే పదంలో కొంతభాగం తెలిసినా ఆ వర్ణక్రమంలో ఉన్న పదాలన్నిటినీ ఇది వెతికి చూపిస్తుంది. ఇటువంటి నిఘంటు వనరులను సమగ్ర ఎలక్ట్రానిక్ తెలుగు నిఘంటువు రూపొందించుకోడంలో వినియోగించుకోవచ్చు. ఇలాగే సమగ్ర, ఏకరూప సమాచార నిధులను

తయారుచేసికోడానికి వీలుగా అంతర్జాలంలో వివిధ తావులనుంచి సమాచారనిధులను నిర్మించవలసిన అవసరం ఉంది. ఇలా నిర్మించిన సమాచార నిధుల ఆధారంగా భాషాభివృద్ధిని క్రమపద్ధతిలో గుర్తించగలుగుతాం. వర్తమాన, భవిష్యదవసరాలకు అనుగుణమైన భాషాయోజనను రూపొందించుకోగలుగుతాం.

## 5. సంగణకాత్మక భాషాభివృద్ధి యోజన నమూనా

ఉపవిభాగాలు 2, 3, 4లలో చర్చించిన అంశాలు తెలుగు భాషకు ఒక సమగ్ర సంగణకాత్మక భాషాభివృద్ధి యోజనను రూపొందించుకోవలసిన ఆవశ్యకత తెలియజేస్తాయి. ఆధునిక కాలంలో– మరీముఖ్యంగా, ఇటీవలి కాలంలో వచ్చిన సామాజిక మార్పులు, భాషావ్యవహారంలో వచ్చిన భేదాలు, అధ్యయనాంశాలు, సామాజిక రంగాలు... దీని అవసరాన్ని మరింతగా చాటుతున్నాయి. తమభావాలను స్వీయాభివ్యక్తులలో వ్యక్తం చేయాలన్నభాషా వ్యవహర్తల కాంక్ష, ప్రాంతీయ చైతన్యం... మొదలైన అంశాలు ఒకవైపూ, సంగణకాలు, ఇంటర్ నెట్... వంటి సౌకర్యాలు మరోవైపూ ఈ భావనను వృద్ధి చేస్తున్నాయి. సాధారణ విషయాలుగా భావించి ఇటువంటి కారణాలను కొట్టివేయడానికి వీలులేదు.

తెలుగు భాషకు సంగణకాత్మక భాషాభివృద్ధి యోజనను రూపొందించుకోడానికి– (1) అందుబాటులో ఉన్న సంప్రదాయ ముద్రణ సమాచార నిధులు, (2) అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ సమాచార నిధులు ప్రధాన ఆకరాలు. వీటితోపాటు మరిన్ని విస్తృతప్రయోజనాలను ప్రదర్శించే తెలుగు సమాచార నిధులను (ఎలక్ట్రానిక్ రూపంలో అందుబాటులో ఉన్న) కూడా ప్రధాన ఆకరాలుగా స్వీకరించాలి.

భాషా ప్రయోగరంగాలలో ప్రధానమైన ఏ ఒకటి, రెండు రంగాలకు సంబంధించిన సమాచార నిధులతోనో ఈ పనిని ప్రారంభించవచ్చు. భాష ప్రవర్తిల్లే రెండు ప్రధాన మార్గాలు– మౌఖిక, లిఖిత పద్ధతులను రెంటినీ దీనిలో సమన్వయించే వెసులుబాటును కూడా కల్పించుకోవచ్చు. సంప్రదాయ ముద్రణ పద్ధతిలో కాకుండా ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులకు అనుగుణంగా ఉండేట్టుగా, చలనశీల సమాచార నిధులుగా వీటిని రూపొందించుకోవాలి. బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడగల సమగ్ర ఎలక్ట్రానిక్ తెలుగు సమాచార నిధుల నిర్మితి ఏ రకంగా సమగ్ర సంగణకాత్మక భాషాభివృద్ధి యోజనకు సహకరించగలదో కింది రేఖాచిత్రం పరిచయమాత్రంగా చూపుతుంది.

సమగ్ర తెలుగు సమాచార నిధి

↓

పఠనయోగ్య, శ్రవ్యయోగ్య సమాచార నిధి

↓

చలనశీల (ఆన్ లైన్) పఠనయోగ్య, శ్రవ్యయోగ్య సమాచార నిధి

↓

ఆన్ లైన్ లో రాయడం, చదివినదానిని రికార్డుచేసి అప్‌లోడ్ చేయడం మొదలైన పనులు

నిర్వహించడానికి కావలసిన సదుపాయాలు/టూల్స్/అప్లికేషన్స్... అందుబాటులో ఉంచడం.

↓

పరిశోధకులు / వ్యవహర్తలు / ఆన్ లైన్ చర్చాబృందాలు

↓

చారిత్రక/ప్రాంతీయ/సాంఘిక భాషా వ్యవహారాలకు సంబంధించిన ప్రత్యేక/సమగ్ర సమాచార తయారీ

↓

వృత్తి/వర్గ, ఇతర పదకోశాలు, సమాచార నిధులు (వివిధ వృత్తులు, కులాల ఆధారంగా)

↓

మౌఖిక-లిఖిత, గృహ-బహిరంగ, విద్యావంతుల-అవిద్యావంతుల,

పిన్నల-పెద్దల, స్త్రీ-పురుష... మొదలైన వ్యవహార భేదాలను ప్రతిబింబించే కోశాలు, సమాచార నిధులు

↓

మాండలిక నిఘంటువులు-1, 2, 3, 4.../ మాండలిక సమాచార నిధులు

చారిత్రక, ప్రాంతీయ, సాంఘిక భేదాలతో కలిపీ, వేరుగానూ

నిఘంటు వనరులు, సమాచార నిధులు ...

ఈ సరళ-సంక్లిష్ట నిర్మాణాలను అర్థం చేసికొని తెలుగు వ్యవహర్తలందరికీ వారి దైనందిన, ప్రత్యేక భాషావసరాలను తీర్చగల 'సంగణకాత్మక భాషాభివృద్ధి యోజన' రూపొందించుకోడం మాత్రం నేటి అవసరం.

## 6. ఉపయుక్త (సంక్షిప్త ) గ్రంథ/రచనల/ఆకర సూచి

### 6.1 తెలుగు


6.1.1 కృష్ణమూర్తి, భద్రిరాజు. 1962. మాండలిక వృత్తిపదకోశం. ప్రథమ సంపుటం-వ్యవసాయపదాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6.1.2 ___________ (సం.) 2010. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

6.2. పత్రం

6.2.1 పవన్ కుమార్, పమ్మి. 2012. సంగణకాత్మక తెలుగు మాండలిక నిఘంటు నిర్మాణం. తెలుగు అంతర్జాతీయ రెండో అంతర్జాల సదస్సులో సమర్పించిన పత్రం. నవంబరు 1-2, 2012. గీతం విశ్వవిద్యాలయం: విశాఖపట్టణం.

6.3 **English**

6.3.1 Bastardas-Boada, Albert. 2002. *World Language Policy in the era of Globalization: Diversity and Intercommunication from the Perspective of Complexity.* Noves SL, Revista de Sociolinguistics: Barcelona.

6.3.2 Bhagwati, Jagdish. 2004. *In Defense of Globalization*. Oxford. New York: Oxford University Press.

6.3.3 Fernando, Salvetti (ed). 2010. *Glocal Working. Living and Working across the Wrold with Cultural Intelligence.* Milan: Franco Angeli.

6.3.4 Gulette, Margaret M. 1982. *The Art and Craft of Teaching.* Cambridge, MA: Harvard University Press.

6.3.5 Krishnamurti, Bh. 1998. *Language Planning and Development* in *Language, Education and Society,* New Delhi: Sage Publications.

6.3.6 Oller, John W., Jr. 1983. *Methods That Work*. New York: Newbury House.

**6.4 URL:**

http://www.andhrabharati.com/dictionary/index.php

(ప్రపంచ తెలుగు సదస్సు-4లో సమర్పించిన పత్రం. 27-29 డిసెంబరు, 2012. తిరుపతి. ఆంధ్ర ప్రదేశ్.)

≻≻≻≻≺≺≺≺

## 12. ఎలక్ట్రానిక్ ద్విభాషా ద్వైదార్శనిక నిఘంటు నిర్మాణం: తెలుగు, కన్నడ

'దేశమైనా చూడు కోశమైనా చూడు' అని ఒక నానుడి వాడుకలో ఉంది. ఏకధ్రువ, భిన్నధ్రువ లక్షణాలను ఏకకాలంలో దర్శించగలుగుతున్న ప్రస్తుత కాలంలో ప్రపంచ జ్ఞానానికి అనేక వనరులపై ఆధారపడవలసి ఉంది. నిరంతరం మార్పులు చెందుతూ ఉన్న సమాజాలను వాటిద్వారా వెలుగు చూస్తున్న విజ్ఞానాన్ని పొందాలంటే ఆయా భాషల పరిజ్ఞానం తప్పనిసరి. విజ్ఞానం ఎక్కడ వెలుగు చూస్తున్నదో ఆ దేశ భాషలలో వెలువడుతున్న విషయాలను ఆయా భాషలలోనే సంభావించగలిగే వెసులుబాటు ప్రపంచంలోని ఏ భాషా వ్యవహర్తకైనా తక్కువ. ఈ కారణం వల్ల సమాచార నిధులను ఎవరి మాతృభాషలలోకి వారు అనువదించుకోవడం ఒక అవసరం. ఇందుకు అమితంగా సహకరించేవి నిఘంటువులు.

ఒకవైపు నిఘంటువుల రూపకల్పన, మరోవైపు అనువాదం సమాంతరంగా జరగవలసిన అత్యంత ఆవశ్యకమైన కార్యాలు. ఈ కోణంనుంచి చూసినపుడు, ఇప్పటి ప్రపంచీకరణ యుగంలో ద్విభాషా నిఘంటువుల ఆవశ్యకత ప్రతి భాషాసమాజంలోనూ ఎంతో ఉంది. ఇందుకు సహకరించే సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుతం మనకు అందుబాటులో ఉంది. పద రూపాలలో, అర్థాలలో సారూప్య సంబంధాలు కలిగిన భాషల మధ్య పరిశోధన కావించి ఏక కాలంలో ద్వి, త్రిభాషా నిఘంటువులను తయారు చేసుకోడం ఇప్పుడు సాధ్యం. ఈ కోణం నుంచి తెలుగు-కన్నడ భాషలకు ఒక సమగ్ర ఎలక్ట్రానిక నిఘంటువును నిర్మించడానికి సంబంధించిన చర్చకు ఈ పత్రం పరిమితమవుతున్నది.

### 1. ఎలాక్ట్రానిక్ నిఘంటువు

ఆధునిక కాలంలో ఎలాక్ట్రానిక్ నిఘంటువుల రూపకల్పన, వాడకం పెరిగింది. సంగణకాల (computers) వినియోగం పెరిగిన తర్వాత వీటి వాడకంలో సౌలభ్యం కూడా పెరిగింది. కావాల్సిన సమాచారాన్ని సులభంగా పొందగలిగే వీలు ఉండడం వీటికి ఉన్న బలం. సంప్రదాయ ముద్రణ నిఘంటువుల మాదిరిగా ఆరోపాలను వెతికి, అర్థాలను గ్రహించడంలో ఉన్న శ్రమ ఎలాక్ట్రానిక్ నిఘంటువుల వాడకంలో ఉండదు. అంతర్జాలం అందుబాటులో ఉంటే స్థల, కాల అవధులను కూడా ఎలాక్ట్రానిక్ నిఘంటువులు అధిగమించగలుగుతాయి. అందుకే అవసరానికి అనుగుణంగా అటు సంప్రదాయ ముద్రణ పద్ధతిలోనూ, ఇటు ఎలాక్ట్రానిక రూపంలోనూ ఏక, ద్వి, బహు భాషానిఘంటువులను రూపొందించుకోవలసిన అవసరం ఉంది.

## 2. ఎలాక్ట్రానిక్ ద్విభాషా ద్వైదార్శనిక నిఘంటు నిర్మాణం, ప్రయోజనాలు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం నిఘంటు నిర్మాణంలోని భౌతిక శ్రమను గణనీయంగా తగ్గించి వేసింది. ఏక భాషా నిఘంటువును కూర్చడానికి వెచ్చించే భౌతిక శ్రమ, సమయం, వనరుల సహాయంతో ఇప్పుడు ద్వి, త్రి, బహు భాషా నిఘంటువులను కూర్చవచ్చు. భాషల సంఖ్యపై ఆధారపడి అందుకు తగిన బౌద్ధిక శ్రమను మాత్రం నిఘంటుకారుడు చేయవలసి ఉంటుంది. దీనిని కేవలం, నిఘంటుకారుల ద్వి, బహు భాష పరిజ్ఞానాన్ని పరీక్షించేదిగానూ, పెంపొందించేదిగానూ చూడనక్కర్లేదు. బహు భాష వ్యవహార ప్రాంతాలున్న మన దేశం వంటి దేశాలలో ఏక కాలంలో రెండు వేర్వేరు భాషలు వ్యవహారంలో ఉన్న ప్రాంతాలకు, ఒక సమాచార నిధిని పంపడానికి అవకాశంగా భావించాలి. ఇందువల్ల దేశి భాషల వినియోగం పెరుగుతుంది. వివిధ దేశి భాషలను నేర్చుకొనే అవకాశం లభిస్తుంది. భాషల వ్యాప్తి అధికమవుతుంది.

ఒక మూల భాష నుంచి సమాచారాన్ని మన మాతృభాషలోకి అనువదించుకునే క్రమంలో ఇతర దేశి భాషలకుకూడా కలుగుతున్న ప్రయోజనాన్ని అనువాదకులు గమనించకపోవచ్చు. నిఘంటు కర్తలు వీటిని జాగ్రత్తగా గమనించాలి. ఉదాహరణకు తెలుగు-కన్నడ భాషలలో ఇటువంటి సామాన్య పదజాలం చాలా ఎక్కువ. ఒక తెలుగు వ్యవహర్త, ఒక కన్నడ వ్యవహర్త వారి వారి మాతృభాషలలోనే ఒకచోట సంభాషించుకున్నా మొత్తంగా విషయం అర్థం కావడానికి భాష అడ్డంకి కాదన్నది సులభంగా గ్రహించగలుగుతాం. రెండు భాషలలోని సామాన్య పదజాలంలో, అర్థంలో భేదం లేనప్పుడు ఆ రెండింటికి కలిపి నిఘంటు వనరులను కూర్చుకోవడం ఒక గుర్తించదగిన, ఔచితీమంతమైన కార్యం. ఈ వనరులను వినియోగించుకొని ఈ రెండు భాషలలోను అనువాదాలు చేయడం సులభం. సాహిత్య, సాహిత్యేతర అనువాదాలకు ఈ విధమైన పద పట్టికలు, నిఘంటు వనరులను తెలుగు, కన్నడ భాషలకు కలిపి ఏర్పరుచుకోవడం పెద్ద కష్టం కాదు. సంప్రదాయ నిఘంటువులకు ఉన్న స్థల, కాల, పరిమాణ పరిమితులు ద్విభాష ఎలాక్ట్రానిక ద్వైదార్శనిక నిఘంటువులకు ఉండవు.

ఎలాక్ట్రానిక్ నిఘంటువులకు ఉన్న మరొక ప్రధానమైన వెసులుబాటు నిరంతరం నవీకరణకు అవకాశం ఉండడం. స్థల అవధి ఇక్కడ చర్చనీయాంశం కాదు. కాబట్టి భిన్న ప్రాంతాలనుంచి నిఘంటు కర్తలు రెండు భాషలకూ తగిన నిఘంటు వనరులను రూపొందించవచ్చు. రెండు భాషలలోని వివిధ రంగాలకు(Fields), వివిధ అంశాలకు(Subjects) సంబంధించిన నిఘంటువులను రూపొందించవచ్చు. ఆరోపాలను వెతికి అర్థాన్ని గ్రహించే సమయంలో రెండవ భాషలో ఉన్న సమానార్థ ఆరోపం, దానికి ఉన్న అర్థంలోని సమరూప, సమానార్థకతలను వ్యవహర్త తేలికగా సంభావించగలుగుతాడు. ఇందుకోసం ద్విభాషా నిఘంటువుల రూపకల్పనలో పాటించదగిన ప్రమాణ

పద్ధతి ద్వైదార్శనిక (Bi-directional) పద్ధతి. ఈ రకంగా తెలుగు వ్యవహర్తలకు కన్నడం, కన్నడ వ్యవహర్తలకు తెలుగు నేర్చుకోవడం సులభం అవుతుంది.

ఎలక్ట్రానిక నిఘంటువులు నిరంతర నవీకరణకు అవకాశం కల్పించేవిగా ఉంటాయి కాబట్టి, నూతన ఆరోపాలను చేర్చడం, అర్థవివరణలను కూర్చడం మొదలైన పనులను ఎప్పటికప్పుడు చేయవచ్చు. ఒక ఆరోపానికి ఉన్న భిన్న అర్థ ఛాయలలో వినియోగ సందర్భానికి తగిన అర్థమేది? అన్నది సందర్భంపై ఆధారపడి ఉంటుంది. ద్విభాషా ద్వైదార్శనిక నిఘంటువులలో ఇక్కడ విశేషమైన చర్చ అవసరమవుతుంది. రూపకల్పన సమయంలో ఎంచుకొంటున్న సమాచార నిధులు ఎంత పెద్దవిగా ఉంటే- ఇటువంటి సమస్యలు - అంత తక్కువగా వస్తాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న తెలుగు-కన్నడ నిఘంటువులను సంగణీకరించి సమగ్ర ఎలక్ట్రానిక ద్విభాషా నిఘంటువును రూపొందించవచ్చు. వివిధ రంగాలకు(Fields), వివిధ అంశాలకు(Subjects) సంబంధించిన సమగ్ర ఎలక్ట్రానిక సమాచార నిధులను రెండు భాషలలోనూ తయారు చేసి వాటినుంచి వివిధ అవసరాలకు అనుగుణంగా పద పౌనః పున్యం (Word Frequency) ఆధారంగా ఇటువంటి నిఘంటువులను కూర్చవచ్చు.

## 3. అందుబాటులో ఉన్న ఎలాక్ట్రానిక్ తెలుగు-కన్నడ నిఘంటువులు

కింద సూచించిన అంతర్జాల ఆకర లంకెలలో తెలుగు-కన్నడ, కన్నడ-తెలుగు నిఘంటు వనరులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

(i) http://glosbe.com/te/kn/

(ii) http://www.fileguru.com/apps/telugu_to_kannada_dictionary

(iii) http://ptf.com/telugu/telugu+kannada+dictionary/

(iv) http://www.edaboard.com/thread132859.html

పైన సూచించిన లంకెలలో అందుబాటులో ఉన్న నిఘంటువుల వాడకంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా చర్చించదగినవి;

(i) పదాలను రాసే క్రమం (వర్ణ క్రమం)
(ii) పదాల, పదబంధాల నిర్ణయం
(iii) పదం లేదా పదబంధం వాడుతున్న సందర్భానికి సంబంధించిన అస్పష్టత
(iv) రెండు భాషలలోని భాషాభాగ నిర్ణయ పద్ధతిలో అసమగ్రత (అర్థ అసమగ్రత, విషయ విపులీకరణలో అసమగ్రత).

అంతర్జాలంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న తెలుగు-కన్నడ, కన్నడ-తెలుగు నిఘంటువులలో పైన సూచించినవి కొన్ని మాత్రమే.

## 4. ఎలాక్ట్రానిక్ ద్విభాషా ద్వైదార్శనిక నిఘంటు నిర్మాణం : ప్రమాణాలు

### 4.1 అకారాది క్రమం

నిఘంటువులలోని ఆరోప పదాలను ఇవ్వడంలో పాటించే అకారాది క్రమంలో- ఒక్క తెలుగు విషయంలోనే మూడు, నాలుగు పద్ధతులు అమలులో ఉన్నాయి. అవి;

(i) అ, అం, ఆ, ఆం... క్రమంలో ఆరోపాలను కూర్చడం.
(ఉదాహరణకు- తెలుగు వ్యుత్పత్తి కోశం - ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రచురణ)

(ii) అం, ఆం... అ, ఆ... వరుసలో ఆరోపాలను కూర్చడం.
(ఉదాహరణకు- తెలుగు-ఇంగ్లీషు డిక్షనరి, శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు)

(iii) అం, ఆం... మొదలైన వాటితో ప్రారంభమయ్యే ఆరోపాలలోని అనుస్వారాన్ని స్పర్శాల ముందు ఐదు విధాలైన అనునాసిక వ్యాప్తిలో ఏదో ఒక వ్యాప్తిని సూచిస్తూ ఆరోపాలను కూర్చడం. (ఉదాహరణకు- తెలుగు-తెలుగు నిఘంటువు -తెలుగు అకాడమి ప్రచురణ).

(iv) స్పర్శేతర హల్లులకు సంబంధించిన క్రమంలో అంతరాలు. య, ర, ల, వ, శ, ష, స, హ ల ముందు వచ్చే అనుస్వారాన్ని ప్రత్యేక అక్షరంగానూ, 'మ' గానూ గుర్తించడం.
(ఉదాహరణకు- తెలుగు వ్యుత్పత్తి కోశం - ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రచురణ).

అకారాది క్రమంలో ఆరోపాలను కూర్చడంలో ఒక్క భాషలోనే ఇన్ని పద్ధతులు ఉండడం ద్వైదార్శనిక ద్విభాషా నిఘంటువుల నిర్మాణంలో సమస్యలను పెంచుతాయి. వర్ణసంఖ్య, వర్ణక్రమం మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకొని తెలుగు, కన్నడ భాషలకు సరిపోయే విధంగా ఒక ప్రమాణ పద్ధతిని ఎంపిక చేసికోవాలి. తెలుగు, కన్నడ భాషలకు పైన సూచించిన వర్ణక్రమ పద్ధతుల్లో రెండో పద్ధతి బాగా సరిపోయే పద్ధతి.

### 4.2 ఆరోపాల ఎంపిక

ఈ పత్రంలోని పై విభాగాలలో చర్చించినట్లుగా, వివిధ రంగాలకు(Fields), వివిధ అంశాలకు(Subjects) సంబంధించిన సమాచార నిధులను తెలుగు, కన్నడ భాషలకు వేర్వేరుగా కూర్చి ఆరోపాలను ఎంపిక చేసుకోవచ్చు. ప్రాధాన్య వివక్షను అనుసరించి వీటినుంచి వ్యవహార పదజాలాన్ని

వేరుచేసి వాటికి రెండు భాషల్లోనూ ద్విదార్శనిక(Bi-directional) పద్ధతిలో అర్థవివరణలను కూర్చవచ్చు. అందుకు కింద సూచించిన పద్ధతులను పాటించవచ్చు.

(i) ఇప్పటికే తెలుగు, కన్నడ భాషలకు వేర్వేరుగా అందుబాటులో ఉన్న నిఘంటు వనరుల నుంచి ఆరోపాలను గ్రహించి వాటికి అదనపు అర్థవివరణలను కూర్చవచ్చు.

(ii) ఇప్పటికే సిద్ధంచేసిన తెలుగు-కన్నడ, కన్నడ-తెలుగు నిఘంటువులలోని ఆరోపాలను గ్రహించి వాటికి అదనపు అర్థవివరణలను కూర్చవచ్చు.

(iii) తెలుగు వ్యవహార ప్రాంతంలోనూ కన్నడ వ్యవహార ప్రాంతంలోనూ ఉన్న భాషలోని మాండలికాలకు కూడా ఈ నిఘంటువులో భాగం చేయవచ్చు. తెలుగు వ్యవహార ప్రాంతంలో పూర్వ, దక్షిణ, ఉత్తర, మధ్య అన్న భాషా మండలాలు ఉన్నట్టే, కన్నడ వ్యవహార ప్రాంతంలో స్థల మాండలికాలు ఉన్నాయి. ధార్వాడ కన్నడ, మైసూరు కన్నడ, మంగుళూరు కన్నడ, గుల్బర్గ కన్నడ, కోత కన్నడ... మొదలైన విభాగాల నుంచి ఆరోప పద సేకరణ జరపాలి. రెండు భాషల వ్యవహార ప్రాంతంలోనూ అనేక కులాల, వృత్తుల మాండలికాలు ఉన్నాయి. వీటి నుంచి పదజాలాన్ని గ్రహించి ఆరోప పదాలుగా ఎంపిక చేసి అర్థవివరణలు కూర్చవచ్చు.

(iv) ఇలా సేకరించి సంగణీకరించిన సమాచారం మొత్తంలోని పదాల పౌనః పున్యం ఆధారంగా ఆరోపాలను నిఘంటువులలో భాగం చేయవచ్చు. నిఘంటు నిర్మాణ ప్రయోజనం, కాలం, నిఘంటు కర్తల సంఖ్య, భౌతిక వనరులు, బౌద్ధిక శ్రమ, లక్షించిన వినియోగదారులు, ఉద్దేశించిన రంగం(Field), ఉద్దేశించిన విషయం(Subject)... మొదలైన అంశాలపై ఆధారపడి ఆరోపాల సంఖ్యను నిర్ణయించవచ్చు.

## 4.3 భాషాభాగ నిర్ణయం

నామవాచకం, క్రియ, సర్వనామం, సంఖ్యావాచకం, అవ్యయం, విశేషణం, క్రియా విశేషణం అన్న ప్రాథమిక వింగడింపుతో ఈ పనిని ప్రారంభించవచ్చు. మినహాయింపులను రెండు భాషలలోని సమాచార నిధులపైనా, వాక్య, అర్థనిర్మాణ సంబంధాలపైనా ఆధారపడి మలివిడతలలో పరిష్కరించవచ్చు.

### 4.3.1 నామవాచకాలు

1. అభినయం = అభినయ, నటన.
2. అబినందన = అబినందన, ప్రశంస.
3. కారం = ఖారం
4. పలక = ఫలకం, పట్టి.

### 4.3.2 క్రియలు

1. అభ్యసించు = అభ్యసించు, అభ్యాసమాడు.
2. అమరు = సరిగూడు
3. కుంటు = కుంటు

### 4.3.3 సర్వనామాలు

1. వీటి = ఇవర
2. వీడి = ఇవన
3. వీడు = ఇవను
4. వీని = ఇవ

### 4.3.4 సంఖ్యావాచకాలు

1. ఒకటి = ఒందు
2. మూడు = మూరు
3. అరవై = అరవొత్తు
4. మూడు వందలు = మున్నూరు

### 4.3.5 అవ్యయాలు

1. అయినా = ఆదరునూ
2. కదా = అలవా
3. మూలకంగా = మూలక
4. కిలకిల = కిలకిల

### 4.3.6 విశేషణాలు

1. అయిష్టం = ఇష్టవల్లద
2. పాడు = పాళు , నాశ , నష్ట.
3. అను = యెంబ, ఎన్నువ.

### 4.3.7 క్రియా విశేషణాలు

1. మేర = మేర, గడి, మితి.
2. అటు = అల్లి
3. కింద = అడి, కళగ.
4. క్రితం = గత, ఒంద.

పై భాషాభాగాల వర్గీకరణలోని ఆరోప పదాలు వాటి అర్థాలను తెలుగు-కన్నడ నిఘంటువు (2004) నుంచి స్వీకరించాం. ఈ ఆరోప పదాలను, వాటి అర్థాలను గ్రహిస్తున్నప్పుడు తెలుగు-కన్నడ భాషలమధ్య అర్థపరంగాఉన్న సన్నిహిత సంబంధం స్పష్టమవుతుంది. ఇటువంటి వెసులుబాటుఉన్న భాషలలో ఏ ఒక్కభాషకో సంగణక నిఘంటువును తయారు చేయడం కాకుండా, రెండు భాషలకు ఏక కాలంలో నిఘంటువు కూర్చడం లాభదాయకమైన పద్ధతి.

## 4.4 అర్థవివరణలు, వాక్య ప్రయోగాలను కూర్చడం

అర్థవివరణలు, వాక్య ప్రయోగాలను కూర్చడమన్నది నిఘంటు నిర్మాణంలోని ఒక కీలక అంశం. సంప్రదాయ ముద్రణ నిఘంటువులలో స్థల పరిమితి, గ్రంథ పరిమాణ పరిమితులు, ఈ వివరణలు కూర్చడంలో ఆటంకాలుగా నిలుస్తాయి. ఎలాక్ట్రానిక ద్విభాషాద్వైదార్శనిక నిఘంటు నిర్మాణంలో ఇవి ఏ రకమైన పరిమితులూ విధించవు.

## 4.5 సాంకేతిక లేఖన ప్రమాణం

రెండు భాషల వ్యవహార ప్రాంతాలలోనూ లేఖనం తెలిసిన వ్యవహర్తలు అనేక రకాలుగా రాసే అవకాశం ఉంది. కానీ సంగణక సమాచార నిధుల రూపకల్పనలో ప్రమాణ సమాచార పరివర్తన లిపి సంకేతాలను విధిగా ఏర్పరచుకోవలసిన అవసరం ఉంది. భారతీయ భాషలకు ఉన్న ప్రమాణ సమాచార పరివర్తన సంకేత లిపిని (Indian Script Code for Information Interchange [ISCII]) ఇటువంటి ఎలాక్ట్రానిక ద్విభాషా నిఘంటువుల రుపకల్పనలో ఉపయోగించడం ద్వారా లాఘవాన్ని సాధించవచ్చు. ఆ లిపి వరుస ఇలా ఉంటుంది. అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ, ం

ఁ, ః, క్, ఖ్, గ్, ఘ్, ఙ్, చ్, ఛ్, జ్,ఝ్, ఞ్, ట్, ఠ్, డ్, ఢ్, ణ్, త్, థ్, ద్, ధ్, న్, ప్, ఫ్, బ్, భ్, మ్, య్, ర్, ల్, ళ్, వ్, శ్, ష్, స్, హ్.

## 5. ముగింపు

పై విభాగాలలో చర్చించిన అంశాలతో కూడిఉన్న నిఘంటు నిర్మాణం ఇప్పటివాడుకకు తప్పనిసరి. పదనిర్మాణంలోనూ, తత్సమ పదాల వాడకంలోనూ తెలుగు, కన్నడ భాషల మధ్య సన్నిహిత సంబంధం ఉంది. వీటిని జాగ్రత్తగా గుర్తించి సమగ్ర ద్విభాషాద్విదార్శనిక ఎలాక్ట్రానిక్ నిఘంటువులను కూర్చడంవల్ల రెండు ప్రాంతాల వ్యవహర్తలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. నిఘంటు వనరుల వృద్ధిద్వారా విజ్ఞాన శాఖలను పుష్టిమంతం చేసుకోగలుగుతాం. అనునిత్యం బహుముఖాలుగా వెలుగుచూస్తున్న శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలను అవగాహన చేసుకోడానికి అవసరమైన అనువాదాలను కూర్చుకోడంలో నిఘంటువనరులకు కీలకమైన స్థానంఉంది. నిఘంటువనరుల వృద్ధి, అనువదించుకోవడానికి కావాల్సిన పద సంపద ఉన్న భాషలే ఈ యుగంలో మనగలుగుతాయి. ఈ దృష్టి నుంచి నిఘంటు నిర్మాణ పద్ధతులను పునర్మూల్యాంకనం చేసికొని, ఆ ముఖంగా ప్రయత్నం ప్రారంభించవలసిన అవసరం ఉంది.

## 6. ఉపయుక్త గ్రంథ/ఆకర సూచి


6.1 తెలుగు

6.1.1 ఉషారాణి, గోవిందరాజులు, పి. 2003. తెలుగు నిఘంటువులు-ఒక అధ్యయనము. తిరుపతి.

6.1.2 కృష్ణమూర్తి, భద్రిరాజు. 1962. మాండలిక వృత్తిపదకోశం. ప్రథమ సంపుటం-వ్యవసాయపదాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6.1.3 ____________ 1971. మాండలిక వృత్తిపదకోశం. ద్వితీయ సంపుటం-చేనేత పదాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6.1.4 ____________ (సం.) 2010. తెలుగు భాషా చరిత్ర. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

6.1.5 తెలుగు-కన్నడ నిఘంటువు. 2004. హైదరాబాదు: తెలుగు అకాడమి

6.1.6 సుందరం, ఆర్వీయస్. 1977. కన్నడ సాహిత్య చరిత్ర. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6.2. పత్రం

6.2.1 పవన్ కుమార్, పమ్మి. 2012. సంగణకాత్మక తెలుగు మాండలిక నిఘంటు నిర్మాణం. తెలుగు అంతర్జాతీయ రెండో అంతర్జాల సదస్సులో సమర్పించిన పత్రం. నవంబరు 1-2, 2012. గీతం విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

### 6.3 English

6.3.1 Atkins, S. & Jundell, M. 2008. *The Oxford Guide to Practical Lexicography*. OU Press: 238-246.

6.3.2. De Schrver, Gilles-Maurice,. 2003. *Lexicographers dreams in the electronic dictionary age* in International Journal of Lexicography, 16(2): 143-199

### 6.4 Dictionaries

6.4.1 Bucher. 1987. Kannada-English Dictionary. New Delhi: Asian Educational Services.

6.4.2 Kittel, F. 1999. A Kannada-English Dictionary. New Delhi, Madras: Asian Educational Services.

### 6.5 URLs:

6.5.1 http://glosbe.com/te/kn/

6.5.2 http://www.fileguru.com/apps/telugu_to_kannada_dictionary

6.5.3 http://ptf.com/telugu/telugu+kannada+dictionary/

6.5.4 http://www.edaboard.com/thread132859.html

(తెలుగుపై ఇతర ద్రావిడ భాషల ప్రభావం అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సులో సమర్పించిన పత్రం. 25-27 మార్చి, 2013. భాషాశాస్త్రశాఖ, శ్రీ వేంకటేశ్వర విశవిద్యాలయం. తిరుపతి. ఆంధ్ర ప్రదేశ్.)